www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## హాకీ.. ఆశల పల్లకీ

పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్స్‌కు చేరిన భారత్

బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ ఓటమి.. నేడు కాంస్య పోరు

బాక్సింగ్ క్వార్టర్ ఫైనల్స్‌లో లవ్లీనా పరాజయం 9

ఒత్తిడిలోనూ ప్రత్యర్థులను హడలెత్తిస్తూ భారత పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో పతకం దిశగా దూసుకెళ్తోంది. వరుసగా రెండోసారి సెమీఫైనల్ చేరింది. ఆదివారం హోరాహోరీ క్వార్టర్స్‌లో 4-2తో షూటౌట్‌లో గ్రేట్ బ్రిటన్‌ను ఓడించింది.



సోమవారం | 5-8-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 111 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 6.04 తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష మ. 3.21 తదుపరి మఖ; వర్జ్యం: తె. 4.32 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.46-1.37, మ. 3.19-4.09; అమృతఘడియలు: మ. 1.37-3.21; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



# యూట్యూబర్లపై ఆంక్షల పిడుగు!

**ప్రసార సేవల నియంత్రణ సవరణ బిల్లు పేరిట నిబంధనాలు**

కాపీ ఇచ్చిన ప్రతి వ్యక్తికీ బిల్లుపై వాటర్‌మార్క్

కేంద్రం గోప్యత.. కొద్దిమందితోనే చర్చలు

విమర్శించే వారికి ఇకపైన గడ్డు పరిస్థితులు

నిఘాలోకి యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు

నిబంధనలు కఠినం.. భారీ జరిమానా, నిషేధం

చట్ట రూపం దాల్చితే భావప్రకటనా స్వేచ్ఛ ఖతం

సోషల్ మీడియాపై ఉక్కుపాదమే: విపక్షాలు

ప్రతిపక్షాలు అండగా ఉండాలి: యూట్యూబర్లు



*లోక్‌సభ ఎన్నికల్లో పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు తమకు వ్యతిరేకంగా పని చేశారని మోదీ ప్రభుత్వం భావిస్తోందా? తాము ఆశించిన ఫలితాలు రాకపోవటానికి, ప్రతిపక్షం అంతోఇంతో బలం సమకూర్చుకోవటానికి వీరు విస్తృతంగా జరిపిన ప్రచారమే కారణమని అనుకుంటోందా? ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాను, యూట్యూబర్లను, స్వతంత్ర జర్నలిస్టులను కూడా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందా? 'ప్రసార సేవల నియంత్రణ బిల్లు' విషయంలో గోప్యత, బిల్లులో ఉన్నాయని భావిస్తున్న కఠినమైన ఆంక్షలు ఈ సందేహాలను రేకెత్తిస్తున్నాయి. దీంతో బిల్లుపై ప్రతిపక్షాల నుంచి యూట్యూబర్ల వరకూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది.*

(సెంట్రల్ డెస్క్)

'ప్రసార సేవల నియంత్రణ బిల్లు' తొలి ముసాయిదా గత ఏడాది విడుదలైంది. ప్రధానంగా ఓటీటీ వేదికలు, ప్రసారసంస్థలను ఉద్దేశించి రూపొందించిన ఈ బిల్లుపై అప్పట్లోనే ఆందోళన వ్యక్తమైంది. లోక్‌సభ ఎన్నికలు రావటంతో ఈ అంశం తాత్కాలికంగా తెరమరుగైంది. ఎన్నికలు ముగిసి మోదీ వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తాజాగా మరోసారి బిల్లు చర్చనీయాంశమైంది. ఈ బిల్లులో పలు సవరణలు చేసి, ఎంపిక చేసిన కొందరికి ఇటీవల అందజేశారని, వారితోనే దీనిపై సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడైంది. అంతేకాదు, బిల్లు కాపీని ఇచ్చిన ప్రతి వ్యక్తికీ ఆ బిల్లుపై ఓ ప్రత్యేకమైన వాటర్‌మార్క్ ముద్రించారని, ఒకవేళ ఎవరైనా బిల్లును 'లీక్' చేస్తే ఎవరి ద్వారా అది జరిగిందో తెలుసుకోవటానికి

మిగతా 2వ పేజీలో...



# సంక్షేమం.. అభివృద్ధి

**రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు సమగ్ర వ్యూహం**

## నేడు కలెక్టర్లకు దిశానిర్దేశం

కుటుంబంలో వ్యక్తి యూనిట్‌గా సంక్షేమ కార్యాచరణ

మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామాల్లో పురోగతి

క్షేత్రస్థాయిలో వాస్తవాలకే ప్రాధాన్యం.. భజనకు దూరం

సమస్యలు ప్రస్తావించి, పరిష్కారం కోరేవారికే ప్రాధాన్యం

సుదీర్ఘ మీటింగ్‌లు, లేట్‌నైట్ సమీక్షలు బంద్

ఇకపై శని, ఆదివారాల్లో సమావేశాలూ రద్దు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా కూటమి సర్కారు శరవేగంగా అడుగులు వేస్తోంది. విభజన గాయాల నుంచి కోలుకునే దశలో మాజీ సీఎం జగన్ చేసిన విధ్వంసం నుంచి బయటపడడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిలో తన కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. తన ఆలోచనలు, కూటమి ప్రభుత్వ విధానాలను వారికి వివరించి దిశానిర్దేశం చేయనున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి,

మిగతా 11వ పేజీలో...

# గోబెల్స్ సిగ్గుపడేలా..



## అబద్ధాలే పునాదిగా జగన్ రాజకీయం

బాబు ప్రభుత్వంపై విషప్రచారం

36 మంది రాజకీయ హత్యలట

ప్రభుత్వం పేర్లు అడిగితే సైలెంట్

ఇంకా ఎన్నెన్నో ఆరోపణలు

ప్రభుత్వం కఠినంగా ఉండాలంటున్న టీడీపీ శ్రేణులు

చర్యల్లేకుంటే నష్టమని హెచ్చరిక

జగన్ వైఖరితో సొంత పార్టీలోనూ అసంతృప్తి

### చిత్తుగా ఓడినా మారని వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పాలించే నాయకుడికి విజన్ ఉండాలి. అలాగే జనరంజక, పారదర్శక పాలన అందించాలంటే సమర్థత ఉండాలి. జగన్‌కు ఈ రెండు లక్షణాలూ లేవని ఓటర్లు తీర్పు చెప్పేశారు. అయినా ఆయన మారలేదు. మళ్లీ అబద్ధాల పునాదులపైనే రాజకీయం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామా, బాబాయ్ హత్య కేసుపై నాటకం, పింక్ డైమండ్ కట్టు కథ.. ఇలా జగన్, ఆయన పార్టీ వారు ఎన్నో అబద్ధాలు చెప్పారు. 35 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐలకు డీఎస్పీలుగా

మిగతా 11వ పేజీలో...

## పుణె మునక

ముంచెత్తిన ఖడక్‌వాస్లా డ్యాం నీరు

సహాయక చర్యల్లో సైన్యం 2

నాసిక్ వద్ద గోదావరి ఉరకలు

మధ్యప్రదేశ్‌లో ఇంటి గోడ కూలి 9 మంది చిన్నారుల దుర్మరణం

హిమాచల్‌లో 11కు చేరిన మృతులు

## మీడియం ఇంగ్లిష్.. పరీక్షలు తెలుగులో

కొన్ని సీబీఎస్ఈ బడుల్లో రాస్తున్నట్లు గుర్తింపు

వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో సిలబస్

ఈ ఏడాది తొలిసారి సీబీఎస్ఈ బోర్డుతో టెస్ట్ పరీక్షలు

ఎఫ్ఏ-1 ద్వారా విద్యార్థుల సామర్థ్యం అంచనా

పాఠశాల విద్యాశాఖలో దిద్దుబాటు చర్యలు 3



విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో కబ్జాకు గురైన భూమి

## 'జోగి'పై హైకోర్టులో కేసు

రమేశ్ కుటుంబ సభ్యులు అగ్రిగోల్డ్ భూదందా

సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమి కబ్జా

ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్న వైనం

భూముల సంరక్షణలో అధికారుల వైఫల్యం

జోగి కుటుంబ సభ్యులకు సహకారం 12

కోర్టును ఆశ్రయించిన అగ్రి యాజమాన్యం

భూముల్ని సంరక్షించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి



బోగీలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

విశాఖ రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం

ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉన్న సమయంలో సంఘటన

ఏసీ కోచ్‌ల నుంచి రేగిన మంటలు, పొగ

పూర్తిగా దగ్ధమైన బీ7 ఏసీ కోచ్ 12

పాక్షికంగా కాలిన మరో రెండు కోచ్‌లు

స్టేషన్‌లో భయంతో ప్రయాణికులు పరుగులు

ఖాళీ రైలు కావడంతో తప్పిన ప్రాణనష్టం

# మూడో ప్రపంచ యుద్ధం.. ముప్పు అంచున?

ఇజ్రాయెల్‌పై కయ్యానికి కాలుదువ్వుతున్న ఇరాన్

ఇరాన్‌కు రష్యా.. ఇజ్రాయెల్‌కు అమెరికా, యూకే అండ

'అబ్రహం కూటమి' ఏర్పాటుకు నెతన్యాహు ప్రతిపాదన

హెజ్బొల్లా, హౌతీ, హమా‌స్‌తో ఇరాన్ ఏర్పాటు చేసిన ప్రాక్సీ నెట్‌వర్క్‌ను కూటమిగా ఏర్పడి దెబ్బతీసే యోచన



టెహ్రాన్, టెల్ అవీవ్, ఆగస్టు 4: చినికి చినికి గాలివానగా మారిందన్న సామెత చందంగా.. ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణ ఇరాన్ ప్రవేశంతో మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితి కనిపిస్తోంది! ఇజ్రాయెల్‌కు అండగా రంగంలోకి దిగేందుకు అమెరికా ఇప్పటికే సిద్ధం కాగా.. ఇరాన్‌కు సైనిక సాయం అందించేందుకు రష్యా సిద్ధమైనట్లు సమాచారం. తమ దేశంలో అతిథిగా ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో

మిగతా 2వ పేజీలో...



## బంగ్లాలో మళ్లీ రక్తపాతం

### అల్లర్లలో 93 మంది మృతి

వందలాది మందికి తీవ్ర గాయాలు

ప్రధాని షేక్ హసీనా రాజీనామా డిమాండ్‌తో విద్యార్థుల నిరసనలు 2

అధికార పార్టీ శ్రేణులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ హింసాత్మకం

## సాగరం ముమ్మందుకు

2100 నాటికి పెరగనున్న సముద్ర మట్టాలు

సాధారణ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు పెరిగే అవకాశం

మంచు కరిగి మట్టాలు పెరిగితే తీరాలకు నష్టమే

దేశంలో సముద్రపు కోత అధికంగా ఉన్న ఐదు తూర్పు తీర రాష్ట్రాల్లో ఏపీది నాలుగో స్థానం

వెరీ హైరిస్క్ జోన్‌లో 43%, హైరిస్క్ జోన్‌లో 35% తీరం

దక్షిణ ఏపీలో వర్షాలు కురిసే రోజుల్లో పెరుగుదల

రాయలసీమలో మరింత కరువు పరిస్థితులు 12

ఏపీలో వాతావరణ మార్పులపై ఎన్‌సీఎస్‌సీఎం నివేదిక

## నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

576 అడుగులు దాటిన జలాశయ నీటి మట్టం 12

ఉదయం 8 గంటలకు గేట్లు తెరిచేందుకు ఏర్పాట్లు



# ఉత్తరాదిన వర్ష బీభత్సం


పుణెలో వరద గుప్పిట్లో ఓ కాలనీ

- పుణెను ముంచెత్తిన ఖడక్‌వాస్లా డ్యాం నీరు
- మధ్యప్రదేశ్‌లో గోడ కూలి 9మంది చిన్నారుల మృతి

పుణె, నాసిక్, సాగర్(ఎంపీ), సిమ్లా, ఆగస్టు 4: భారీ వర్షాలతో ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. మహారాష్ట్రలోని పుణె వద్ద ఖడక్‌వాస్లా డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలతో డ్యాం నుంచి ఆదివారం 35వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో ఏక్తానగర్ పరిధిలోని నివాస ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించడానికి పుణె జిల్లా మేజిస్ట్రేట్ సైన్యం సాయం కోరారు. మహారాష్ట్రలోని పాల్ఘర్, పుణె, సతారా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. థానే, ముంబై, రాయ్‌గఢ్, సింధుదుర్గ్, నాసిక్‌లలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక నాసిక్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతాలతో పాటు గోదావరి ఒడ్డున నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలిన ఘటనలో 9మంది చిన్నారులు మృతిచెందారు. రెహ్లీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి షాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి 9గంటల మధ్య 'పార్థివ లింగ నిర్మాణ్' కార్యక్రమం నిర్వహించారు. అక్కడి ఆలయ సమీపంలో వేసిన గుడారం కింద పిల్లలంతా కూర్చున్నారని, వర్షాల కారణంగా అక్కడున్న ఓ ఇంటి గోడ కూలి గుడారంపై పడిందని అధికారులు వెల్లడించారు. గుడారం, శిథిలాల కింద నలిగి పిల్లలు చనిపోయారని స్థానికులు తెలిపారు. మృతులంతా 10 నుంచి 15 ఏళ్లలోపు వయసు వారే. ఇదిలా ఉండగా, ఈశాన్య మధ్యప్రదేశ్‌లో తీవ్ర అల్పపీడనం, పశ్చిమ రాజస్థాన్‌లో అల్పపీడనం కారణంగా బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర మధ్యప్రదేశ్, దానిని అనుకొని ఉత్తరప్రదేశ్ మీదుగా కదులుతున్న ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉంది.

## లోకం తీరు




## వయనాడ్‌లో 365కు పెరిగిన మరణాలు

- ఇంకా 206 మంది గల్లంతు

వయనాడ్, ఆగస్టు 4: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ విషాదంలో మృతుల సంఖ్య 365కు చేరుకున్నట్లు అధికారులు ప్రకటించారు. మృతుల్లో 30 మంది చిన్నారులున్నారు. మరో 206 మంది గల్లంతయ్యారని, వారిని వెతికేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఆరో రోజు సహాయక చర్యల్లోనూ మృతదేహాలు లభ్యమవుతున్నాయే తప్ప.. సజీవంగా ఎవరూ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 148 మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. గాలింపు చర్యలను సోమవారంతో ముగిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. 93 పునరావాస కేంద్రాల్లో 10 వేల మంది ఆశ్రయం పొందుతున్నారన్నారు. కాగా.. కేరళలో వరద, భారీ వర్షాలు ఇంకా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం సూచిపారా ప్రాంతంలో వరదలో చిక్కుకుపోయిన ఐదుగురు వ్యక్తులను కాపాడినట్లు వాయుసేన తెలిపింది. వయనాడ్ విషాదం గురించి పోలీసులు, అగ్నిమాపక శాఖ, విపత్తు నిర్వహణ విభాగాలకు తొలుత సమాచారం అందించిన మహిళ నీతూ జోజో కూడా వరదలో కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించడం సాధ్యం కాదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ అన్నారు. కేంద్ర మంత్రి సురేశ్ గోపీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే.. కేంద్రం అవసరమైన సాయాన్ని అందజేస్తుందని వీరిద్దరూ చెప్పారు.

## చదువులను దెబ్బతీస్తున్న స్మార్ట్‌ఫోన్

- ప్రతి 4 దేశాల్లో ఒక దేశంలోని స్కూళ్లలో నిషేధం
- గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 4: స్మార్ట్ ఫోన్ వినియోగం విద్యార్థులపై దుష్ప్రభావం చూపిస్తోందని గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్(జెమ్) నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం చేసిన జెమ్.. స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని సాంకేతికత వరకు పరిమితం చేస్తే మేలనని పేర్కొంది. కానీ, దీనికంటే కూడా విద్యార్థులపై వ్యతిరేక ప్రభావాలు పడుతున్నాయని దీంతో చదువుపై వారిలో ఆసక్తి సన్నగిల్లుతోందని వివరించింది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా నాలుగుదేశాలను పరిగణనలోకి తీసుకుంటే ఒక దేశంలోని స్కూళ్లలో స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం విధించినట్టు తెలిపింది. 'విద్యలో సాంకేతికత వినియోగం' పేరుతో వెలువరించిన జెమ్ నివేదికను యునెస్కో ప్రచురించింది. ఐక్యరాజ్యసమితి విద్యా విభాగానికి చెందిన ఒక నిపుణుడు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సాంకేతికత వినియోగం ఖర్చుతో కూడుకున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్లలో ఉండే టెక్నాలజీని వినియోగించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. "విద్య, అభ్యసన విధానాల్లో డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ మాధ్యమం ద్వారా విద్యాబోధన, అభ్యసన వంటివి కొనసాగాయి" అని నివేదిక వివరించింది. అయితే.. అంతర్జాతీయ స్థాయిలో రూపొందించిన అంచనా ప్రకారం.. విద్యలో సాంకేతికతను తీసుకురావడం వల్ల అభ్యసన తీరుపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా మొబైల్ వినియోగం ద్వారా విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారని 14 దేశాల్లో చేసిన అధ్యయనం తాలూకు వివరాలను వెల్లడించింది. అయినప్పటికీ నాలుగింట ఒక దేశం మాత్రమే స్కూళ్లలో స్మార్ట్ ఫోన్ల వినియోగంపై నిషేధం విధించారని పేర్కొంది. ఇక, యునెస్కో కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంతో విద్యార్థులపై ప్రభావం పడుతోందని పేర్కొంది. మరోవైపు, మెటా అధ్యయనం కూడా ఈ అభిప్రాయమే వ్యక్తం చేసింది. 14 దేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ విద్య వరకు స్మార్ట్‌ఫోన్ల వినియోగం కారణంగా విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతోందని మెటా అధ్యయనం పేర్కొంది.

## అప్పట్లో వివాహేతర సంబంధం ఉండేది!

- కమలా హారీస్ భర్త ఒప్పుకోలు

వాషింగ్టన్, ఆగస్టు 4: మొదటి భార్యతో కాపురం చేసిన సమయంలో తనకు వివాహేతర సంబంధం ఉండేదని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారీస్ భర్త డగ్ ఎమ్‌హాఫ్ అంగీకరించారు. కమలా హారీస్ ఆయనకు రెండో భార్య కావడం గమనార్హం. ఈ విషయాలను ఓ న్యూస్ ఛానెల్ వెల్లడించింది. మొదటి భార్య కెర్‌స్టిన్ ఎమ్‌హాఫ్‌తో కలిసి ఉన్న సమయంలో ఆయనకు ఓ స్కూలు టీచరుతో సంబంధం ఉండేది. వారి పిల్లలు అదే పాఠశాలలో చదివే వారు. ఆమె మాత్రం ఆ పిల్లలకు బోధించేది కాదు. డగ్ కారణంగా 2009లో ఆమె గర్భం దాల్చింది. కానీ గర్భస్రావం కావడంతో ఆమె తల్లికాలేకపోయింది. ఈ కారణంగానే డగ్, కెర్‌స్టిన్‌లు 2010లో విడిపోవాల్సి వచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా మొదటి భార్యతో ఇబ్బందులు ఎదురయ్యాయయని డగ్ అంగీకరించారు. ఇందుకు బాధ్యత తీసుకుంటున్నట్టు చెప్పారు. వారికి కలిగిన సంతానం ఎల్లా, కోల్‌లు ఆయనతో పాటే నివసించడం ప్రారంభించారు. అనంతరం ఆయనకు 2013లో కమలా హారిస్‌తో పరిచయం ఏర్పడింది. 2014లో వారి వివాహం జరిగింది. అప్పటికే మేజర్లయిన ఎల్లా, కోల్‌లు కమలతోనే నివసించడం ప్రారంభించారు. డగ్..ఎంటర్‌టెయిన్‌మెంట్ లాయర్‌గా విధులు నిర్వర్తించే వారు. డగ్ వ్యక్తిగత జీవితం, వివాహేతర సంబంధాల గురించి కమలా హారిస్‌కు, పార్టీ నాయకులకు పూర్తిగా తెలుసునని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కమలా హారిస్‌ను పిల్లలు ఎల్లా, కోల్‌లు 'మామలా' అని పిలుస్తుంటారు. కోల్ వివాహాన్ని గత ఏడాది కమలా హారిసే దగ్గరుండి జరిపించడం విశేషం. కెరిస్టిన్ ఎమ్‌హాఫ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ పలు కారణాల దృష్ట్యా డగ్‌తో విడిపోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే ఆయన పిల్లలను జాగ్రత్తగా చూసుకొనే మంచి తండ్రి అని ప్రశంసించారు.

# మూడో ప్రపంచ యుద్ధం.. ముప్పు అంచున?

(మొదటి పేజీ తరువాయి)




రగిలిపోతున్న ఇరాన్.. సోమవారం తమపై యుద్ధానికి దిగే ప్రమాదం ఉందని ఇజ్రాయెల్ అంచనా వేస్తోంది. దీంతో.. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇరాన్ తమ దేశంపై చేసిన దాడిని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జోర్డాన్ దేశాల సాయంతో ఎదుర్కొన్నట్టే ఇప్పుడు కూడా అమెరికా, యూకేతో నాటో తరహాలో ఒక కూటమిగా ఏర్పడి ఎదుర్కోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభిప్రాయపడుతున్నారు. ఆయన దీన్ని 'అబ్రహామ్ కూటమి'గా వ్యవహరిస్తున్నారు! 1979లో వచ్చిన ఇస్లామిక్ విప్లవం అనంతరం ఇరాన్ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి.. లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హౌతీలు, గాజాలో హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ గ్రూపు, ఇరాక్‌లో షియా మిలీషియా గ్రూపులతో ఒక ప్రాక్సీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. దాన్ని 'ద యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' అని పిలుస్తారు. ఈ కూటమిని ఎదుర్కోవాలంటే.. అమెరికా, యూకే వంటి దేశాలతో 'అబ్రహాం కూటమి'ని ఏర్పాటు చేసి కలిసికట్టుగా పోరాడాలన్నది నెతన్యాహు ఆలోచన. ఈ వ్యూహంలో భాగంగానే ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్.. అమెరికా, బ్రిటన్ రక్షణ మంత్రులు లాయడ్ ఆస్టిన్, జాన్ హీలేతో ఇప్పటికే మాట్లాడారు. మరోవైపు.. అమెరికా సెంట్రల్ కమాండ్ జనరల్ మైకేల్ కురిల్లా గల్ఫ్ దేశాల నేతలతో చర్చలు జరిపేందుకు అక్కడికి చేరుకున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న తన సేనల సంఖ్యను అమెరికా పెంచుతోంది. మరిన్ని విమానవాహక యుద్ధనౌకలను, యుద్ధవిమానాలను ఆ ప్రాంతానికి పంపుతున్నట్టు పెంటగాన్ మూడురోజుల క్రితమే ఒక ప్రకటనలో తెలిపింది.

### నాలుగు నెలల క్రితం..

సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇరాన్ రాయబార కార్యాలయంపై ఈ ఏడాది ఏప్రిల్ 1న ఇజ్రాయెల్ చేసిన బాంబుదాడిలో ఇద్దరు ఇరానియన్ జనరల్స్ సహా 16 మంది మరణించారు. దీంతో ఇరాన్ ఏప్రిల్ 13న ఇజ్రాయెల్‌పై 300కు పైగా డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఇజ్రాయెల్ ఆ దాడిని అమెరికా, యూకే, జోర్డాన్, ఫ్రాన్స్ అండతోనూ, తన యారో-3, డేవిడ్స్ స్లింగ్ రక్షణ వ్యవస్థలతో సమర్థంగా తిప్పికొట్టింది. అయితే, ఈసారి ఇరాన్‌కు అండగా ఇప్పటికే రష్యా సైనిక విమానాలు ఇరాన్‌లో ల్యాండ్ అవుతున్నాయని.. రష్యాకు చెందిన అత్యంత అధునాతనమైన కమ్యూనికేషన్ జామింగ్ వ్యవస్థను వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఇరాన్ ఏర్పాటు చేసిందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇలా ఇరువైపులా అగ్రరాజ్యాలు రంగంలోకి దిగితే అది మూడో ప్రపంచయుద్ధానికి దారితీయొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, గాజాలో రెండు పాఠశాలలే లక్ష్యంగా ఇజ్రాయెల్ సేనలు శనివారం చేసిన దాడిలో 25 మంది పాలస్తీనియన్లు చనిపోయారు.

### హూతీల దాడులు మళ్లీ ప్రారంభం

యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలోని నౌకలపై మళ్లీ దాడులు ప్రారంభించారు. గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో శనివారం ఓ వాణిజ్య నౌకపై క్షిపణితో దాడికి పాల్పడ్డారు. క్షిపణి దాడి జరిగినట్లు నౌకా భద్రతాధికారి ధ్రువీకరించారని యూకే మేరీటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. అయితే ఈ దాడి వల్ల నౌకకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని తెలిపింది. లైబేరియన్ జెండాతో యూఏఈ నుంచి సౌదీ అరేబియా వెళ్తున్న గ్రోటన్ నౌకపై ఈ దాడి జరిగినట్లు చెప్పింది.

## ప్రపంచ యుద్ధం.. నేడే మొదలు?

- భారత నోస్ట్రడామస్‌గా పేరొందిన కుశాల్‌కుమార్ తాజా అంచనా



భారత నోస్ట్రడామస్‌గా పేరొందిన కుశాల్‌కుమార్ అనే జ్యోతిష్కుడు.. సోమవారం లేదా మంగళవారం నుంచి మూడో ప్రపంచ యుద్ధం మొదలవుతుందని ప్రకటించారు. నిజానికి ఈయన మూడో ప్రపంచ యుద్ధం మొదలయ్యే తేదీలను ప్రకటించడం ఇదే మొదటిసారి కాదు. 2024 జూన్ 18న మొదలవుతుందని ఒకసారి.. జూలై 26 లేదా 28 తేదీల్లో యుద్ధభేరి మోగుతుందని మరోసారి.. చెప్పారు. కానీ, రెండు సార్లూ ఆయన జోస్యం ఫలించలేదు. హరియాణాకు చెందిన కుశాల్‌కుమార్ జ్యోతిష ప్రతిభ ఎంత గొప్పదో తెలియదుగానీ ఆయన చాలా పాపులర్. ఆయన వ్యాసాలు అంతర్జాతీయ జ్యోతిష మ్యాగజైన్లలో ప్రచురితమయ్యాయి.

## యాపిల్ యూజర్లకు కేంద్రం 'హై-రిస్క్' అలర్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 4: యాపిల్ ఉత్పత్తుల వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఫోన్, ఐప్యాడ్స్, మ్యాక్‌బుక్స్ సహా ఇతర యాపిల్ పరికరాలకు 'హై రిస్క్' అలర్ట్ ఇచ్చింది. యాపిల్ ఉత్పత్తుల్లో గుర్తించిన కీలకమైన లోపాలు ఆయా పరికరాలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ ఏజెన్సీ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) హెచ్చరికలు జారీచేసింది. ఈ లోపాల వలన హ్యాకర్లు ఏకపక్షంగా కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేసి డివైజ్‌లను రిమోట్‌గా ఆపరేట్ చేసే ముప్పు ఉందని హెచ్చరించింది. దీనివల్ల సున్నితమైన సమాచార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. కాబట్టి యాపిల్ యూజర్లు వెంటనే తమ ఉత్పత్తులను లేటెస్ట్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ వెర్షన్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. దీనిపై యాపిల్ సంస్థ కూడా స్పందించింది. యాపిల్ పరికరాలపై పెగాసస్ తరహాలో స్పైవేర్ దాడులు జరిగే అవకాశం ఉందని భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో ఉన్న తన వినియోగదారులను అప్రమత్తం చేసింది. భారత్‌లో.. జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా కుమార్తె, మీడియా సలహాదారు ఇల్తిజా ముఫ్తీ, సమృద్ధ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పుష్పరాజ్ దేశ్‌పాండే సహా పలువురు ప్రముఖులు ఈ హెచ్చరికలు అందుకున్నట్టు సమాచారం.

### లోపాలు గుర్తించిన వెర్షన్లు ఇవే...

- ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్ 17.6, 16.7.9కు ముందు వెర్షన్లు
- ఐమ్యాక్ ఓఎస్ 14.6 (సొనోమా), 13.6.8 (వెంచురా), 12.7.6 (మోంటెరీ)కి ముందు వెర్షన్లు
- ఐవాచ్ ఓఎస్ 10.6కు ముందు వెర్షన్లు
- యాపిల్ టీవీ ఓఎస్ 17.6కు ముందు వెర్షన్లు
- యాపిల్ విజన్ ఓఎస్ 1.3కు ముందు వెర్షన్లు
- సఫారీ ఓఎస్ 17.6కు ముందు వెర్షన్లు

## బంగ్లాదేశ్‌లో మళ్లీ రక్తపాతం

93 మంది మృతి, వందలాది మందికి గాయాలు

షేక్ హసీనా రాజీనామాకు విద్యార్థుల డిమాండ్

ఢాకా, ఆగస్టు 4 : బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. ప్రధాన మంత్రి షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాలనే ఏకైక డిమాండ్‌తో విద్యార్థులు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం తొలి రోజు, ఆదివారం దేశ వ్యాప్తంగా రక్తపాతానికి దారి తీసింది. విద్యార్థులు, అధికార అవామీ లీగ్ పార్టీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణల్లో దేశ వ్యాప్తంగా ఇప్పటిదాకా 14 మంది పోలీసులు సహా 93 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో అప్రమత్తమైన హోం శాఖ ఆదివారం సాయంత్రం నుంచి దేశ వ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూను అమలుకు అంతేకాక, ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సేవలను దేశ వ్యాప్తంగా తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే, 4జీ సేవలను కూడా ఆపేయాలని మొబైల్ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదేశించింది. ప్రధాని హసీనా చర్చలకు ఆహ్వానించినా ఆమెతో మాట్లాడేందుకు ఆందోళనకారులు తిరస్కరించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై జరిగిన నిరసనల్లో ఇటీవల 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాలకు బాధ్యత వహిస్తూ ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌తో విద్యార్థులు ఉద్యమబాట పట్టారు. దేశ వ్యాప్తంగా హింస చెలరేగడంపై స్పందించిన ప్రధాని హసీనా షేక్.. విద్యార్థుల ముసుగులో టెర్రరిస్టులు హింసకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, హింసకు పాల్పడుతున్నవారిని అణిచి వేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్మీ, నేవీ, వాయుసేన చీఫ్‌లు, పోలీసు విభాగాల ఉన్నతాధికారులతో హసీనా సమావేశమయ్యారు.

# మొస్సాద్ యమా డేంజర్!

**శత్రువుపై విష ప్రయోగంలో దిట్ట.. విరుగుడు కూడా ఎవరికీ తెలియదు**

మొస్సాద్..! ఇజ్రాయెల్‌కు చెందిన అత్యంత శక్తిమంతమైన నిఘా, స్పెషల్ ఆపరేషన్ల సంస్థ..! ఈ సంస్థ ఒక ఆపరేషన్‌ను ఎంచుకుంటే.. శత్రువు అంతంతోనే అది ముగుస్తుంది. హిట్‌లిస్టులో ఉన్న శత్రువు భూప్రపంచంలో ఎక్కడ దాక్కొని ఉన్నా.. వెతికి, వేటాడి చంపడం మొస్సాద్ స్టైల్..! విదేశీ గడ్డపై విషప్రయోగాలు.. బాంబు దాడులు.. క్షిపణి దాడులతో శత్రువును మట్టుబెడుతుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆశ్రయం పొందుతున్న హమాస్ నేత ఇస్మాయిల్ హనియే హత్యతో మరోసారి మొస్సాద్ పేరు వార్తల్లోకెక్కింది.


మొస్సాద్ చీఫ్ డేవిడ్ బార్నియాతో నెతన్యాహు

### టూత్ పేస్టుతో హైజాకర్ హత్య

1978లో అఫ్ఘానిస్థాన్‌లోని బగ్దాద్‌లో వాదీ హదాద్ హత్య ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తోంది. ఆయన లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా ధ్యేయంగా ఏర్పాటైన పాపులర్ ఫ్రంట్ సంస్థకు చీఫ్. 1976లో టెల్‌అవీవ్ విమానాశ్రయంలో 'ఎయిర్ ఫ్రాన్స్' విమానాన్ని హైజాక్ చేశాడు. అప్పట్లో లెఫ్టినెంట్ కల్నల్ యోనతాన్ నెతన్యాహు (ప్రస్తుత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోదరుడు) నేతృత్వంలో 'థండర్‌బోల్ట్' పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌లో బందీలను విడిపించగలిగారు. ఈ పోరులో యోనతాన్ నెతన్యాహు వీరమరణం పొందారు. దాంతో ఇజ్రాయెల్ హిట్‌లిస్టులోకి వాదీ హదాద్ చేరాడు. బగ్దాద్‌లో తలదాచుకున్న వాదీని తుదముట్టించేందుకు 'ఏజెంట్ సాడ్‌నెస్'ను రంగంలోకి దిగాడు. అతను బగ్దాద్‌లోని వాదీ ఇంట్లో పనివాడిలా చేరాడు. 1978 జనవరి 10న వాదీ వాడే టూత్‌పేస్టును మార్చి ఇజ్రాయెల్ తయారు చేసిన విషపు టూత్‌పేస్టును పెట్టాడు. ఆ పేస్టును వాడిన వాదీ ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. జర్మనీకి తరలించినా వైద్యులు ఆయనను బతికించలేకపోయారు. 1978 మార్చి 29న వాదీ చనిపోయాడు. అయితే 3 దశాబ్దాలు దాటే వరకు.. అతను చనిపోవడానికి కారణం విషపు టూత్‌పేస్టు అనే విషయం బయటి ప్రపంచానికి తెలియదు. పాలస్తీనా లిబరేషన్ కోసం ఖలీల్ మెషాల్ జోర్డాన్‌లో తలదాచుకుంటూనే ఇజ్రాయెల్‌పై దాడులకు వ్యూహాలను రచించి, అమలు చేశాడు. 1997లో మొస్సాద్ ఏజెంట్లు ఇతణ్ని ఇజ్రాయెల్‌లో చంపేందుకు స్కెచ్ వేశారు. ఖలీద్ చెవిలో విషాన్ని పిచికారీ చేశారు. దాంతో ఖలీద్ కోమాలోకి వెళ్లిపోయాడు. ఈ ఘటన అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు కారణమవ్వడంతో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ రంగంలోకి దిగారు. ఆయన ఒత్తిడితో ఇజ్రాయెల్ విరుగుడును అందజేసింది.

### హనియే, డైఫ్ ఖతం

గత ఏడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే..! హమాస్ అగ్రనాయకులు కొందరు ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్' ప్రార్థనలు నిర్వహించారు. అలా ప్రార్థనలు చేస్తున్న వీడియోల్లో ఉన్నవారంతా ఇప్పుడు ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో చేరిపోయారు. వీరిలో ఇస్మాయిల్ హనియే, మహమ్మద్ అల్-డైఫ్‌ను ఇజ్రాయెల్ ఇటీవలే తుదముట్టించింది.

### చిక్కుల్లో 33 మంది ఏజెంట్లు

ఆపరేషన్ల సమయంలో ఏజెంట్లు చిక్కుల్లో పడ్డ దాఖలాలు కూడా ఉన్నాయి. ఇరాన్ ఇలా 20 మంది దాకా మొస్సాద్ ఏజెంట్లను నిర్బంధించినట్లు గత ఏడాది వార్తలు వచ్చాయి. తుర్కియేలోనూ 33 మంది ఏజెంట్లు చిక్కారు. గాజాలో సైనిక విభాగం-పొలిటికల్ బ్యూరో మధ్య ఫాతిమా హమాద్ సంధానకర్తగా ఉన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఆమె తుర్కియేలో తలదాచుకుంటున్నారు. ఫాతిమాను తుదముట్టించేందుకు 50 మంది దాకా మొస్సాద్ ఏజెంట్లు తుర్కియేలో వేట ప్రారంభించారు. ఈ క్రమంలో 33 మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు తుర్కియే గత ఏడాది డిసెంబరులో ప్రకటించింది. గూఢచర్యం నేరం కింద వీరికి ఉరిశిక్ష విధించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. -సెంట్రల్ డెస్క్

# యూట్యూబర్లపై ఆంక్షల పిడుగు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ పని చేశారని తెలుస్తోంది. దేశ ప్రజానీకాన్ని ప్రభావితం చేసే చట్టాల రూపకల్పన విషయంలో ఇంతటి గోప్యత ఏమిటంటూ ప్రముఖ ఇంగ్లిష్ దినపత్రిక 'ది హిందూ' తన సంపాదకీయం ద్వారా కేంద్రాన్ని ఇటీవల ప్రశ్నించింది. సవరించిన బిల్లులో స్వతంత్ర మీడియా గొంతు నొక్కే పలు అంశాలున్నాయంటూ విపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా.. స్వతంత్ర భారతదేశంలో మనకున్న భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై ఈ బిల్లు ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దీనివల్ల కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, స్వతంత్ర మీడియా సంస్థలపై ప్రభుత్వ నిఘా పెరుగుతుందన్నారు. బిల్లులో సవరణలు చేసి ఆ ప్రతులను రహస్యంగా కొందరు వ్యక్తులకు, కొన్ని వ్యాపారసంస్థలకు ఇచ్చారని, పార్లమెంటుకు మాత్రం ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ అన్నారు.

### సవరించిన బిల్లులో ఏముంది?

సవరించిన బిల్లు ఇప్పటి వరకూ బహిర్గతం కాలేదు. వాస్తవానికి, ఒక బిల్లు చట్ట రూపం దాల్చాలంటే దాని ముసాయిదాను బహిరంగంగా వెల్లడించి, దానిపై ప్రజానీకం నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఆహ్వానించి.. వాటిపై సమీక్ష జరిపి అప్పుడుగానీ బిల్లుకు తుదిరూపం ఇవ్వరు. కానీ, ప్రసార సేవల నియంత్రణ సవరణ బిల్లు విషయంలో ఈ ప్రక్రియ జరగటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇంతకూ ఈ వివాదాస్పద బిల్లులో ఉన్న అంశాలేమిటి అన్నదానిపై సంబంధిత వర్గాలు చెబుతున్న దాని ప్రకారం..

- ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో ప్రజాదరణ ఉన్న వారిని ఇకపై డిజిటల్ వార్తా ప్రసారకులుగా గుర్తిస్తారు. బిల్లు చట్టరూపం దాల్చిన నెలరోజుల్లో ఈ డిజిటల్ వార్తా ప్రసారకులు ప్రభుత్వం వద్ద తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి ఓటీటీ వేదికలకు అమలవుతున్న మూడంచెల నియంత్రణ వ్యవస్థ కిందికి ఇక మీదట డిజిటల్ వార్తా ప్రసారకులు కూడా వస్తారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం ఈ డిజిటల్ వార్తా ప్రసారకుల కార్యాలయాలను తనిఖీ చేయవచ్చు. ఆ సందర్భంగా అవసరమైతే అక్కడున్న పరికరాలు, ఉపకరణాలు వేటినైనా స్వాధీనం చేసుకోవచ్చు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానాలతోపాటు నిషేధం విధించవచ్చు. ఉదాహరణకు, సబ్‌స్క్రైబర్ల డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయకపోతే తొలిసారి రూ.50 లక్షలు, ఆ తర్వాత నుంచి రూ.2.5 కోట్ల జరిమానా విధిస్తారు. కాగా, సదరు యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్ల గురించి ప్రభుత్వం ఏదైనా సమాచారం అడిగినప్పుడు ఆ వివరాలను మెటా, యూట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా కంపెనీలు అందించాలి. అంతేకాదు, ఆన్‌లైన్ యాడ్ నెట్‌వర్క్‌లైన గూగుల్ యాడ్‌సెన్స్, ఫేస్‌బుక్ ఆడియెన్స్ నెట్‌వర్క్ వంటివి కూడా ఈ బిల్లు కిందికి వస్తాయి. దీనివల్ల యూట్యూబర్ల ఆదాయం కూడా ప్రభావితం కానుంది.



### ప్రభావం ఎలా ఉంటుంది?

యూట్యూబర్లు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, చిన్నపాటి బృందాలతో ఆన్‌లైన్ వార్తాసంస్థలను నడుపుతున్న వాళ్లు ఈ నిబంధనలతో తమ పనిని కొనసాగించలేని పరిస్థితి ఎదురవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విధానాలను విమర్శించే వారు, ప్రజలకు వాస్తవాలను తెలియజేసే వారికి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో అసమ్మతి కీలకమైన అంశమని, దానిని వినిపిస్తున్న ధ్రువ్‌రాఠీ వంటి యూట్యూబర్లు, రవీశ్‌కుమార్ వంటి స్వతంత్ర జర్నలిస్టులే లక్ష్యంగా ఈ బిల్లు తెస్తున్నారని ఆరోపిస్తున్నారు. భారీ మీడియా కంపెనీలకు, యూట్యూబర్‌ను ఒకేగాటన గట్టి నిబంధనలు రూపొందించటం ఏమిటన్న విమర్శ వినిపిస్తోంది.

### కష్టకాలంలో ఉన్నాం.. అండగా ఉండండి!

మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో ప్రధాన మీడియాను ముఖ్యంగా జాతీయ మీడియాను తన అదుపాజ్ఞల్లో పెట్టుకుందని, దీంతో ప్రజలకు వాస్తవాలు తెలియజేసే బాధ్యతను యూట్యూబ్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా తాము నిర్వర్తించామని ఆయా రంగాల్లో పని చేస్తున్న వారు చెబుతున్నారు. అందుకే సర్కారు తమపై కక్షగట్టి, ఈ కొత్త బిల్లు తీసుకొస్తుందని ఆరోపిస్తున్నారు. తమ కృషి వల్లే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు గౌరవనీయమైన స్థాయిలో సీట్లు లభించాయని పేర్కొంటూ, ఇప్పుడు కష్టకాలంలో ఉన్న తమకు అండగా ఉండాలని కోరుతున్నారు. పార్లమెంటులో దీని గురించి ప్రస్తావించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిజంగానే సోషల్‌మీడియాలో ఉన్న అపసవ్య ధోరణులను ఎదుర్కొనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే, తాము స్వాగతిస్తామని, సహకరిస్తామని పలువురు యూట్యూబర్లు పేర్కొంటున్నారు. బిల్లును బహిరంగపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ జరుపుతున్నారు.

## చైనా సోషల్ మీడియాలో టిబెటన్ కంటెంట్‌పై నిషేధం

- తీవ్రంగా నిరసించిన టిబెటిన్ హక్కుల సంఘాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: టిబెట్ భాషలోని కంటెంట్‌ని నిషేధిస్తూ చైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం తీసుకున్న నిర్ణయంపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టిబెట్ల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తమ సంస్కృతి, సంప్రదాయాలు, అభిప్రాయాలను, జీవన సరళిని తెలియజేసేందుకు సోషల్ మీడియా మాతృభాషలో పెడుతున్న కంటెంట్‌పై నియంత్రణలు పెట్టడమేంటని నిలదీస్తున్నాయి. ధర్మశాల కేంద్రంగా పనిచేసే టిబెటన్ సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ డెమొక్రసీ (టీసీహెచ్‌ఆర్‌డీ) చైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం డౌయిన్ తీరును తీవ్రంగా ఖండించింది. చైనా సోషల్ మీడియా దిగ్గజం డౌయిన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రభావం టిబెట్ నెటిజన్లు తమ మాతృ భాషలో చేసే వీడియోలపై తీవ్ర ప్రభావం చూపనుందని టీసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ టెన్‌జీన్ దవా తెలిపారు. డౌయిన్ కంపెనీ తీసుకున్న నిర్ణయం అక్రమమని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి ఆంక్షలు పెట్టడం ద్వారా టిబెటన్ సంస్కృతిని, భాషని పూర్తిగా నిర్మూలించే చర్యలకు జిన్‌పింగ్ ప్రభుత్వం దిగిందని, తద్వారా టిబెటన్లతో బలవంతంగా చైనీస్ మాట్లాడించేందుకు ప్రయత్నిస్తోందని, తద్వారా టిబెట్‌లో టిబెటన్లకు చోటు లేకుండా చేయాలని చూస్తున్నారని దవా మండిపడ్డారు.

# ఇంగ్లిష్ మీడియం.. తెలుగులో పరీక్షలు

## కొన్ని సీబీఎస్ఈ బడుల్లో రాస్తున్నట్టు గుర్తింపు

- వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో సిలబస్
- ఈ ఏడాది తొలిసారి సీబీఎస్ఈ బోర్డుతో టెన్త్ పరీక్షలు
- ఎఫ్ఏ-1 ద్వారా విద్యార్థుల సామర్థ్యం అంచనా
- రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల సర్దుబాటు
- పాఠశాల విద్యాశాఖలో దిద్దుబాటు చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. పేరుకు సీబీఎస్ఈ, ఇంగ్లిష్ మీడియం అయినప్పటికీ పలు పాఠశాలల్లో తెలుగు మీడియంలో బోధన సాగుతూ, తెలుగులోనే పరీక్షలు రాస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. సీబీఎస్ఈ అమలవుతున్న పాఠశాలల్లో కొన్ని చోట్ల గతేడాది విద్యార్థుల పరీక్షా సమాధాన పత్రాలను పరిశీలించగా ఈ విషయం బయటపడింది. ఆయా బడుల్లో టీచర్లు కూడా విద్యార్థులు తెలుగులో రాసిన సమాధానాలకు తగినట్టుగా మార్కులు వేశారు. విద్యార్థుల సామర్థ్యం బాగున్నట్లు చూపించారు. దీంతో ఈ ఏడాది తొలిసారి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు రాసే వెయ్యి పాఠశాలల విద్యార్థుల పరిస్థితిపై పాఠశాల విద్యా శాఖ దృష్టి సారించింది. గొప్పలకు పోయి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయకూడదని, నిజంగా వారిలో ఎంత సామర్థ్యం ఉందనేది వెలికి తీయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ నెల 10 నుంచి సీబీఎస్ఈ పాఠశాలల్లో జరిగే ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయాలని భావిస్తోంది. పూర్తిగా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో, ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనుంది. విద్యార్థుల ప్రతిభను అంచనా వేసి సీబీఎస్ఈపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ ఉంటే 111 పాఠశాలల్లో అమలు తీరు అంతంతమాత్రంగా ఉందని, మిగిలిన బడుల్లో బాగుందని సీబీఎస్ఈకి సంబంధించి సలహా కమిటీ తన నివేదికలో తెలిపింది. దీంతో వాస్తవంగా సీబీఎస్ఈ సిలబస్ ఎలా ఉందనే దానిపై అంచనా వేయాలని పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు చర్యలు ప్రారంభించింది. నిజంగా విద్యార్థులలో ప్రతిభ ఉంటే ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని, లేనిపక్షంలో ఏదైనా నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. సీబీఎస్ఈ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 82 వేలమంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడాది తొలిసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షలు రాయబోతున్నారు. దీంతో ప్రభుత్వం వారి విషయంలో ఎక్కడా పొరపాట్లు జరగకూడదని భావిస్తోంది.



### దిద్దుబాటు చర్యలు

గత ప్రభుత్వ హడావిడి నిర్ణయాల వల్ల జరిగే నష్టాన్ని తగ్గించుకునే చర్యలను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించింది. గతంలో మంచి నిర్ణయాలు తీసుకుంటే వాటిని కొనసాగించాలని, తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాలుంటే వాటిని సవరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117పైనా దృష్టి పెట్టింది. దానిని పూర్తిగా రద్దు చేయాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో దానిని రద్దు చేయాలా? సవరించాలా? అనే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అంతిమంగా విద్యార్థులు నష్టపోకూడదనే ఆలోచనతో పలు కోణాల్లో గత నిర్ణయాలను సమీక్షిస్తున్నారు. అలాగే విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోని టీచర్లను అవసరం ఉన్న చోటకు పంపే సర్దుబాటు చర్యలనూ ప్రారంభించింది. గత ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి, అనేక పాఠశాలల్లో తరగతులను తరలించడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు పడిపోయాయి. దీంతో అక్కడ మిగులుగా ఉన్న టీచర్లను ఇతర బడులకు పంపే చర్యలు చేపట్టింది. మొత్తం ఆన్‌లైన్ విధానంలో ఈ సర్దుబాటును చేయనున్నారు. తొలుత ఒకే మండలాన్ని యూనిట్‌గా తీసుకుని, ఒకే సబ్జెక్టు ఆధారంగా సర్దుబాటు చేస్తారు. ఇంకా మిగులుగా ఉంటే పక్క మండలానికి సర్దుబాటు చేస్తారు. అవసరమైతే ప్రాథమిక పాఠశాలల్లోని టీచర్లను తరగతులు విలీనం చేసిన చోట్ల ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులకు బోధించేందుకు పంపుతారు. వారం రోజుల్లోనే ఈ ప్రక్రియను ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు.

### ఇక పక్కాగా సమాచారం

పాఠశాల విద్యాశాఖలో సమాచారం సమగ్రంగా లేదని అధికారులు గుర్తించారు. మొత్తం ఆన్‌లైన్ విధానం ఉన్నప్పటికీ ఏటా విద్యార్థుల వివరాలు అందుబాటులో లేని విషయంపై దృష్టిపెట్టారు. ఇకపై సమగ్ర సమాచారం శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థులు తగ్గిపోవడం, డ్రాపౌట్లపై ఇంటింటికీ తిరిగి పరిశీలన చేయడం కాకుండా వారు ఎక్కడికి వెళ్లారనేది సులభంగా తెలుసుకునే విధంగా డేటా మొత్తాన్ని తయారు చేయాలని నిర్ణయించారు. అలాగే విద్యార్థులు తగ్గిపోవడానికి గల కారణాలను అన్ని కోణాల్లోనూ పరిశీలన చేయనున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో పాటు జననాల రేటు తగ్గిపోవడానికి కారణాలపైనా సమీక్షించనున్నారు.

## వయోవృద్ధుల దర్శనంపై వదంతులు నమ్మొద్దు: టీటీడీ

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించేలా కొన్ని వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని, వాటిని నమ్మవద్దు అంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో భక్తులను కోరింది. 'ప్రతిరోజు వెయ్యి మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ ప్రతినెలా 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో కోటాను టీటీడీ విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50 లడ్డూ ఒకటి ఉచితంగా ఇస్తారు. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న తప్పుడు వార్తలను నమ్మవద్దు. భక్తులు మరింత సమాచారం కోసం తిరుమల.ఓఆర్జీ, టీటీదేవస్థానమ్స్ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను సంప్రదించవచ్చు' అని టీటీడీ సూచించింది.

### ఈ నెలలో రెండుసార్లు గరుడ వాహన సేవ

తిరుమల శ్రీవారికి ఈ నెలలో రెండుసార్లు గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. 9వ తేదీ గరుడ పంచమి, 19వ తేదీన శ్రావణ పౌర్ణమి పర్వదినాల సందర్భంగా మలయప్పస్వామి గరుడ వాహనంపై నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

## జనం ఛీకొట్టినా జగన్‌కు బుద్ధిరాలేదు: అచ్చెన్న



అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జనం ఛీకొట్టినా జగన్ మాత్రం తన చీటింగ్ బుద్ధి మార్చుకోలేదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో జరిగిపోతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చి రాష్ట్రంలో రక్తపుటేరులు పారించింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. హత్యా రాజకీయాలకు వైసీపీ కేరాఫ్‌గా మారిందని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు మొదలుకొని ప్రతిపక్షనేత వరకు దాడులు, దౌర్జన్యాలు జరగని రోజు ఏదైనా ఉందా? అని ప్రశ్నించారు. పల్నాడులో తెలుగుదేశం పార్టీ కార్యకర్త తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతుకోసి చంపిందెవరు అని ప్రశ్నించారు. జగన్ అప్పుడు రెండు కళ్లు మూసుకుని ఉన్నారా? అని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగానే ఉన్నాయని, జగన్ మానసిక పరిస్థితే బాగా లేదన్నారు. అధికారం పోయేసరికి ఏం చేయాలో అర్థం కాక కూటమి ప్రభుత్వంపై అబద్దాలతో కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ల్యాండ్, శాండ్, వైన్, మైనింగ్ ముఠా పాలన నడిపింది జగన్ అని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై ఇప్పుడైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో జగన్ ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని హితవు పలికారు.

### రైతుసేవా కేంద్రాల్లో రాయితీ వరి విత్తనాల పంపిణీ

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల అధిక వర్షాలకు వరినారు, నారుమళ్లు నష్టపోయిన రైతులకు 80% రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాలకు 1,406 హెక్టార్లలో నారుమళ్లు, 33వేల హెక్టార్లలో వరినారుమళ్లు దెబ్బతిన్నాయన్నారు. ఈ విధంగా నష్టపోయిన రైతుల కోసం 6,356 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. బాధిత రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీ వరి విత్తనాలు పొందాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

### లబ్ధిదారులకు ఏడాదిలోపు టిడ్కో, పీఎంఏవై ఇళ్లు: పార్థసారథి



తిరుమల ఆలయం ముందు మంత్రి పార్థసారథి

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు.. అంసపూర్తిగా ఉన్న టిడ్కో, పీఎంఏవై గృహాలను ఏడాదిలోపు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్లు అందజేస్తామని, అలాగే జర్నలిస్టులు, మధ్యతరగతి వాళ్లకు కూడా ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సమస్యల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు తపనపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు దైవశక్తి సహకారం ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

### వెళ్లిపోయిన పరిశ్రమలతో సంప్రదింపులు: శ్రీనివాసవర్మ



తిరుమల ఆలయం ముందు భూపతిరాజు శ్రీనివాసవర్మ

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఏపీ నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి తీసుకువచ్చేందుకు సంప్రదింపులు చేయడంతోపాటు నూతన పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తెలిపారు. అలాగే నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చే అనుమతులను మరింత సులభతరం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి మంచిరోజులు మొదలయ్యాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశం, ఏపీ త్వరితగతిన అభివృద్ధి చెందాలని స్వామిని ప్రార్థించానన్నారు. ఇక, రాష్ట్రంలో జగన్ గ్రహణం కారణంగా చిన్నచూపునకు గురైన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వం కూల్చివేసిన ఆలయాల అంశంపై ఆర్కియాలజీ విభాగం నుంచి కమిటీ ఏర్పాటు చేస్తారా అనే ప్రశ్నకు.. తప్పకుండా అని మంత్రి బదులిచ్చారు.

### ఏపీని అగ్రగామిగా చేసేందుకు ప్రభుత్వం కృషి: కిరణ్

పలమనేరు, ఆగస్టు 4: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులో ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని, గోదావరిలో మరో 10 లక్షల ఎకరాలకు స్థిరీకరణ, కృష్ణాబేసిన్ కింద 13 లక్షల ఎకరాలకు స్థిరీకరణ.. మొత్తంగా 23 లక్షల ఎకరాలకు స్థిరీకరణ, 7.20 ఎకరాలకుసాగునీరు అందుతుందని వివరించారు. అంతేకాకుండా 900 మెగావాట్ల హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు పూర్తయితే కరెంటు యూనిట్ 10 నుంచి 15పైసలకే తయారు చేయొచ్చన్నారు.

### వల్లభనేని వంశీ క్షమాభిక్షకు అనర్హుడు: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 4: ఉరిశిక్ష పడిన వ్యక్తికి కూడా క్షమాభిక్ష ఉంటుంది కానీ, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మాత్రం క్షమాభిక్షకు కూడా అర్హుడు కాదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గన్నవరం ఖాన్‌దాదాగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వంశీ ఇష్టానుసారం వ్యవహరించాడన్నారు. చంద్రబాబు, లోకేశ్, వారి కుటుంబ సభ్యుల గురించి వంశీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని, టీడీపీ ఆఫీసును తగలబెట్టి పారిపోయాడని ఆరోపించారు. పరిటాల రవి అనుచరుడినని చెప్పి అతని ఆస్తిని కూడా దోచుకున్నాడని, సూర్యుడిని తానే చంపించానంటూ పోసుకోలు మాటలు చెప్పి బతికాడని విమర్శించారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునేవాడని, పరిటాల రవి దగ్గర ఒక చెంచాగా పనిచేయటమే ఆయన రాజకీయ నేపథ్యమని మండిపడ్డారు. వంశీని అరెస్టు చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని, అలాంటి వ్యక్తి సమాజంలో ఉండటానికి అర్హుడు కాదని పేర్కొన్నారు. వంశీ ఎక్కడైనా కనిపిస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని ప్రజలను బుద్దా వెంకన్న కోరారు.

### అరగుండుతో మొక్కు తీర్చుకున్న టీడీపీ నేత



అరగుండు చేయించుకుంటున్న గుత్తుల మురళి

కాకినాడ రూరల్, ఆగస్టు 4: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుతూ కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన టీడీపీ నేత గుత్తుల మురళీ అరగుండు చేయించుకుంటానని గతంలో మొక్కుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆదివారం ఇంద్రపాలెం ముసలమ్మతల్లి ఆలయం ఎదురుగా సగం గుండు చేయించుకోగా విగిలిన సగం సోమవారం తిరుపతిలో చెల్లించుకుని స్వామివారి దర్శనం చేసుకుంటానని మురళీ తెలిపారు.

## యామినీ కృష్ణమూర్తి మృతి కళాప్రపంచానికి తీరని లోటు

- రాష్ట్రపతి సంతాపం
- దేశ సాంస్కృతిక యవనికపై చెరగని ముద్ర: ప్రధాని

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భరతనాట్యం కళాకారిణి యామినీ కృష్ణమూర్తి మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఆదివారం సంతాపం తెలిపారు. 'ప్రముఖ నర్తకి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యామినీ కృష్ణమూర్తి మృతి బాధాకరం. ఆమె భరతనాట్యం, కూచిపూడిలో ఎంతో నిష్ణాతురాలు. ఆమె మరణం కళా, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఆమె కుటుంబానికి, స్నేహితులు, అనుచరులకు ప్రగాఢ సానుభూతి" అని రాష్ట్రపతి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. యామినీ తుదిశ్వాస విడిచారన్న వార్త తెలిసి తానెంతో బాధపడ్డానని మోదీ తెలిపారు. భారత శాస్త్రీయ నృత్యంలో ఆమె ప్రావీణ్యం, కళపై ఆమెకున్న అంకితభావం తరతరాలకు స్ఫూర్తిదాయకమని.. దేశ సాంస్కృతిక యవనికపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆమె మన వారసత్వాన్ని సుసంపన్నం చేసేందుకు ఎంతో కృషి చేశారని 'ఎక్స్'లో ప్రశంసించారు. ఆమె కుటుంబానికి, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యామినీ కృష్ణమూర్తి ఎంతోమందికి మార్గదర్శి అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. 'ఆమె అసాధారణ నైపుణ్యం, భారతీయ శాస్త్రీయ నృత్యానికి చేసిన కృషి ఎనలేనిది. తన కళలో రాణించడమే కాకుండా, ఒక మార్గదర్శిగా ఎంతోమంది నృత్యకారుల కెరీర్‌ను తీర్చిదిద్దారు. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఓం శాంతి' అని పేర్కొన్నారు.

### కొత్త జిల్లాల్లో మూడేసి పోస్టులు కావాలి

- వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల్లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో పరిపాలనాధికారి పోస్టులను వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఉద్యోగుల సేవా సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం విజయవాడలో సంఘ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ప్రతి కొత్త జిల్లాకు మూడేసి సూపరింటెండెంట్ పోస్టులు మంజూరు చేసి, ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. సంఘ ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్యాంసుందర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టర్లూ.. ఇదేం పని?

- ఇసుకాసురులు ఎవరో తెలిసినా చర్యలేవీ?
- అక్రమార్కులు ఎవరో బయటపెట్టరా?
- కనీసం విచారణ కూడా లేదు
- సాక్ష్యాలు కళ్లెదుటే మాయం
- నర్సీపట్నం ఏరియాలో ఓ వైసీపీ నేతకు భారీ డంప్
- స్వయంగా వెళ్లి చూసిన కలెక్టర్
- 65 వేల టన్నుల ఇసుక నిల్వ
- అది వైసీపీ మాజీ ఎమ్మెల్యేదని తెలియడంతో చర్యలకు వెనకడుగు?
- జగ్గయ్యపేట ప్రాంతంలోనూ భారీ నిల్వలు
- అక్రమాలపై కలెక్టర్ల నిర్లిప్తత
- లేటరైట్ తరలింపుపైనా అంతే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల గజదొంగల నేరాలకు సాక్ష్యాలు చెరిగిపోతున్నాయి. ఆనవాళ్లు కనిపించకుండా పోతున్నాయి. కళ్ల ముందు నిలువెత్తు కొండల్లా కనిపిస్తున్న ఇసుక డంప్‌లు, యార్డుల్లోని లేటరైట్ నిల్వలు మాయమైపోతున్నాయి. ఇప్పుడు ఉన్నది జగన్ ప్రభుత్వం కాదు.. ప్రజలు కోరితెచ్చుకున్న టీడీపీ కూటమి సర్కారులో కూడా వైసీపీ పెద్దలు, గనుల గజదొంగలు స్వైరవిహారం చేస్తుండడమే విశేషం. వారు అక్రమంగా తవ్వితీసుకెళ్లిన ఇసుకను అధికారులు కనిపెడుతున్నా.. దాని వెనుక ఎవరున్నారో బయటపెట్టడం లేదు. ఆధారాలూ సేకరించడం లేదు. విచారణ, చర్యలకు ఉపక్రమించడం లేదు. అలాగే లేటరైట్ నిల్వలు ఎక్కడున్నాయో కూడా వారికి తెలుసు. కానీ అది ఎవరిదో, అక్కడే ఎందుకు దాచారో బహిర్గతం చేయడం లేదు. కలెక్టర్ల నిరాసక్తత, జంకుకు కారణమేంటి? వైసీపీ నేతల అక్రమాలను నిర్ధారించే సాక్ష్యాలు మాయమవుతుంటే ఇలా వదిలేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ వాటిని అమలు చేయకుండా కలెక్టర్లు తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా కొందరు వైసీపీ నేతలు అక్రమంగా తవ్వి నిల్వ చేసుకున్న ఇసుక, లేటరైట్ డంప్‌లు గుట్టుగా తరలిపోతున్నాయి. సాక్ష్యాలన్నీ మాయమయ్యాక ఇక ఎవరిపై చర్యలు తీసుకుంటారు?

### జనమే బయటపెట్టినా..!

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజలు.. టీడీపీ కార్యకర్తల సహకారంతో వైసీపీ నేతల అక్రమ ఇసుక డంప్‌లు బయటపెట్టారు. లక్షల టన్నుల ఇసుక నిల్వలను కనిపెట్టారు. పలు జిల్లాల కలెక్టర్లు ఆర్భాటంగా అధికార యంత్రాంగాన్ని వెంటేసుకుని వెళ్లి ఆ డంప్‌లను పరిశీలించి వచ్చారు. త్వరలో ఉచిత ఇసుక విధానంలో సరఫరా చేస్తామని ప్రకటనలు చేశారు. కలెక్టర్లు చేయాల్సిన పని అదేనా? అసలా డంపుల్లో ఇసుక నిల్వ చేసిన వారెవరో బహిర్గతం చేసి.. కేసులు పెట్టి చట్టం ముందుకు తీసుకు రావలసిన అవసరం లేదా? ఉదాహరణకు నర్సీపట్నం ఏరియాలో టీడీపీ కార్యకర్తల చొరవతో ఓ భారీ ఇసుక డంప్‌ను అధికారులు కనిపెట్టారు. అక్కడ ప్రైవేటు సెక్యూరిటీ కాపలా ఉంది. అక్కడ సీసీటీవీ కెమెరాలు కూడా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆ డంపును పరిశీలించి వెళ్లారు. రాజమండ్రి నుంచి ఇసుకను అక్కడకు ఎవరు తీసుకొచ్చి డంప్ చేశారు? దాని వెనుక ఉన్న వ్యక్తి ఎవరో కనిపెట్టాల్సింది జిల్లా యంత్రాంగమే. ఇందుకు పోలీసుల సహకారం తీసుకుని విచారణ చేపట్టాలి. కానీ ఆ కలెక్టర్ పెద్దగా చొరవ తీసుకోలేదని తెలిసింది. ఇందుకు కారణం.. ఆ డంప్ వైసీపీ మాజీ ఎమ్మెల్యేది కావడమేనని సమాచారం. ఆ నేతపై కేసుపెట్టి చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోయారు. కనీసం విచారణ కూడా చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 65 వేల టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వచేస్తే కేసు పెట్టరా? అది చట్ట ఉల్లంఘనకు కిందకు రాదా? వైసీపీ నేతలు ఇందుకు అతీతులని జిల్లా కలెక్టర్ భావిస్తున్నారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తాజాగా ఆ ఇసుకను ఉచిత పాలసీ కింద ప్రజలకు ఇచ్చేస్తున్నారు. దీంతో ఓ మాజీ ఎమ్మెల్యే చేసిన నేరానికి కళ్లెదుట కనిపిస్తున్న సాక్ష్యం మాయమవుతోంది. ఇక విచారణ, శిక్షకు అవకాశమేదీ?



నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో వైసీపీ నేతలు నిల్వ ఉంచిన ఇసుక

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఏరియాలో రహదారి సమీపంలోనే ఓ పెద్ద డంప్‌ను కనిపెట్టారు. అక్కడి ఇసుకను కూడా ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. కానీ అక్కడ వేల టన్నుల ఇసుకను ఎవరు డంప్‌చేశారో ఆరాతీసి.. చట్టం ముందు నిలబెట్టే ప్రయత్నం చేయరా? అక్రమార్కులను అలాగే వదిలేస్తారా అన్న ప్రశ్నలు టీడీపీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

తాజాగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఏరియాలో లక్షన్నర టన్నుల లేటరైట్‌ను ఓ వైసీపీ పెద్ద నేత గుట్టుగా నిల్వ చేసుకున్నారు. అది చింతలూరు అటవీప్రాంతంలో అక్రమంగా తవ్వినదే. కాకినాడ గనుల అధికారిని సెలవు మీద పంపించి మరీ ఆ ఖనిజాన్ని తరలించేవరకు గనుల శాఖ అధికారులకు తెలియదనుకోవాలా? అడవిని గుల్లచేసి తవ్వితీసిన లేటరైట్‌ను, దాని వెనక ఉన్న వైసీపీ పెద్దను అలా వదిలేస్తారా అన్న ఆగ్రహం టీడీపీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది.



సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీ కేశినేని చిన్ని

## మరో నెల రోజుల్లో ఏసీఏకు ఎన్నికలు

- ఎన్నికల అధికారిగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్
- సర్వసభ్య సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 4: ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ)నికి మరో నెల రోజుల్లో ఎన్నికలు జరుగుతాయని విజయవాడ ఎంపీ, కర్నూలు జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు కేశినేని చిన్ని తెలిపారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా మాజీ సీఈవో నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను నియమించినట్లు చెప్పారు. ఏసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగింది. సమావేశం అనంతరం కేశినేని చిన్ని మీడియాతో మాట్లాడుతూ.. పాత బోర్డు రాజీనామాలను ఆమోదించామని, ఏసీఏకు వారు చేసిన సేవలకు కృతజ్ఞతగా సన్మానం చేశామని చెప్పారు. మరో నెలలో ఏసీఏ ఎన్నికలు జరుగుతాయని, ఈ నెల రోజులూ ఏసీఏ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీలో ఆర్‌వీఎస్‌కే రంగారావు, మాజీమంత్రి మ్యాన్ చో ఫెరార్, జాగర్లమూడి మురళీమోహన్‌రావు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో క్రికెట్ స్టేడియాల పరిస్థితిపై, క్రికెటర్లకు అందుతున్న సౌకర్యాలపై చర్చించారు. ఈ అంశాలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు ఎంపీ చిన్ని వివరించారు. ఈ సమావేశంలో ఏసీఏ మాజీ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి, మాజీ జాయింట్ సెక్రటరీ రాకేశ్, మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు, సానా సతీష్, మాజీ కోశాధికారి చలం, వివిధ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేటితో సభ్యత్వ నమోదు ముగింపు

- రికార్డు స్థాయిలో జనసేన పార్టీ సభ్యత్వాలు
- పది లక్షలు దాటిన పార్టీ క్రియాశీలక సభ్యులు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నేటితో ముగియనుంది. నాలుగేళ్ల నుంచి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది మరింత ఉత్సాహం చేస్తున్నారు. గత నెల 18 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదు తలపెట్టినా, మధ్యలో భారీ వర్షాలతో పాటు ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాల్సి రావడంతో మరో వారం రోజుల పాటు అంటే ఆగస్టు 5వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వంలో జనసేన భాగస్వామ్యం కావడంతో ప్రజలు, మెగా అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారు. పైగా జనసేన సభ్యత్వం వల్ల రూ.5లక్షల బీమా వంటి.. ఆర్థిక ప్రయోజనాలు కూడా సమకూరుతున్నాయి. దీంతో ఈ ఏడాది సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వచ్చింది. గత ఏడాది 6.5 లక్షల మంది జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇప్పటికే జూలై 28 నాటికే పది లక్షల మంది జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. గతంలో తక్కువగా నమోదైన నియోజకవర్గాల్లో 5 వేలు దాటలని టార్గెట్‌గా పార్టీ నిర్ణయించింది. కానీ ఊహించని స్థాయిలో ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 15 వేల మంది క్రియాశీలక సభ్యులుగా చేరారు. నేడు సభ్యత్వ నమోదు గడువు పూర్తయ్యే సరికి 11 నుంచి 12 లక్షల మంది చేరే అవకాశం ఉందని పార్టీ అధిష్టానం భావిస్తోంది.

# గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి సంధ్యారాణి



ఆదివాసీ మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించాలన్నారు. త్వరలో గిరిజనుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై ట్రైకార్ రుణాలు మంజూరు చేస్తామన్నారు. గిరిజన గ్రామాలకు రహదారులు లేక గర్భిణులను డోలీలో తీసుకెళ్లే పరిస్థితి ఇకపై ఉండదన్నారు. అన్ని గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లేందుకు వచ్చే ఆదివాసీ ప్రపంచ దినోత్సవం నాటికి రహదారులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారించేందుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. తెలివితేటల్లో, ఆలోచనలో ఆదివాసీ బిడ్డలమైన మనం ఎవరికీ తీసిపోమని, పట్టుదల, శ్రమ ఉంటే ఏదైనా సాధిస్తామని... అనేక మంది గిరిజనులు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ఉన్నారని, వారి స్ఫూర్తితో యువత ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఐదారేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సకు మైక్రోబయాలజీనే మూలాధారం

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి



రాజానగరం, ఆగస్టు 4: బ్యాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వంద సెంటర్లలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. వచ్చే ఐదేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు మైక్రోబయాలజీనే మూలాధారం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌత్‌జోన్ వైద్యా విజ్ఞాన సదస్సులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా ఆహారంలో మార్పుల వల్లే బ్యాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరాల జబ్బులు, వ్యాధులు సంక్రమిస్తున్నాయని అన్నారు. సహజ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు, కనీసం ఆరు నెలలు తల్లిపాలు తాగిన బిడ్డలు, ఆరు నెలలలోపు యాంటీ బయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బ్యాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు లేవన్నారు. ఈ సదస్సులో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ వాడ్రేవు రవి, డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ గురునాథ్‌దాస్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

### మెట్టవలసలో అతిసారం విజృంభణ

- చికిత్స పొందుతున్న 30 మందికి పైగా బాధితులు

జి.సిగడాం, ఆగస్టు 4: శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం మెట్టవలసలో అతిసార వ్యాధి విజృంభించింది. రెండు రోజులుగా సుమారు 30 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పలువురు బాధితులు రాజాం సామాజిక అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## రూ.44 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

- ఏలూరులో ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, ఆగస్టు 4: నకిలీ కరెన్సీని చలామణికి ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేశామని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరులోని 108 అంబులెన్సులో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న దొండపాటి ఫణికుమార్‌కు గత నెల 28న ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. తమ వద్ద రూ.44 లక్షల విలువైన 500 రూపాయల కొత్తనోట్లు ఉన్నాయని, ఈ సొమ్మును తాము ఒక్కసారిగా మార్కెట్లోలోకి ప్రవేశపెట్టలేమని.. కనుక రూ.10 లక్షలు ఇస్తే ఆ కొత్తనోట్లను ఇచ్చేస్తామని ఆశ చూపించాడు. దీంతో ఫణికుమార్ అడ్వాన్సుగా జూలై 30న రూ.3 లక్షలు ఇచ్చాడు. అయితే, ఇదంతా మోసమని స్నేహితులు చెప్పడంతో వెంటనే త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఏలూరు కొత్త బస్టాండ్ దగ్గరకు వస్తే మిగిలిన డబ్బు ఇస్తానని ఫణికుమార్ నోట్ల ముఠాకు సూచించాడు. చింతలపూడి మండలం మల్లాయిగూడానికి చెందిన మారుమూడి మధుసూదనరావు, జంపలవారిగూడేనికి చెందిన కారు డ్రైవర్ బీరెల్లి రాంబాబు కలిసి రూ.44 లక్షల నకిలీ కరెన్సీ బ్యాగ్‌లో పెట్టుకుని వచ్చారు. అప్పటికే అక్కడ మాటేసి ఉన్న పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేశారని ఎస్పీ కిశోర్ చెప్పారు. అయితే తాము మధ్యవర్తులమని, అసలు నిందితుడు మరో వ్యక్తి ఉన్నాడని నిందితులు అంటున్నారు.

## ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి వద్ద డ్రగ్స్

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

విజయవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో డ్రగ్స్ కలకలం రేపాయి. కొద్దిరోజుల క్రితం ఉపాధ్యాయులు విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేయగా, ఒక విద్యార్థి బ్యాగులో డ్రగ్స్, నగదు బయటపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆ విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి జరిగిన విషయం చెప్పినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఎక్కడా చర్చించవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారని తెలిసింది.

# వివిధ


vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

# విమర్శకులకూ 'గ్లామర్' ఉందని ఋజువు చేశాడు త్రిపురనేని



**చదువు ముచ్చట**

బి. తిరుపతిరావు



**ఈమధ్య చదివిన పుస్తకం?**

గత నాలుగేళ్ళుగా స్టాలిన్ పాలనలో సోవియట్ రష్యాలో, తూర్పు ఐరోపా దేశాలలో జరిగిన మారణ హోమాల గురించి చదువుతున్నాను. రష్యా విచ్ఛిన్నం తరువాత 1991, 1992 సంవత్సరాల్లో రష్యన్ ఆర్కైవ్స్ పబ్లిక్‌కి అందుబాటులోకి రావటంతో ప్రపంచవ్యాప్తంగా వందలాదిమంది పరిశోధకులు వాటిని పరిశీలించి విస్తృతంగా పుస్తకాలు రాశారు. స్టాలిన్ దురాగతాల నన్నింటిని ఆధారాలతో నిరూపించారు. ఈ పుస్తకాలు స్టాలిన్ సోషలిజం పేరుతో కొనసాగించిన హింస గురించి వాస్తవాలు వెల్లడించాయి. వీటి గురించి నేను చదువుతున్న పుస్తకాలలో ఈమధ్యనే Robert Conquest రాసిన 'The Harvest of Sorrow: Soviet Collectivization and the Terror Famine' అనే పుస్తకం చదివాను.

ఈ పుస్తకం స్టాలిన్ నిర్బంధ సంఘటిత వ్యవసాయ విధానాల ఫలితంగా జరిగిన హింస, ఉక్రెయిన్‌లో స్టాలిన్ ప్రభుత్వం కృత్రిమ కరువు సృష్టించి మిలియన్ల కొద్దీ ప్రజల మరణానికి కారణమైన విధానం అన్నిటినీ చాలా లోతుగా వివరిస్తుంది. ఉక్రెయిన్ ప్రజలను నరభక్షకుల స్థాయికి దిగజార్చిన కృత్రిమ కరువుతోపాటు, కరువు వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను వివరిస్తుంది.

**బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?**

నాకు గుర్తున్నంతవరకు 'నీతి చంద్రిక'. అవి చిన్నయ్య సూరి చేసిన అనువాదానికి retold versions అయి ఉంటాయి. ఆ కథలు చాలా ఆకర్షణీయంగా ఉండేవి, ముఖ్యంగా జంతువుల మధ్య సంభాషణాలు. ఇప్పుడు ఆలోచిస్తే అవి కూడా మ్యాజిక్ రియలిస్ట్ కథలు అనిపిస్తాయి.

**వ్యక్తిగతంగా ప్రభావితం చేసిన రచయిత?**

ఒక్క పేరు మాత్రమే చెప్పాలంటే త్రిపురనేని మధుసూధన రావు. ఆయన ఉపన్యాసాలు, విమర్శ మాతరం మొత్తాన్ని ప్రభావితం చేశాయి. కాల్పనిక సాహిత్యకారులకే కాదు, విమర్శకులకూ 'గ్లామర్' ఉందని ఋజువు చేశాడు త్రిపురనేని.

**తెలుగులో మీకు నచ్చిన విమర్శ పుస్తకం?**

దార్శనికుడు, నవలా రచయిత, కథకుడు, వ్యాసకర్త జి.వి. క్రిష్ణరావు రాసిన 'కావ్య జగత్తు'. భరతుని నుంచి ప్లేటో, మార్క్స్ దాక కావ్య వస్తురూపాలు ఎలా పరిణామం చెందాయో క్రిష్ణరావు అద్భుతంగా చర్చించాడు. ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలూ లోతుగా అర్థం చేసుకుని స్వతంత్ర సాహిత్య మూర్తిమత్వాన్ని రూపొందించున్న రచయిత జి.వి. క్రిష్ణరావు.

**సాహిత్యంలో మీకు నచ్చిన కల్పితపాత్ర?**

బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' లోని 'అమృతం'.

**ఏ గతకాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో ఏం మాట్లాడతారు?**

వడ్డెర చండీదాస్‌తో. ఆయన ఉన్నప్పుడు రెండుసార్లు మాట్లాడే ప్రయత్నం నేను, వేగుంట మోహన్ ప్రసాద్ గారు చేశాం. అయితే, ఆయన మాట్లాడ లేదు. మేమే మాట్లాడాము. ఆయన్ని అడగాలంటే- తనకీ, 'అనుక్షణికం'లోని శ్రీపతికి పాత్రకు ఉన్న సంబంధం ఏమిటి? అని అడుగుతాను. అలాగే- జీవితమిచ్చే అన్ని ఆనందాలను పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకోవాలని సంఘర్షించిన అన్నా కెరినాని, మేడమ్ బోవరీని టాల్‌స్టాయ్, ప్లాబర్ట్‌లు ఆ పాత్రలు తమ ఘర్షణ ఫలితాలను పొందకుండానే ముగించినట్టు, తాను కూడా స్వప్న రాగలీన పాత్రను ముగించాడా? అనీ అడగవచ్చు. అయితే, తన రచనల మీద ఎప్పుడూ మాట్లాడని చండీదాస్, Beckett లాగా, "The words are all we have" అని అంటాడేమో!

**మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?**

నా తరంలో చాలమంది లాగానే నేను చలం, రంగనాయకమ్మ నవలలు కథలు చదువుతూ సాహిత్య అభిరుచి పెంచుకున్నాను. ఇంటర్మీడియట్‌లో మాకు ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఉన్న వర్ధనరావు గారు నన్ను మార్క్సిస్ట్ పుస్తకాల వైపు తిప్పారు. ఆ తరువాత త్రిపురనేని మధుసూధన రావు గారి ప్రేరణతో ప్రాథమిక మార్క్సిస్ట్ పుస్తకాలు చదవటం మొదలైంది. క్రమంగా యూరోపియన్ మార్క్సిస్టులకు, రష్యన్ మార్క్సిస్టులకు మధ్య మౌలిక వ్యత్యాసం ఉందని తెలిసి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్‌కి చెందిన మార్క్సిస్టుల పుస్తకాలు చదివాను. అది క్లాసికల్ మార్క్సిస్టు సిద్ధాంత పరిమితులను తెలుసుకోవటానికి ఆస్కారం కలిగించింది. సిద్ధాంత గ్రంథాలతోపాటు చదువుతూ వచ్చిన యూరోపియన్ సాహిత్యం ఆధునికానంతర వాదాన్ని పరిచయం చేసింది. ఆధునికాంతరవాద చర్చలలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ పోలిష్ తాత్వికుడు, సామాజిక శాస్త్రవేత్త జిగ్మట్ బౌమన్ రచనలను క్రమంగా చదువుతూ రావటంవల్ల ఆయన ఆలోచనలు ఆమోదయోగ్యంగా కనిపించాయి. సంప్రదాయ మార్క్సిస్టులు విస్మరించిన, విశ్లేషించలేని అనేక అంశాలను ఆయన అద్భుతంగా విశ్లేషించాడు. సోషలిజం ఒక ఆదర్శమే తప్ప, ప్రాజెక్టు కాదు, దానిని ఒక ప్రాజెక్ట్‌గా భావించి ఆచరణకు దిగటం వల్ల మానవ చరిత్రలో కనీవినీ ఎరుగని దారుణాలు జరిగాయనే ఆయన నిర్ధారణ నాకు చాలా కన్విన్సింగ్‌గా అనిపించింది. ఆయన ప్రేరణతోనే సోవియట్ రష్యాలో, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలు కొనసాగించిన మారణహోమాలను గురించి రాసే పనిలో ఉన్నాను. ఇది ఒక కనీసం వెయ్యి పేజీల పుస్తకం కావచ్చు. ■

# టిఫిన్ హోటల్లో ఆవిష్కరణ



**నా మొదటి పుస్తకం**

■ నగ్నముని

మానేపల్లి హృషీ కేశవరావు నా పూర్తి పేరు. 'ఉదయించని ఉదయాలు' నా మొదటి కవితా సంపుటి పేరు. 1962 సెప్టెంబర్‌లో విడుదలైంది. ముఖచిత్రం నా మిత్రుడు, చిత్రకారుడు శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ డిజైన్ చేశాడు.

ఒకప్పుడు హైదరాబాద్ చిక్కడపల్లిలో 'స్వరాజ్' అనే హోటల్ ఉండేది. ఒక రోజున పదిమంది మిత్రులం ఉదయం తొమ్మిది గంటలకు ఆ హోటల్‌కి చేరుకున్నాం. పెద్ద టేబుల్ చుట్టూ కూర్చుని అందరం ఒకేసారి 'ఉదయించని ఉదయాలు' పుస్తకాన్ని ఆవిష్కరించాం. హాలు లేదు. వేదిక లేదు. అధ్యక్షుడు, ఆవిష్కర్త, ముఖ్య అతిథులు, ఉపన్యాసకులు- ఎవరూ లేరు. పూలదండలు, శాలువాలు ఏమీ లేవు. పదిమంది మిత్రులు, ఓ కవితా సంపుటిని ఆవిష్కరించడం తదనంతర కాలంలో, సాహిత్యంలో ఆదొక అరుదైన సంఘటనగా నిలిచింది.



ఇక- ఆ హోటల్లో, ఆ రోజున, ఆవిష్కరణ తరువాత, నేను సర్వర్‌ని పిలిచి- "మేం మరో రెండు గంటలు యిక్కడే వుంటాం, టిఫిన్ చేస్తాం, అలాగే యీ రెండు గంటల్లో ఎవరెవరు టిఫిన్ చెయ్యడానికి వస్తారో, వెళ్లేటప్పుడు వాళ్ల బిల్లులు నాకు యివ్వు. మొత్తం నేనే చెల్లిస్తాను, యీ విషయం వాళ్లకు చెప్పు" అన్నాను. సర్వర్ వాళ్లకు అదే చెప్పాడు. టిఫిన్ చేసి వెళ్లేటప్పుడు వాళ్లు మా దగ్గరకొచ్చి విషయమేమిటని అడిగారు. "నా కవిత్వ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఆ సందర్భంగా మీకు టిఫిన్ అందజెయ్యాలనుకున్నాం" అంటూ పుస్తకం ఓ కాపీ వాళ్లకు యిచ్చాం. వాళ్లంతా చాలా సంతోషించారు. మరుసటి రోజున పత్రికలలో యీ సంఘటన ఒక విశేషమైన వార్తగా వచ్చింది.

తరువాతి కాలంలో- శ్రీ కె.వి. రమణారెడ్డి, శ్రీ కేతవరపు రామకోటిశాస్త్రి, విజయవాడ ఆకాశవాణిలోని శ్రీవాత్సవ మొదలైన ప్రముఖులు ఆయా పత్రికలలో 'ఉదయించని ఉదయాలు' సంపుటిని ప్రశంసా పూర్వకంగా సమీక్షించారు. ఈ సంపుటితో ఆధునిక కవిత్వం ఓ మలుపు తిరిగిందని, కొత్త కవిత్వంతో, కొత్త అధ్యాయం ప్రారంభమైందని ప్రకటించారు. కె.వి.ఆర్ ఒక అడుగు ముందుకు వేసి, యీ సంపుటి ఖండికలతో వున్నప్పటికీ, మొత్తంగా చూస్తే, కవితా నిర్మాణం చూస్తే, ఒక 'నవ్య కావ్యం'గా కనిపిస్తున్నది అంటూ- ప్రతి ఖండికనూ తీసుకుని, దాని విశిష్టతను వివరంగా, సుదీర్ఘంగా తెలియజేశారు.

వెంటనే, కె.వి.ఆర్ సమీక్షను తీవ్రంగా ఆక్షేపిస్తూ శ్రీ జె. నీలకంఠశాస్త్రి అనే పాఠకుడు తన ఘాటైన స్పందనను ఒక పెద్ద ఉత్తరంలో తెలియజేశారు. ఆయన అభ్యంతరాలు ఏమిటంటే- అసలు 'ఉదయించని ఉదయాలు' లోనిది కవిత్వమే కాదన్నారు. తరువాత- "ప్రకృతిలోని ప్రతి జీవనాంశానికీ, దాని పెరుగుదలలో ఏర్పడే వివిధ దశలకూ పేర్లు ఉంటాయి. ఉదాహరణకు- ఒక మొక్కను తీసుకుందాం- ఆ మొక్కకు మొగ్గ వేస్తుంది. అది, తరువాత పువ్వు అవుతుంది, అదే కాయ అవుతుంది- యిలా ప్రతి దశకూ ఓ పేరు ఉంటుంది. అలాగే- 'ఉదయించని ఉదయాలు'లో- ఉదయానికి పూర్వం- ఉదయించని ఉదయం ఒక దశ, ఆ దశకు ఒక పేరు వుండాలిగదా! అదేమిటో చెప్పాలి గదా!" అన్నాడాయన. తరువాత మరికొన్ని చిన్నవైన అభ్యంతరాలు చెప్పి, చివర్లో- "కొత్త కవులకు ప్రోత్సహించ వచ్చు, కాని, యీ నవ్య కావ్య కవిని అంతగా ఆకాశాని కెత్తెయ్యాలా!" అన్నారు. దానిపై కె.వి.ఆర్- నీలకంఠశాస్త్రి లేవనెత్తిన ప్రతి అంశానికీ సమాధానమిస్తూ, మరొక సారి ఆధునిక సాహిత్యంలో 'ఉదయించని ఉదయాలు' స్థానాన్ని తెలియజేస్తూ పెద్ద వ్యాసమే రాశారు.

కొన్నేళ్లు గడిచిన తరువాత, ఓ సభ సందర్భంగా నేనూ, కె.వి.ఆర్ కలుసుకోవడం జరిగింది. మాట మధ్యలో- "సర్- ఆ నీలకంఠశాస్త్రిగారెవరో మీకు తెలిసిందా?" అని అడిగాను. "తెలియలేదండి" అన్నారు. "నాకు తెలుసు" అన్నాను. "చెప్పండి ఆయనెవరు" అని ఆసక్తిగా అడిగారు. దానికి- "ఆ నీలకంఠ శాస్త్రి ఎవరో కాదు, నేనే" అన్నాను. ఆయన ఆశ్చర్యం నుంచి యింకా తేరుకోకముందే- నేను కొనసాగిస్తూ- "మీరు 'ఉదయించని ఉదయాలు' సంపుటిని గొప్పగా సమీక్షించారు. ఒకవేళ- ప్రతికూలంగా, మిమ్మల్ని ప్రశ్నిస్తే, మీ సమాధానం ఎలా వుంటుందో తెలియాలనే ఉద్దేశంతో అలా రాశాను" అన్నాను. ఆశ్చర్యం నుంచి తేరుకున్న తరువాత- ఆయన యిలా అన్నారు- "ఒక కవి తన కవిత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, మరొక పేరుతో రాయడం ఊహించలేనంత గొప్ప విషయం. అదొక సాహసం. బహుశా, మరెవ్వరూ చెయ్యలేని సాహసం" అంటూ- చాలా సంతోషించారు. ■



# ఎల్లమ్మ వచనాలు

చెరువులు వాగులు కుంటలు
నీ నడుముకు చుట్టుకుంటయ్
గవ్వల మాలలై ఆషాడ బోనాలై
పగలూ రాత్రులు నీకు జీవుల
వొనగంట్లాట కడగండ్ల మూట
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మ...

నీ పాదముద్రలు మా పద్యనిద్రలు
నీ అదృశ్యమూ మా దృశ్యమూ
రెండూ వొక తీగ పూవులే...
జుంటి తేనెలో ముంచిన చందమామలు
నీ రెండు కండ్లు
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

***

తమలపాకుల తోటలు... నీ చల్లని మాటలు
రాగిరి చెరువు మీది దీపం... గుట్ట మీది గుండాల తానం
నల్లని నీ ఆకాశ జడ... మొగిలి మొగ్గల జాడ
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

***

పచ్చాపలు నీకు గాలినెగిరి పొర్లు దండాలు పెడ్తున్నాయి
వలవిసిరే చేతులకు ముద్దులు కడుతున్నాయి
తాటిగంపలల్ల తామే దూకి నిన్ను తలపోస్తున్నాయి
అమ్మా మేము మనుషుల ఆకలి తీరుస్తాము
నువ్వు మా ఆకలి తీర్చు అంటూ
నీ తొట్టెలెక్కి కూర్చుంటున్నయ్
అమ్మా మాయమ్మ
రేణుకెల్లమ్మా...

***

అన్ని సౌలతులు తక్కువయినా
నిన్ను మొక్కుకుంటే చాలు
నీ ఆత్మ మా జీవజీవాల కోసమే తండ్లాడుతుంటది
నీ దీవెనార్తిది గుట్టల చెరువుల భాష
గువ్వల పంటల గవ్వల భాష
అమ్మా మాయమ్మ
రేణుకెల్లమ్మా...

కుత్రలు మన్యాది పానాది సరిహద్దులు
కుంచెడు శోకం సోలెడు నమ్మకం
కుత్రలు బాగు సాగు సంతలు
మాటలు పాటల చింతల ముంతలు
నువ్వొక్క తల్లివే నిజ వాస్తవం
అమ్మా మాయమ్మా
రేణుకెల్లమ్మా...

■ సిద్ధార్థ



# ఇవతల

దేహం
ఓ చీకటి పదం
పలకలేని నిశ్శబ్దవెలుతురది

ముడుచుకున్న ఆకారాల్లో
ఆమె ఆత్మ చూసావా

ఓ అజిహ్వా మరణ ప్రయాణం

కొత్త కన్నీరు పాత దేహంపై
విడిపోయే విడివిడి అక్షరాలకే తెలుసు

ఎంత వంచననైనా ప్రేమతో దిగమింగుకోవాలి

■ ఎం ఎస్ నాయుడు



బొమ్మలు: అక్బర్

ఈ ఏడాది నుంచే మొదలవుతున్న బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ఆగస్ట్ 9, 10, 11 తేదీల్లో బెంగళూరులో జరుగుతున్నది. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలు కేంద్రంగా ఈ సాహిత్య ఉత్సవం జరుగుతున్నది. ఈ ఉత్సవానికి 'ఆంధ్రజ్యోతి' మీడియా స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్నది. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్, కన్నడ రచయిత సతీష్ చప్పరికేతో వివిధ జరిపిన ఇంటర్వ్యూ ఇది.

# ఇరుగు పొరుగు రాష్ట్రాల వాళ్ళం.. మధ్యలో ఇంగ్లీష్ అనువాదాలెందుకు!



**బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ఆలోచన ఎలా కలిగింది? ఇప్పటికే దేశంలో జరుగుతున్న మిగతా ఫెస్టివల్స్ కంటే ఇది ఏ రకంగా భిన్నమైనది?**

భారత దేశంలో చాలా లిటరేచర్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. పేరుకి వీటిని భారతీయ భాషా సాహిత్యాలకు సంబంధించిన ఫెస్టివల్స్ అంటున్నారు. కానీ చాలా సందర్భాల్లో వీటి మొగ్గు ఇంగ్లీష్ భాషా సాహిత్యం వైపు, ఆ భాషలో రాసే రచయితల వైపే ఉంటున్నది. దక్షిణాది భాషలకు ఉన్న వేల ఏళ్ళ చరిత్ర, వాటిల్లో ఉన్న సాహిత్య సంపదతో పోల్చి చూసినప్పుడు నిజానికి హిందీ, ఇంగ్లీషు భాషలు చాలా ఇటీవలి భాషలు. అయినప్పటికీ దక్షిణాది భాషలకు ఈ ఫెస్టివల్స్‌లో తగిన ప్రాముఖ్యత లభించటం లేదు. ఇది గమనించాకనే మాకు ఈ 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' ఆలోచన వచ్చింది.

అలాగే చాలా లిటరేచర్ ఫెస్టివల్స్ రచయితలకే ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నాయి. మేము రచయితలతో పాటు ప్రచురణకర్తలకు కూడా ప్రాముఖ్యత ఇస్తున్నాం. మొట్టమొదటిసారి ఇక్కడ ఒక పబ్లిషర్స్ కాంక్లేవ్ కూడా జరుగుతున్నది. దక్షిణ భారత దేశం లోని వందకుపైగా పబ్లిషర్లు ఇందులో పాల్గొంటారు. ఢిల్లీ నుంచి ఇంగ్లీష్ లిటరరీ ఏజెంట్లు కూడా ఇక్కడికి వస్తున్నారు. చికాగో యూనివర్సిటీ ప్రతినిధులు కూడా వస్తున్నారు. ఇప్పుడు ప్రపంచం దక్షిణాది భాషల వైపు చూపు సారిస్తున్నది. ఇక్కడి సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించటానికి అంతర్జాతీయంగా పబ్లిషర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. వారే డబ్బు పెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంలో దక్షిణాది భాషల వారందరం ఏకమై మన సాహిత్యం ఎంత సుసంపన్నమైనదో ప్రపంచానికి చూపించగలగాలి. ఇది బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం.

**ఈ ఫెస్టివల్‌ను పట్టాలెక్కించడానికి అవసరపడిన ప్రయత్నం గురించి చెప్పండి?**

ఇలాంటి ఆలోచన ఒకటి ఆచరణ దాకా రావటం ఇదే మొదటిసారి. కేంద్ర సాహిత్య అకాడమీ మాజీ సెక్రటరీ, కేరళ సాహిత్య అకాడమీ ప్రస్తుత అధ్యక్షుడు కె. సచ్చిదానందన్‌ని ఇటీవల నేను కలిసి మాట్లాడినప్పుడు- ఆయన "మీకు ఈ ఆలోచన ఎప్పుడు వచ్చింది?" అని అడిగారు. రెండేళ్ళ క్రితం అని చెప్పాను. "ఇరవై ఏళ్ళ క్రితమే నాకు ఈ ఆలోచన వచ్చింది. కానీ దీన్ని ఆచరణ లోకి తీసుకురావటం చాలా కష్టం" అన్నారు. నాలుగు సంస్కృతులను, నాలుగు దక్షిణాది భాషలను, ఆయా భాషల రచయితలను ఒక్క వేదిక మీదకి తీసుకు రావటం సులువైన విషయం కాదు. దీనిపై ఇప్పటికే ఎనిమిది నెలల నుంచి పని చేస్తున్నాం. ఇప్పుడు ఈ భాషల నుంచి 500మందికి పైగా రచయితలు వస్తున్నారు. వీరిలో 300 మంది వేదికలపై మాట్లాడతారు. ఉదాహరణకు ఎనభై ఏళ్ళ వయస్సు గల కవి కె. శివారెడ్డి నుంచి ఇటీవల యువ పురస్కారం పొందిన రమేష్ కార్తీక్ నాయక్ దాకా అన్ని వయసుల వారూ ఉత్సాహంగా తరలి వస్తున్నారు.

**ఈ భాషలకు సంబంధించిన సాహిత్య ప్రతినిధుల్ని ఎంచుకునే ప్రక్రియ ఎలా జరిగింది?**

ఈ ఎంపిక ప్రక్రియ ఎవరో ఒక వ్యక్తి ద్వారా జరగలేదు. మాకు ఒక క్యూరేషన్ కమిటీ ఉంది. ఈ కమిటీలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల ప్రతినిధులు ఉన్నారు. ఈ కమిటీ నాలుగుసార్లు సమావేశమైంది. అక్కడ జరిగిన చర్చల ఫలితంగా ఎంపిక ప్రక్రియ కొనసాగింది. అయినప్పటికీ ఇప్పుడు జరిగిన ప్రక్రియే అంతిమం అని మేం అనుకోవటం లేదు. ఈ ఫెస్టివల్ ప్రతి ఏడాదీ ఆగస్ట్ నెలలో రెండో శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో జరుగుతుంది. ఈ విడత ఇందులో భాగం పొందలేని వారు భవిష్యత్తులో జరిగే ఫెస్టివల్ ఎడిషన్లలో భాగం పొందుతారు. వారందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చి, ఒకరితో ఒకరు సంభాషించుకొనేలా చేయటమే మా లక్ష్యం.

**ఈ నాలుగు దక్షిణాది భాషల రచయితలనూ ఒక వేదికపై తేవటం ద్వారా మీరు ఎలాంటి ఫలితాలను ఆశిస్తున్నారు?**

తెలుగులో సాహిత్యాభినివేశం ఉన్న పాఠకుడిని గానీ, రచయితని గానీ కన్నడలో మంచి పేరున్న ఐదారుమంది రచయితల పేర్లు చెప్పమంటే చెప్పగలిగే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇరుగు పొరుగు రాష్ట్రాలై ఉండి కూడా మనం ఒకరి సాహిత్యాన్ని మరొకరు ఇంగ్లీషు అనువాదాల ద్వారా చదవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. ఒక తెలుగు నవల ఇంగ్లీషు ద్వారా కన్నడ లోకి వచ్చినా మూలంలోని సారం చాలామటకు పోగొట్టుకునే వస్తుంది. మా ఉద్దేశమేమిటంటే- ఈ దక్షిణాది భాషల రచయితల మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడితే అప్పుడు ఇంగ్లీషు అవసరం లేకుండానే ఈ భాషల రచనలు ఒక భాష లోంచి మరొక భాషలోకి నేరుగా అనువాదం పొందటానికి ఒక దారి ఏర్పడుతుంది. సహోదర భాషలైన దక్షిణాది భాషల సాహిత్యం ఏకం కావాలన్నదే మా లక్ష్యం. ఇది జరిగితే ఇక ఆ తర్వాతి దశలో ఈ భాషల నుంచి ఇంగ్లీషు అనువాదాలు జరిగి ఇక్కడి సాహిత్యం అంతర్జాతీయ స్థాయికి చేరుతుంది.

**ఈ ఫెస్టివల్‌ను బెంగళూరులోనే నిర్వహించడానికి కారణం?**

అందుకు తగ్గ సాంస్కృతిక వాతావరణం బెంగళూరులో ఉండటం ఒక కారణం. మరొక కారణం కూడా ఉన్నది. బెంగళూరు నగరంలో 15శాతం మంది తెలుగు భాష మాట్లాడేవారు ఉన్నారు, 15 శాతం మంది తమిళం మాట్లాడేవారు ఉన్నారు, 8 శాతం మంది మలయాళం మాట్లాడతారు, 35 శాతం కన్నడ మాట్లాడతారు. ఇది పూర్తి స్థాయి కాస్మోపాలిటన్ నగరం.

**భవిష్యత్తులో ఈ ఫెస్టివల్ రూపురేఖల్లో ఇంకేమైనా మార్పులు చేర్పులు ఉండబోతున్నాయా?**

వచ్చే ఏడాది మరాఠీ భాషను కూడా దీనికి జత చేయబోతున్నాం. తర్వాత క్రమంగా ఉర్దూ, కొంకణి, తుళు, కొడవ భాషలు కూడా వచ్చే సంవత్సరాల్లో ఇందులో భాగమయ్యేట్టు చూస్తాం. అంతా సక్రమంగా జరిగితే భవిష్యత్తులో ఉత్తర భారతీయ భాషల కోసం కూడా లక్నో లాంటి ప్రదేశంలో బుక్ బ్రహ్మ ఫెస్టివల్ నిర్వహించాలన్న ఆలోచనలు ఉన్నాయి. ■

**కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం**

తెలంగాణ రచయితల వేదిక గత ఐదేళ్ళుగా ప్రదానం చేస్తున్న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కార ప్రదానం ఆగస్ట్ 6 సా.6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని మాడభూషి శ్రీధర్ స్వీకరిస్తారు.వివరాలకు: 94915 98040

బూర్ల వేంకటేశ్వర్లు

**కథలకు ఆహ్వానం**

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ – విశాఖ సంస్కృతి మాస పత్రిక కథల పోటీని నిర్వహిస్తున్నాయి. ఏ4 సైజ్ పేజీలపై చేతి వ్రాతలో ఐదు పేజీలు, డిటిపిలో నాలుగు పేజీలు దాటరాదు. ఎంపికైన ఆరు కథలకు రూ.2,500 నగదు బహుమతి. కథలను ఆగస్ట్ 24లోగా చిరునామా: బండికల్లు జమదగ్ని, 402, హిమజ టవర్స్, 3/10, బ్రాడీ పేట, గుంటూరు–522002కు పంపాలి. మరిన్ని వివరాలకు: 9848264742.

బండికల్లు జమదగ్ని

**'జుడుగుడు' కవితా సంపుటి**

ప్రతాప్ రాజులపల్లి కవితా సంపుటి 'జుడుగుడు' ఆవిష్కరణ సభ ఆగస్టు 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగు తుంది. కార్యక్రమంలో కట్టా నరసింహా రెడ్డి, తంగెడ కిషన్ రావు, కుప్పిలి పద్మ, సంగెవేని రవీంద్ర, సమ్మెట నాగమల్లేశ్వరరావు పాల్గొం టారు.

గజ్జెల అశోక్ రెడ్డి

**ఇంద్రగంటి సాహితీ పురస్కారం**

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం 2024 సంవత్సరానికి కవి అఫ్సర్ స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం ఆగస్టు 14 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ బహుమానంలో భాగంగా రూ.25వేల నగదు, జ్ఞాపిక బహూకరణ జరుగుతుంది.

ఇంద్రగంటి జానకీబాల

**నవలలకు ఆహ్వానం**

అరసం వరంగల్ ప్రతి ఏటా ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్నారు. 2024కు గాను నవలలకు ప్రదానం చేస్తారు. 2020 జూలై – 2024 జూన్ మధ్య మొదటి ముద్రణ జరిగిన నవలలు నాలుగు ప్రతులను ఆగస్టు 31లోగా చిరునామా: నిధి, ఇంటి నెంబర్ 2-4-1449, అశోక కాలనీ, హనమకొండ – 506001, ఫోన్: 97010 00306 కు పంపాలి. ఎంపికైన రచయితకు అక్టోబర్ 2024లో హనుమకొండలో రూ.5వేల నగదు, శాలువా, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం ఉంటుంది.

పల్లేరు వీరస్వామి





ఐలూరు - గుర్విందపల్లి మధ్య కరకట్టపై ప్రమాదకరమైన గోతులు



అవనిగడ్డ నుంచి విజయవాడ వస్తున్న కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సు

# ఐదేళ్లుగా గుంతల్లోనే..

కృష్ణానది కరకట్ట రోడ్డు ప్రమాదకరంగా మారింది. కరకట్టపై తారు రోడ్డు అనేకచోట్ల కుంగిపోంది. భారీగా గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. విజయవాడ వద్ద యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు 58 కిలోమీటర్లుంది. ప్రతిరోజు వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా రివర్ కన్జర్వెన్సీ (ఆర్సీ) అధికారులు రహదారికి మరమ్మతులు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించడం లేదు.

## కరకట్టపై ప్రయాణం దినదినగండం | ప్రమాదకరంగా మారిన గుంతలు

- ఇప్పటికే ప్రమాదాల్లో పలువురి దుర్మరణం
- ఐదేళ్ల నుంచి మరమ్మతులు శూన్యం
- ముళ్లచెట్లతో రోడ్డు మార్జిన్ మాయం
- అనధికార జాతీయ రహదారిగా రూపాంతరం
- నిత్యం వేలాది వాహనాల రాకపోకలు
- అయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**తోట్లవల్లూరు :** కృష్ణానదికి 2009లో భారీ వరదలు సంభవించి కరకట్ట బలహీనపడింది. 2010 - 13 మధ్యలో కట్టను వెడల్పు చేసి డబుల్‌లేన్ రోడ్డుగా పటిష్టపరచి తారురోడ్డు వేశారు. డబుల్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేయటంతో దివిసీమ, తీర గ్రామాల ప్రజలు విజయవాడకు సులువుగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలిగింది. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి తదితర మండలాలు ప్రజలకు కరకట్ట రహదారి అనుసంధానమయింది. దీంతో అవనిగడ్డ డిపో నుంచి విజయవాడకు కరకట్ట మీదుగా కరకట్ట ఎక్స్‌ప్రెస్ పేరుతో ఆర్టీసీ బస్సులు కూడా తిప్పుతున్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున నడుస్తోంది. కార్లు, ద్విచక్ర వాహనాలపై వందల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రేపల్లె నుంచి కూడా అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. కరకట్టపై వాహనాల రాకపోకలను చూస్తే అనధికార జాతీయ రహదారి గుర్తుకు వస్తుంది.

కరకట్ట రహదారి ఇసుక లారీల వల్ల అనేక చోట్ల ధ్వంసమైంది.

**రహదారి ధ్వంసం.. రాకపోకలకు ఆటంకం**

- పదిటైర్ల లారీల్లో 30 టన్నుల ఇసుకను రవాణా చేయటంతో తారు రోడ్డు కుంగిపోయి గుంతలుగా మారింది.
- గుంతలతో ఒక్క తోట్లవల్లూరు మండలంలోనే ద్విచక్రవాహనాల ప్రమాదాలు 20 వరకు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోయారు.
- ముళ్లకంప మరొక సమస్యగా తయారైంది. ముళ్లకంప, పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డు మార్జిన్ దాటి రోడ్డును కమ్మేస్తున్నా అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం వర్షాకాలంలో ముళ్లకంప సమస్య రోజురోజుకీ ఎక్కువవుతోందని వాహనదారులు చెపుతున్నారు.

**నిధుల కోసం ఎదురుచూపులే**

కరకట్ట రహదారికి మరమ్మతులు చేసేందుకు రూ.80 లక్షలతో అంచనాలు పంపామని గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్సీ అధికారులు తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చెప్పారు. సంవత్సరాలు గడిచినా నిధులు మంజూరు కాలేదు. గుంతలు అలాగే ఉన్నాయి. ప్రయాణికుల అవస్థలు అలాగే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా కరకట్ట రహదారికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రోడ్డుపైకి పెరిగిన ముళ్ల కంపను తొలగించాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**కరకట్టపై కనురెప్పపాటులో ప్రమాదాలు**

కరకట్టపై నిత్యం వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో పడి కారు అదుపుతప్పి కేఈబీ కెనాల్లో పడుతున్నాయి. గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొంటున్నాయి.

- ఇటువంటి ప్రమాదాలు అనేకం జరిగాయి. బైక్ ప్రమాదాలకు గుర్రై మండలంలోని కళ్లంవారిపాలేనికి చెందిన కళ్లం కృష్ణారెడ్డి (56), భద్రిరాజుపాలేనికి చెందిన ధర్మారెడ్డి (70) మృతిచెందారు.
- రేపల్లెకు చెందిన ఏసీ వ్యాపారి రొయ్యూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.
- గుర్విందపల్లి శివారు మధునాపురం వద్ద రెండేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు గుంతల్లో అదుపు తప్పి కాలువ వైపునకు దూసుకెళ్లింది.
- చోడవరం వద్ద బస్సు చెట్టుకు ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది. ఇలా అనేక ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.



దేవరపల్లి వద్ద కేఈబీ కెనాల్లోకి దూసుకెళ్లిన కారు (ఫైల్)

గత ప్రభుత్వంలో ప్రజా సమస్యలన్నీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి. అధికారులతో సమావేశాల్లేవు. సమీక్షలు లేవు. అభివృద్ధి పనులు లేవు. పరిపాలన పూర్తిగా స్తంభించింది. నూతన ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన మొదలైంది. జిల్లా పాలనా వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో స్పష్టత లేకపోవటం వల్ల కీలక నిర్ణయాలు తీసుకోవటంలో నెల రోజులుగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాగం వేచిచూసే ధోరణిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్లతో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, గత, ప్రస్తుత పథకాలకు సంబంధించి తీసుకోవాల్సిన నిర్ణయాలపై మార్గదర్శకాలు ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలేంటో చూద్దాం.



# ఎక్కడి సమస్యలు అక్కడే!

గత ప్రభుత్వంలో పూర్తిగా గాడి తప్పిన పాలన

- అభివృద్ధి శూన్యం.. ప్రజా సమస్యలు గాలికి..
- నూతన ప్రభుత్వంపై ప్రజల ఆశలు
- నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం
- జిల్లా పరిపాలనాంశాలపై దిశానిర్దేశం
- పేదల ఇళ్లు, టిడ్కో గృహాలపై స్పష్టత అవసరం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** పేదల ఇళ్ల పథకాలకు సంబంధించి చూస్తే వైసీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో సెంటు పట్టాలు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున పట్టాలను అందించింది. జిల్లా వ్యాప్తంగా 83 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. వీటిలో నాలుగేళ్లలో 10 శాతం అంటే 8 వేల ఇళ్లు కూడా పూర్తి కాలేదు. మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేదు. వర్షం వస్తే మునిగిపోయే పరిస్థితి నెలకొంది. దాదాపుగా 90 శాతంపైగా పునాదుల దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## మరికొన్ని సమస్యలివీ

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయాయి. వీటిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన టిడ్కో భవనాల పరిస్థితి కూడా జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఈ ఇళ్లలో సగానికి సగం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తర్వాత కట్టిన వాటిని కూడా పూర్తి చేయలేదు. మౌలిక సదుపాయాలను కల్పించలేదు.
- అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో జక్కంపూడిని ఆర్థిక నగరంగా చేయాలన్న ఉద్దేశంతో గతంలో ముఖ్యమంత్రి జెట్‌సిటీకి ప్రాధాన్యత ఇచ్చారు. ఇక్కడ కూడా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 7 వేల వరకు జరిగాయి. వాస్తవానికి ఇక్కడ 50 వేల ఇళ్ల వరకు నిర్మించాల్సి ఉండగా.. వైసీపీ ప్రభుత్వం వాటిని వదిలేసింది.
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం రద్దు చేసింది. గందరగోళానికి తావిచ్చిన రీ సర్వేను నిలుపుదల చేసింది. గతంలో మాదిరిగా భూదార్‌ను కొనసాగిస్తారా? రికార్డుల ప్యూరిఫికేషన్ కోసం ఏం చేస్తారన్నది ఈ సమావేశంలో స్పష్టత రావాల్సి ఉంది.
- అసైన్డ్ ఇళ్ల పట్టాలు, సాగు పట్టాలకు యాజమాన్య హక్కులను కల్పించే అంశానికి నిషేధిత జాబితా నుంచి వాటిని తొలగించాల్సి ఉంది. తద్వారా వీటికి రిజిస్ట్రేషన్లు జరుపుకోవటానికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటికి పెద్దగా సమయం లేదు.
- పంచాయతీల్లో చెత్త డంపింగ్, చెత్త తరలింపు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో గ్రీన్ అంబాసిడర్లను పెట్టి తడి, పొడిచెత్త వేరుచేయటం, సంపద తయారీ కేంద్రాలను సృష్టించటం జరిగింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో సంపద తయారీ కేంద్రాలను నిర్వీర్యం చేశారు.
- గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో మాదిరిగా ఉపాధి హామీ పథకం ద్వారా ఉధృతంగా సిమెంటు రోడ్లకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. హైవేలకు సంబంధించి భూ సేకరణ అంశాలపైనా, పర్యాటకాభివృద్ధి పైన, పరిశ్రమల విస్తృతికి సంబంధించి కూడా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గదర్శనం చేసే అవకాశం ఉంది.



## కొండపై ఆషాఢ రద్దీ

- దుర్గమ్మను దర్శించుకున్న 50 వేల మంది
- ముగిసిన ఆషాఢ ఉత్సవాలు

6లో..

గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం పేదలకు శాపంగా మారింది. లే అవుట్‌లోని ఇళ్లకు వెళ్లకుండా ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా గోడ కట్టడంతో పేదలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో దూరాన ఉన్న పొలాల్లో నుంచి కాలనీలోని తమ ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ

# నడిరోడ్డుపై అడ్డుగోడ

- కాలనీలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గోడ
- పంచాయతీకి దాన పత్రంగా ఇచ్చిన రోడ్డుపై నిర్మాణం
- ఓ వ్యక్తి నిర్వాకంతో దారి కోల్పోయిన పేదలు
- గోడ బద్దలు కొడితేనే పేదలు వెళ్లగలిగేది

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** విజయవాడకు చెందిన పేదలకు ముస్తాబాదలోని 200 ఎకరాల లే అవుట్‌లో 500 మంది పేదలకు ఇళ్ల పట్టాలు గత ప్రభుత్వం కేటాయించింది. విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందినవారు. ఈ కాలనీలో 150 ఇళ్లు పూర్తి అయ్యాయి. కొన్ని కుటుంబాలు నివశిస్తున్నాయి. మరో 350కిపైగా ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణ పనులు చేసుకోవటానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఈ కాలనీలోకి వెళ్లడానికి ముందు ఓ ప్రైవేటు వ్యక్తి కొంత భూమి ఉంది. అందులో కొంత డెవలప్‌మెంట్‌కు ఇచ్చి వెంచర్ వేశారు. మిగిలిన భూమి పొలంగా ఉంచుకున్నాడు. పొలం, వెంచర్ మధ్య 30 అడుగుల రోడ్డును వదిలారు. కాలనీకి వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. ఈ దారి మీదుగానే లే అవుట్‌లోకి వెళ్లి పేదలు తమ ఇళ్ల నిర్మాణ పనులు చూసుకుంటారు. మెటీరియల్ వంటివి తరలించే వాహనాలు కూడా ఇటు నుంచే వెళ్లేవి. ఈ క్రమంలో తమ రోడ్డును ఉపయోగించుకుంటున్నందున తనకు పరిహారం ఇవ్వాల్సిందిగా అప్పట్లో సదరు యజమాని డిమాండ్ చేయటంతో మౌఖికంగా అప్పటి కార్పొరేషన్ అధికారులు అంగీకరించినట్టు తెలుస్తోంది. గతంలో ఒకసారి తనకు పరిహారం ఇవ్వలేదన్న కారణంతో ఈ మార్గంలో కంచె వేశాడు. లబ్ధిదారులు గొడవ చేయటంతో కార్పొరేషన్ అధికారులు జోక్యం చేసుకుని తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. మళ్లీ ఇప్పుడు ఆ యజమాని ఏకంగా పేదల కాలనీకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించాడు. పంచాయతీకి ఈ రోడ్డును దానపత్రంగా ఇచ్చినట్టుగా తెలిసింది. ఇచ్చాక అడ్డుకునే హక్కు ఆ వ్యక్తికి లేదు. కానీ గోడ కట్టేశాడు. ఈ గోడ వల్ల పేదల కాలనీలోని ప్రజలు బయటకు రావటానికి, బయట నుంచి కాలనీలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. పురుషోత్తపట్నంలోని పొలాల నుంచి వెళుతున్నారు. తక్షణం ఈ వ్యవహారంపై గన్నవరం రెవెన్యూ, పంచాయతీ, గృహ నిర్మాణ శాఖ అధికారులు దృష్టి సారించి గోడను తొలగించాలి.

గన్నవరం మండలం రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. విమానాశ్రయ విస్తరణలో భూ సమీకరణలో ప్రభుత్వానికి నష్టం జరిగేలా చేస్తున్నారు. భూమి కోల్పోయిన వారికి ప్లాటు టు ప్లాటు ఇవ్వాల్సి ఉండగా ఎక్కువ పరిహారం రాబట్టే పద్ధతిలో తాజాగా రెవెన్యూ అధికారులు సీఆర్‌డీఏకు ప్రతిపాదనలు తీసుకువచ్చారు. వీటిని గతంలో ఒకసారి సీఆర్‌డీఏ అధికారులు తిరస్కరించినా మళ్లీ అవే ప్రతిపాదనలు తీసుకురావడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారం మాటున భారీ ముడుపుల పర్వం నడిచిందని ఆరోపణలు వస్తున్నాయి.



# మళ్లీ అవే ప్రతిపాదనలు

**రియల్టర్లకు ప్రయోజనం చేకూరేలా గన్నవరం రెవెన్యూ అధికారుల తీరు**

- విమానాశ్రయ విస్తరణలో పూలింగ్ కింద భూములు ఇస్తామని సీఆర్‌డీఏకు ప్రతిపాదనలు
- ఒకసారి తిరస్కరించినా మరోమారు అవే ప్రతిపాదనలు
- విస్తరణలో వెంచర్లతో ప్లాట్లు కోల్పోయిన బాధితులు
- వీరికి ప్లాట్ టు ప్లాట్ ఇస్తామని నాటి టీడీపీ ప్రభుత్వం హామీ
- తాజా వ్యవహారంలో వైసీపీ నేత పాత్ర ఉన్నట్టు అనుమానాలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** విమానాశ్రయ విస్తరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా 700 ఎకరాల భూములను సమీకరించారు. పలు వెంచర్లలోని ప్లాట్లను కూడా తీసుకోవాల్సి వచ్చింది. కేవలం వ్యవసాయ భూములకు సంబంధించి మాత్రమే సమీకరణ కింద తీసుకున్నారు. ఎంజీబీ బ్రదర్స్ ఆదిత్య విజయసాయి వెంచర్లలోని ప్లాట్లు కొన్నిటిని ప్లాటు టు ప్లాటు కింద తీసుకున్నారు. అప్పటి ప్రభుత్వం కూడా ఇదే హామీ ఇచ్చింది. ఆ దిశగా కదిలే సమయంలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. ఈ సమస్యను వైసీపీ పాలనలో పట్టించుకోకుండా వదిలేసింది.

### వైసీపీ ప్రజాప్రతినిధికి అనుకూలంగా..

వెంచర్లలో ప్లాట్లు పోను ఓ 50 ఎకరాలు వైసీపీ ప్రజాప్రతినిధి ఒకరు గత ప్రభుత్వంలో కొనుగోలు చేశారు. ఆ తర్వాత భారీ రేటుకు వాటిని అమ్ముకున్నారు. వైసీపీ నేత విక్రయించిన భూముల పక్కనే ఉన్న ప్లాట్లు విమానాశ్రయ విస్తరణ పరిధిలోకి వచ్చాయి. వీటికి ప్లాట్ టు ప్లాట్ ఇవ్వాల్సి ఉండగా.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

### అనుమానాస్పదంగా రెవెన్యూ అధికారుల తీరు

తాజా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. విమానాశ్రయ విస్తరణ సమస్యలపై దృష్టి పెట్టింది. రైతుల కౌలు సమస్యలతో పాటు, రిజిస్ట్రేషన్లు, నిర్వాసితుల సమస్యలు, ప్లాట్ల లబ్ధిదారుల సమస్యలపై కేంద్రీకరించింది. ప్లాట్ల లబ్ధిదారులకు గతంలో నిర్దేశించిన విధంగా ప్లాట్ టు ప్లాట్ ఇవ్వటానికి సిద్ధపడింది. దీనికి విరుద్ధంగా గన్నవరం రెవెన్యూ అధికారులు భూ సమీకరణ పథకం కింద ఇస్తామని తెలివిగా సీఆర్‌డీఏకు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన వెనుక కొందరు రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్టు తెలుస్తోంది.

### టీడీపీ ప్రభుత్వం అప్పట్లో చేసిందిదే..

బుద్ధవరంలో దాదాపుగా 423 మంది వరకు విమానాశ్రయ విస్తరణ కారణంగా నిర్వాసితులయ్యారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వం ప్లాట్ టు ప్లాట్ ప్రాతిపదికన పునరావాసం కల్పించేందుకు చిన్నఅవుటపల్లిలో 48 ఎకరాలు సేకరించింది. అక్కడ లే అవుట్ వేసి ప్లాట్లుగా విభజించింది. రోడ్లు, డ్రెయిన్లు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించింది. లబ్ధిదారులకు మోడల్ గృహాలను కట్టించేందుకు అప్పట్లో ఓ ఏజెన్సీతో డిజైన్లు రూపొందించింది. ఇంతలో ప్రభుత్వం మారింది.

### సమీకరణకు, ప్లాట్ టు ప్లాట్‌కు తేడా ఏంటి?

వెంచర్లలోని ప్లాట్ల వారికి అమరావతిలో ప్యాకేజీ కల్పిస్తే.. పేదలకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. పేదలకు ఇవ్వకుండా ప్లాట్లదారులకే ప్యాకేజీ కల్పిస్తే పేదల పట్ల ఒక న్యాయం, పెద్దల పట్ల ఒక న్యాయం చూపినట్టు అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్లాట్ టు ప్లాట్ విధానాన్ని అవలంబించింది. ఇప్పుడు రాజధానిలో ధరలు పెరిగాయన్న ఉద్దేశంతో సమీకరణ కింద ఇచ్చేస్తే ప్యాకేజీకి భారీ విలువ ఉంటుందని కొందరు రెవెన్యూ అధికారులతో వెంచర్ల వ్యాపారులు చేతులు కలిపినట్టుగా తెలుస్తోంది. దీంతో వెంచర్ల పరిధిలోని 20 ఎకరాలను పూలింగ్ కింద ఇచ్చేందుకు సీఆర్‌డీఏకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు తీసుకొచ్చారు.

## సీ కమాండోస్...

**కమిషనరేట్ పరిధిలో 200 మంది నియామకం**

- 'ఈ' నేరాలపై ప్రజలకు అవగాహన

**విజయవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) :** సైబర్ నేరగాళ్లు ఏయే మార్గాల్లో వల విసురుతారు? మనకు వచ్చిన లింక్‌లో ఎలాంటి మాయ ఉంటుంది? సైబర్ వలలో పడకుండా ఉండడానికి ఏం చేయాలి? ఒకవేళ పడితే వెంటనే ఏం చేయాలి? ఇటువంటి అంశాలపై అవగాహన కల్పించడానికి 'సీ' కమాండోలు తయారయ్యారు. టెక్నాలజీపై పూర్తిస్థాయిలో పట్టున్న 200 మంది సైబర్ కమాండోలను పోలీసు కమిషనరేట్‌లో నియమించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లను ఇందుకు ఎంపిక చేశారు. వారికి పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం శిక్షణ ఇచ్చారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు తదితరులు సైబర్ నేరాలపై వారికి వివరించారు. సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్న డిజిటల్ అరెస్ట్, పెట్టుబడుల పేరుతో మోసాలు, హనీట్రాప్‌లు వంటి అంశాలపై వివరించారు. ఈ కమాండోలు కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వారి నుంచి సైబర్ సోల్జర్స్‌ను ఎంపిక చేస్తారు. ఒక్కో కమాండో 10-15 మంది సోల్జర్స్‌కు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.



# కొండపై ఆషాఢం రద్దీ

- దుర్గమ్మను దర్శించుకున్న 50 వేల మంది .. ముగిసిన ఆషాఢం
- 31వేల చీరల సారె సమర్పణ



**వన్‌టౌన్, ఆగస్టు 4 :** దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాలు, సారె సమర్పణల కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయని దేవస్థానం ఈవో రామారావు తెలిపారు. ఆదివారం దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది తరపున సారె సమర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆషాఢమాసంలో పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి 31 వేలకు పైగా చీరలను సమర్పించారన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా లోక కళ్యాణార్థం వారాహి నవరాత్రి పూజ, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ఈతి బాధలు తొలగించాలని మూడు రోజుల పాటు శాకంబరీ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించినట్టు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేయటంలో అందరి సహకారం ఉందన్నారు. ఆషాఢమాసం చివరి రోజైన ఆదివారం దుర్గగుడి కొండపై భక్తుల రద్దీ పెరిగింది. భక్తులకు శీఘ్ర దర్శనం కోసం క్యూలలో భక్తులను ఈవో, అధికారులు నియంత్రించారు.

### నేటి నుంచి శ్రావణమాసం

శ్రావణ మాసం పురస్కరించుకుని దేవస్థానంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### దేవస్థాన సిబ్బంది సారె



ఆషాఢ మాసం ముగింపు నాడు ఆదివారం దేవస్థానం సిబ్బంది తరపున అమ్మవారికి ఘనంగా సారె సమర్పించారు. బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో ఉన్న రావిచెట్టు వద్ద విగ్రహాలకు ఈవో రామారావు, ఆలయ అధికారులు, సిబ్బంది వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా సారెతో కొండపైకి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లీలా కుమార్, స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ, వైదిక సిబ్బంది, వేద పండితులు, అర్చకులు, ఈఈలో ఇంజనీరింగ్ సిబ్బంది, వివిధ విభాగాల పర్యవేక్షకులు తదితరులు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

### సూర్యోపాసన సేవ

ఆదివారం పురస్కరించుకుని సకలజనులకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుతూ దుర్గగుడి అర్చకులు సూర్యోపాసన సేవచేశారు. సూర్యనారాయణస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అరుణ పారాయణ చేశారు.

### అన్న వితరణకు విరాళం

చీరాల, ముస్తఫానగర్‌కు చెందిన మద్దుల నాగేశ్వరరావు కుటుంబసభ్యులు ఈవో రామారావు ద్వారా రూ.1,00,000 చెక్కు అందించారు. రాంకౌశిక్, యశస్విని పేరిట అన్న వితరణకు విరాళం అందజేశారు.



### ధర్మ పథంపై అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి ధర్మపథం వేదికపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. విజయవాడకు చెందిన భాగవతుల వెంకటరామశర్మ బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యంతో అభినయించి ఆహూతుల హర్షధ్వానాలు అందుకుంది.




ఐఎంఏ హాలు నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మీషా

# తల్లిపాలే శిశువుకు తొలి ఆరోగ్య టీకా

- ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో

**గవర్నర్‌పేట, ఆగస్టు 4 :** తల్లిపాలు శిశువుకు తొలి ఆరోగ్య టీకా వలే పనిచేస్తుందని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ జి. లక్ష్మీషా అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత పిల్లల వైద్య నిపుణుల మండలి, కృష్ణాజిల్లా వైద్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రి వరకు ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల అవగాహన నడకను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'అంతరాన్ని తగ్గిద్దాం, తల్లులందరూ తల్లిపాలు ఇచ్చేలా మద్దతిద్దాం' అనే నినాదంతో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా బ్రెస్ట్ కేన్సర్ రుగ్మత నివారణ చికిత్సకు సాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పిల్లల వైద్యనిపుణుల మండలి కృష్ణాజిల్లా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ యలమంచిలి సంధ్యా, కార్యదర్శి డాక్టర్ వి.శ్రీదేవి, ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ చలసాని ప్రమోద్, వైద్యులు వెల్లంకి శ్రీదేవి, డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ పీవీ దుర్గరాణి, డాక్టర్ చందన, వివిధ వైద్యకళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




ఇసుక కట్టలతో పూడ్చిన గండి

# బందరు కాలువ గండి పూడ్చివేత

**తోట్లవల్లూరు, ఆగస్టు 4 :** పెనమకూరు వద్ద బందరు కాలువకు పడిన గండిని ఆదివారం ఇసుక కట్టలు అడ్డుపెట్టి పూడ్చివేశారు. గత రెండు రోజులుగా కాలువ ప్రవాహాన్ని తగ్గించక పోవటంతో పంచాయతీ, గ్రామస్థులు పడిన శ్రమ ఫలితం ఇవ్వలేదు. 'కాల్వకట్టకు గండి' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ ప్రవాహాన్ని కొంత తగ్గించారు. దాంతో ఇసుక కట్టలు వేయటానికి అనుకూలత ఏర్పడింది. ప్రస్తుతానికి గండిని ఇసుకకట్టలతో పూడ్చామని, అక్కడ మట్టిని కూడా వేయాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. మట్టి వేయకుంటే మళ్లీ నీటి ప్రవాహం పెరిగితే గండి సమస్య ఉత్పన్నం అవుతుందని పేర్కొన్నారు.

# రక్షణ ఎగుమతుల్లో ముందున్నాం

- శాస్త్రవేత్త జి.సతీష్ రెడ్డి
- ఘనంగా మండలి జయంతి వేడుకలు



సతీష్ రెడ్డికి పురస్కారం అందజేస్తున్న జస్టిస్ దుర్గా ప్రసాద్, ఎంపీ, ఎమ్మెల్యేలు

**అవనిగడ్డ, ఆగస్టు 4 :** రక్షణ రంగ ఎగుమతుల్లో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించటమే కాక, నేడు ఇతర దేశాలకు రక్షణ సామగ్రిని ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని, దీనికి రక్షణ రంగ శాస్త్రవేత్తలు నిర్విరామ కృషే కారణమని శాస్త్రవేత్త జి.సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ రంగంలో విశేష పరిశోధనలు చేసిన తెలుగు తేజం సతీష్ రెడ్డికి మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని జస్టిస్ యు.దుర్గాప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ భవాని ప్రసాద్, జస్టిస్ ఆకుల వెంకట సాయిల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ, గడచిన రెండు దశాబ్దాల కాలంలో రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించేందుకు విశేష కృషి చేసిందని, నేడు 25 వేల కోట్ల రూపాయల మేర ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగిందని, రాబోయే 1, 2 ఏళ్లలో ఈ ఎగుమతులు రూ.80 వేలకోట్లకు చేరుకుంటాయని సతీష్ రెడ్డి అన్నారు. నిమ్మకూరులోని బెల్ కంపెనీ ద్వారా త్వరలోనే ప్రపంచానికి ఎగుమతులు ఉంటాయని, గుల్లలమోదలో క్షిపణి పరిశోధనా కేంద్రానికి సంబంధించి మౌలిక సదుపాయల కల్పన పూర్తయిందని, త్వరలోనే క్షిపణి పరిశోధన కల సాకారం అవుతుందని ఆయన తెలిపారు.

### ఎంవీకే సేవలు మరువలేనివి..

దివిసీమ గాంధీగా పేరుగాంచిన మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాషాభివృద్ధికి, దివిసీమ పునర్నిర్మాణం కోసం చేసిన సేవలు నిరుపమానమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, ఆకుల శేషసాయిలు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఏకతాటిపైకి తెచ్చి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన ఘనత ఎంవీకేదే అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ఎంవీకే జీవిత చరిత్ర నేటి తరం యువతకు ఆదర్శనీయమన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సిలికానాంధ్ర వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్, డోలేంద్ర ప్రసాద్, కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, మండలి వెంకట్రామ్, మండలి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు సంక్షేమ పథకాలు

- 49 యూనిట్లకు అవకాశం
- ఏడీ లక్ష్మీనారాయణ

**గుడ్లవల్లేరు, ఆగస్టు 4 :** పాడి పరిశ్రమ అభివృద్ధి దిశగా ప్రభుత్వం పాడి రైతులకు సంక్షేమ పథకాలను అందిస్తోందని గుడ్లవల్లేరు పశు సంవర్ధక శాఖ డివిజన్ ఏడీ ఎ.లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా గోరక్ష పశువుల శాలల నిర్మాణాలకు 90 శాతం రాయితీతో గుడివాడ, గుడ్లవల్లేరు మండలాలకుగాను 49 యూనిట్ల చొప్పున అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. రెండు గేదెలకు షెడ్ నిర్మాణానికి రూ1.15 లక్షలు కాగా రైతువాటా రూ11.500, ప్రభుత్వం రూ 1.03,500 ఇస్తుందని, 6 గేదెల వరకూ అవకాశం ఉందని తెలిపారు. గొర్రెల షెడ్‌లకు 70 శాతం రాయితీతో 20కి రూ.1.30 లక్షలు.. రైతు వాటా 39 వేలు, ప్రభుత్వం రూ. 91 వేలు, ఇలా 100 గొర్రెల వరకూ ఇస్తామన్నారు. కోళ్లకు 70 శాతం రాయితీ తో 100 కోళ్లకు రూ.87,000లకు రైతు వాటా రూ26,100, ప్రభుత్వం రూ. 60.900 ఇస్తుందన్నారు. 200 కోళ్ల షెడ్ నిర్మాణానికి 70 శాతం రాయితీ ఇస్తుందన్నారు. వీటికి అర్హులు తెల్లరేషన్ కార్డు దారులై ఉండాలి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. పాడి రైతులు తమ గ్రామాలలో పశు వైద్యశాలల్లో అర్జీలు పొంది పెట్టుకోవాలని, సందేహాలు ఉంటే గుడ్లవల్లేరు పశు వైద్యశాలలో ఏడీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.



వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాకవి దేవేంద్ర, వామపక్ష నేతలు

# పాటను ఉద్యమ ఆయుధంగా మలచిన వడ్లమూడి

- ప్రజాకవి వడ్లమూడి శతజయంతిలో వక్తలు

**గవర్నర్‌పేట, ఆగస్టు 4 :** కళారంగానికి తొలి ఆయుధం పాట అని, అటువంటి పాటను నాటి ఉద్యమ అవసరాలకు ఆయుధంగా మలచి, నమ్మిన సిద్ధాంతాలకు జీవితాన్ని అంకితం చేసిన మహా వ్యక్తి, ప్రజాకవి వడ్లమూడి అని ప్రజాకవి కె.దేవేంద్ర అన్నారు. ప్రజాకవి, రచయిత, ప్రజానాట్యమండలి పునర్నిర్మాణంలో ఒకరైన వడ్లమూడి నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవం ఆదివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో జరిగింది. దీనిలో భాగంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆట..పాట..మాట' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ సభకు అధ్యక్షత వహించారు. కె.దేవేంద్ర, పలువురు వామపక్ష, ప్రజాసంఘాల నేతలు వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ, కళ కళ కోసం కాదు ప్రజల కోసమే అని విశ్వసించిన వ్యక్తి వడ్లమూడి అన్నారు. వడ్లమూడి వేలుపట్టుకుని తన పాట ప్రయాణం మొదలైందని ప్రకటించారు. ఈ సందర్భంగా వడ్లమూడి నాగేశ్వరరావు రచించిన గేయాల ఆలాపన, మారాజులొచ్చారు, సందేశం, పల్లెలో పనివాడా నృత్యరూపకాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నేత వై.కేశవరావు, సీనియర్ జర్నలిస్టు వడ్లమూడి పద్మ, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ వడ్లమూడి రామకృష్ణ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# పెడనలో ఫ్లెక్సీ రగడ!

- టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ
- ఉద్రిక్తత.. అడ్డుకున్న పోలీసులు



ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో మొహరించిన పోలీసులు

**పెడన, ఆగస్టు 4 :** టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఏర్పడిన ఫ్లెక్సీల వివాదంతో పెడన బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పి ఉద్రిక్తతను సడలింప చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో టీడీపీకి చెందిన ఫ్లెక్సీ ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలకు ఫ్లెక్సీ చిరిగిపోయింది. నాలుగు రోజుల క్రితం చిరిగిపోయిన ఫ్లెక్సీని తొలగించిన వైసీపీ వర్గీయులు దాని స్థానంలో వైసీపీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం నడుస్తోంది. కాగా ఆదివారం టీడీపీ నాయకులు వహబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, హమీదుల్లా, పరసా జితేంద్ర, సేనాపతి అజయ్ తదితరులు వైసీపీ ఫ్లెక్సీని తొలగించి దాని స్థానంలో ఏర్పాటు చేయడానికి టీడీపీ ఫ్లెక్సీని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న సీఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో వచ్చి వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తామని, తొలగించిన తరువాత మీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ నాయకులకు సూచించారు. అందుకు వారు అంగీకరించారు. కాగా కమిషనర్ వెంకట్రామయ్య ఆదేశాల మేరకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్‌లు సిబ్బందితో వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తుండగా వైసీపీకి చెందిన వైస్‌చైర్మన్ ఎండి ఖాజా అడ్డుతగిలి ఫ్లెక్సీని తొలగిస్తే చేతులు నరికేస్తానని సిబ్బందిని హెచ్చరించారు. పోలీసులతో వాదనకు దిగాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు ఖాజాను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఖాజాకు మద్దతుగా వైసీపీ నాయకులు కోమట్ల అనిల్, రౌతుల ప్రసాద్‌లు స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ సుభాన్ వైసీపీ నాయకులకు నచ్చచెప్పి ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరింపచేశారు. మునిసిపల్ సిబ్బంది పోలీసు బందోబస్తుతో వైసీపీ ఫ్లెక్సీని తొలగించారు. అనంతరం టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేయబోగా రెండు రోజుల తరువాత ఏర్పాటు చేసుకోవాలని సీఐ వారికి సూచించారు.



వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది



టీడీపీ సోషల్ మీడియా సభ్యులు

# టీడీపీ సోషల్ మీడియా ఆత్మీయ కలయిక



కేకు కట్ చేస్తున్న టీడీపీ నేతలు

**వన్‌టౌన్ ఆగస్టు 4 :** విజయవాడ ఎన్టీఆర్ కాలనీలోని ఓ కళ్యాణ మండపంలో టీడీపీ సోషల్ మీడియా మిత్రుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సోషల్ మీడియా కుటుంబసభ్యులపై నమోదైన కేసుల వివరాలను తెలియపరచాలన్నారు. టీడీపీ సోషల్ మీడియా కీలక పాత్ర పోషించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపనులు, పథకాల అమలును ప్రజలకు వివరించాలని తెలిపారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. టీడీపీ గెలుపులో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమ నిర్వహకులు రావెళ్ల ఉదయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పసాని రాజేష్, అడుసుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన వైద్యంతో సత్వర ప్రయోజనం

- క్యాపిటల్ ఆసుపత్రిలో లైవ్ అడ్వాన్స్‌డ్ గైనకాలజీ వర్క్‌షాప్

**పెనమలూరు, ఆగస్టు 4 :** పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో ఆదివారం గైనకాలజీపై మినిమల్లీ ఇన్వేసివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అసోసియేషన్, ఐఎంఏ, క్యాపిటల్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో రెండువందలకు పైగా వైద్యులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో ఎండోమెట్రియాసిస్‌కు సంబంధించిన లాపరోస్కోపిక్ సర్జరీ టెక్నిక్‌ను ప్రత్యక్ష ప్రసారం చేశారు. వర్క్‌షాప్ ఆపరేటింగ్ ఫ్యాకల్టీ, క్యాపిటల్ ఆసుపత్రి, హెల్త్‌కేర్ ఇండస్ట్రీకి గొప్ప ప్రారంభంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ హరీష్ మన్నే పేర్కొన్నారు. రోగులకు ప్రయోజనం చేకూర్చే మినిమల్లీ ఇన్వేషన్ కలిగి ఉన్న అధునాతన లాపరోస్కోపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే తీవ్ర పీరియడ్స్ నొప్పి ఎండోమెట్రియోసిస్ అనేక ఇతర ఇబ్బందులను కలిగిస్తుందని, దీనికి క్యాపిటల్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందని డాక్టర్ నెలవల్లి అశ్విని తెలిపారు. ఏపీఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, ఇటువంటి లైవ్ వర్క్‌షాపులతో ఆరోగ్య సంరక్షణ నిపుణులు మెరుగైన క్లినికల్ ప్రమాణాలను నేర్చుకొంటారని తెలిపారు.



క్యాపిటల్ ఆసుపత్రిలో లైవ్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఎండీ



ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

# బందరు పోర్టు పనులు వేగవంతం

- గన్నవరం ఘటనలో ఎవరినీ వదిలిపెట్టం
- మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, ఆగస్టు 4 :** బందరు పోర్టు నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని, దీంతో బందరులో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, శని, ఆదివారాల్లో ఏదో ఒక రోజు ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు 1159 అర్జీలు అందగా, వాటిలో 850 పరిష్కరించినట్టు తెలిపారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేయాలంటూ వినతిపత్రాలు అందుతున్నాయన్నారు. ఉద్యోగాల కోసం 159 మంది యువత దరఖాస్తు చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈనెల 25న కొరియన్ బృందం మచిలీపట్నం బీచ్‌ను సందర్శించనుందన్నారు. త్వరలో మేధావులతో సమావేశం ఏర్పాటుచేసి బందరు భవిష్యత్తుపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**గవర్నర్‌పేట, ఆగస్టు 4 :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే సేవా భారతి, తెలుగు తేజం జాతీయ స్థాయి పురస్కారాలు-2024 ప్రదానోత్సవానికి అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు 'ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ' (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు వికలాంగులకు సేవలు అందించే సంస్థలు, కళలు, సాహిత్యం, క్రీడలు, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో సేవలు అందించేవారు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో ప్రతిభగల వారు పురస్కారాల ఎంపికకు అర్హులన్నారు. తమ అర్హతను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు దరఖాస్తుకు జతచేసి ఈనెల 10వ తేదీ లోగా సంస్థ కార్యాలయానికి చేరేలా పంపాలని కోరారు. ఇతర వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

# సోషల్ జస్టిస్ ఫోరం ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

**ధర్నాచౌక్, ఆగస్టు 4 :** సోషల్ జస్టిస్ ఫోరం తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ప్రకటించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ సామాజిక ఉద్యమ నేత యర్రాకుల తులసీరామ్ యాదవ్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థిగా కాపు సామాజిక ఉద్యమ నేత కోటిపల్లి అయ్యప్పను ప్రకటించడం జరిగిందని, వీరి గెలుపుకు ఫోరం కృషి చేస్తుందని అన్నారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కో-కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, నల్లజర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 2,500 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 :** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో పోలీసుల తనిఖీల్లో 2,500 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌తో వెళుతున్న లారీ పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బసవ కల్యాణ్ తాలూకా చిల్లపల్లి గ్రామానికి చెందిన చిట్‌గుప్ప రాజాసాహెబ్ (61) లారీ డ్రైవర్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి లారీ ఆపి పరారవుతుండగా పట్టుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి నుంచి మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి బియ్యాన్ని తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. 50 కిలోల 500 బస్తాలు 2,500 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు పీడీఎస్ డీటీ రామకృష్ణ చెప్పారు. శనిశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి నుంచి బియ్యాన్ని లోడ్ చేసుకొని వెళుతున్నట్టు తేలిందని పోలీసులు వివరించారు.

# కట్న వేధింపులతో..

- వివాహిత ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

**చిట్టినగర్, ఆగస్టు 4 :** భర్త, అత్తంటి వేధింపులు తాళలేక వివాహిత అధిక మోతాదులో మాత్రలు మింగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాపురానికి చెందిన రామలక్ష్మి (38) బుడమేరు మధ్య కట్టకి చెందిన కె.మణికంఠలు 2023 జూన్‌లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మొదట సక్రమంగానే చూసుకున్న భర్త కొద్ది నెలలుగా షాపు పెట్టుకోవాలని, పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మని రామలక్ష్మిని వేధింపులకు గురి చేస్తున్నాడు. మణికంఠ తల్లి, అక్క, ఆమె భర్త పలుమార్లు రామలక్ష్మిని కట్నం తీసుకురాకుండా వచ్చావంటూ వేధింపులకు గురి చేసేవాళ్లు. విషయం రామలక్ష్మి తన తండ్రి దుర్గాప్రసాద్‌కు చెప్పటంతో ఇటీవల అంబాపురంలోనే కొత్తగా కాపురం పెట్టించారు. అయినా మణికంఠలో ఎటువంటి మార్పులేదు. రెండు రోజుల క్రితం షాపు పెట్టడానికి డబ్బులు తెమ్మని రామలక్ష్మిని కొట్టడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న మాత్రలు అధిక మొత్తంలో వేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో మణికంఠ రామలక్ష్మి తండ్రికి విషయం తెలియజేశాడు. హుటాహుటిన ఆమెను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ రామలక్ష్మి ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, ఆడపడుచు, ఆమె భర్తపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

# విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 105, 116 |
| చికెన్ విత్ స్కిన్ | 180 |
| చికెన్ స్కిన్‌లెస్ | 190 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

## విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

**గవర్నర్‌పేట, ఆగస్టు 4:** లెవెన్ కేవీ శివగిరి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని గుమ్మడి వారి వీధి, శివాలయం వీధి, గుమ్మడి తోట, బోయపాటి మాధవరావు వీధి, బందెల దొడ్డి, సీఎస్ఐ చర్చి ఏరియా, కమిలి బాబా ఆశ్రమం, శివగిరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బీవీ సుధాకర్ తెలిపారు.

### యామినీ కృష్ణమూర్తి మృతి
## నృత్య రంగానికి తీరనిలోటు

**ధర్నాచౌక్, ఆగస్టు 4:** యామినీ కృష్ణమూర్తి మృతి నృత్య రంగానికి తీరని లోటని మాజీ సమాచార కమిషనర్ ఐలాపురం రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యామినీ కృష్ణమూర్తి భారతదేశం గర్వించదగ్గ నృత్య కారిణి అని తెలుగు నాట్యకళకు విశ్వఖ్యాతి తెచ్చారని ఆయన పేర్కొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నాట్యాల్లో ఆమె ఎన్నో ప్రదర్శనలు చేశారని, కర్ణాటక సంగీతంలోనూ అద్భుతంగా రాణించారని పేర్కొన్నారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ద్వారా 2015లో నగరంలో నిర్వహించిన నృత్యోత్సవంలో జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశామని తెలిపారు. ఆమె నృత్యం రాబోయే తరాలకు ఆదర్శమని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు

**పాయకాపురం, ఆగస్టు 4:** బాలికను వేధిస్తున్న యువకుడిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన బాలిక(11) స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువు తోంది. అదే ప్రాంతానికి చెందిన యువకుడు అశోక్ ఎవరి తోనే ఫోన్‌లో మాట్లాడుతున్నట్లుగా బాలిక పట్ల అస భ్యంగా మాట్లాడుతున్నాడు. అదేమని ప్రశ్నించిన బాలిక తల్లిని కూడా దుర్భాషలాడాడు. దీంతో బాధితులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కుమార్తె కనిపించడం
## లేదని తండ్రి ఫిర్యాదు

**పాయకాపురం, ఆగస్టు 4:** తన కుమార్తె కనిపించడం లేదని ఆదివారం నున్న రూరల్ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశాడు. రాధానగర్ ప్రాంతానికి చెందిన బాలిక (15) పదో తరగతి వరకు చదివి ఇంట్లో ఉంటోంది. శనివారం సాయంత్రం తన స్నేహితురాలి వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో బాలిక తండ్రి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మధురానగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

## జోరుగా జనసేన సభ్యత్వ నమోదు

**మధురానగర్, ఆగస్టు 4:** మధురానగర్‌లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో సభ్యత్వ నమోదు చేస్తున్నారు. ఆదివారం నాటికి 1500 దాటిందని ఆయన తెలిపారు. విద్యార్థులు, యువత, మహిళలు సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. కెంబూరి భవాని, వెంపటాపు శ్రీను, అత్కూరి కిరణ్, కాయల రవి, లక్కిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేత్ర వైద్య శిబిరం

**పటమట, ఆగస్టు 4:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలో బెజవాడ హాస్పిటల్స్ సహకారంతో అసోసియేషన్ సభ్యులు పొన్నగంటి సాంబశివ నేత్రత్వంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చలసాని ప్రశాంత్(ఆర్థో) బీఎండీ పరీక్షలను, డాక్టర్ రూప కొల్లి మధుమేహ పరీక్షలను చేసి సలహాలను అందజేశారు. సంధ్య కంటి ఆస్పత్రి సహకారంతో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోనేరు వెంకటేశ్వరరావు, సెక్రటరీ లోయ నాగేశ్వరరావు, సభ్యులు శంకర రావు, పోలవరపు ప్రసాద్, నందమూరి మల్లికార్జునరావు, మునునూరి పాండురంగారావు పాల్గొన్నారు.



# ప్రభుత్వం మారినప్పుడల్లా ప్రారంభోత్సవం

● వెటర్నరీ కాలనీ వీఎంసీ పార్కులోని వ్యాయామశాలకు వైసీపీ హయాంలో ఒకసారి..నేడు మరోసారి ప్రారంభోత్సవం

● రాజకీయ ఉనికి చాటుకోవడానికి, పార్టీ మారడానికి కొందరు నాయకులు చేస్తున్న ప్రయత్నమంటున్న స్థానికులు



**భారతీనగర్:** నాలుగో డివిజన్ వెటర్నరీ కాలనీలో వీఎంసీ పార్కు ఉంది. పార్కును ఎన్టీఆర్, వెటర్నరీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీల వాసులు వినియోగించుకుంటారు. ఈ పార్కులోని మెదటి అంతస్థులోని భవనంలో వ్యాయామశాల ప్రారంభోత్సవాన్ని సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో చేయించబోతున్నారు. అందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లు చూసిన కొందరు స్థానికులు అధికారం మారినప్పుడల్లా ప్రారంభోత్సవాలు ఏంటి అని చర్చించుకుంటున్నారు. వైసీపీ పాలనలో ఇదే పార్కులోని వ్యాయామశాలను వైసీపీ స్థానిక నాయకులు, కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు మారడంతో తమ ఉనికిని చాటుకోవడానికి, పార్టీ మారడానికి అందులోని కొంతమంది పెద్దలు చేస్తున్న ప్రయత్నంలో భాగమని అంటున్నారు. అందుకే సోమవారం ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులతో వ్యాయామశాలను ప్రారంభిస్తున్నారంటున్నారు.



విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బొండా ఉమా

### స్పందన సేవా సమితి
## సేవలు అభినందనీయం

**పాయకాపురం, ఆగస్టు 4:** స్పందన సేవా సమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రశాంతినగర్‌లోని సమితి కార్యాలయంలో స్పందన వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వైకే శాస్త్రి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైకే శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆరుగురు విద్యార్థులకు చదువు నిమిత్తం రూ.27 వేలు అందజేశారు. రూ.3600 విలువ చేసే యోగా మ్యాట్లను వాకర్స్‌కు, స్థానికులకు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, చిన్నం రామకృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆదేశాలతో ఆస్పత్రిని సందర్శించి డాక్టర్లతో మాట్లాడుతున్న ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు

### షేక్ రాజా సాహెబ్ ఆస్పత్రి
## అభివృద్ధికి సుజనాచౌదరి కృషి

**చిట్టినగర్, ఆగస్టు 4:** ప్రజలకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందేలా కొత్తపేట షేక్ రాజా సాహెబ్ ఆస్పత్రిని మోడ్రన్‌గా తీర్చిదిద్దేందుకు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు. సుజనాచౌదరి ఆదేశాలతో ఆదివారం కొత్తపేట షేక్ రాజా సాహెబ్ ఆస్పత్రిని పలువురు నాయకులతో కలిసి ఆయన సందర్శించి అక్కడ మౌలిక సదుపాయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. జూలైలో సుజనా చౌదరి ఆసుపత్రిని సందర్శించి అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారన్నారు. మెరుగైన వైద్య సేవలకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారని శ్రీధర్ తెలిపారు. ఆస్పత్రి ఆధునీకరణకు ఎంత ఖర్చు అవుతుందో వివరాలను అందజేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, రోగులకు అందించాల్సిన సేవలు, మౌలిక సదుపాయాలపై అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

# సాటివారికి సాయం చేయడమే బైబిల్ సందేశం

**వన్‌టౌన్, ఆగస్టు 4:** సాటివారికి సాయం చేయడమే బైబిల్ సందేశమని, దేవదేవుడు ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కంకిపాడు మండలంలోని దావులూరులో ఫాదర్ చాట్ల రాజశేఖర్ నిర్మించిన ట్రాన్స్‌ఫర్మేషన్ చర్చి ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కేశినేని చిన్ని పాల్గొని ఫౌండేషన్ స్టోన్‌ను ఆవిష్కరించారు. రెవరెండ్ డాక్టర్ డేవిడ్ బ్రెనహమ్ దేవుని కీర్తన ఆలపిస్తుండగా మందిరంలో ప్రవేశించారు. లంకా కరుణాకర్ దాస్, రెవ. ఆశీర్వాదం పాల్, కారుమంచి ప్రశాంత్, తాన్యా, చాట్ల విజయ్ బాబు, టీడీపీ నాయకుడు మాదిగాని గుర్నాథం, జడ్పీ కార్యదర్శి నరసింహ చౌదరి, డాక్టర్ సంకే విశ్వనాథం, హబీద్ హుస్సేన్, ఇత్తడి చార్లెస్, తదితరులతో పాటు గ్రామ ప్రజలు, దైవ సేవకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

## తేలప్రోలు రాజా హైస్కూల్‌లో అన్నదానం



స్నేహితుల దినోత్సవం సందర్భంగా అన్నదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

**చిట్టినగర్, ఆగస్టు 4:** స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్వర్గస్తులైన తమ మిత్రులకు నివాళులర్పిస్తూ తేలప్రోలు రాజా హైస్కూల్ 1989-1994 పూర్వ విద్యార్థుల మిత్ర బృందం ఆదివారం కొత్తపేట స్కూల్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వర్గస్తులైన తమ మిత్రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.హనుమంతరావు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**అజిత్‌సింగ్‌నగర్:** ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రభ కాలనీలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 200 మందికి మధుమేహం, రక్తపోటు, ఈసీజీలతో పాటు వివిధ రక్త పరీక్షలను వైద్యులు ఉచితంగా చేశారు. బొండా ఉమా ఉచితంగా మందులను అందజేశారు. ఫెడరేషన్ నేతలు అలా తారక రామారావు, డాక్టర్లు తేజస్విని, షణ్ముఖరావు పాల్గొన్నారు.

### నేడు తాడిగడప డొంకరోడ్డులో..

**పెనమలూరు:** తాడిగడప డొంకరోడ్డులో నేడు లంకా సురేష్ ఆర్థిక సాయంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు లంకా నారాయణరావు తెలిపారు. పార్థసారథి కళ్యాణమండపంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో కామినేని ఆసుపత్రి వైద్యులు, శంకర నేత్రాలయ వైద్యులు వైద్యసేవలందిస్తారని తెలిపారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.



కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఆదర్శనీయుడు మండలి వెంకట కృష్ణారావు

● ఘనంగా మాజీ మంత్రి 99వ జయంతి

**వన్‌టౌన్, ఆగస్టు 4:** మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శమని మండలి వెంకట కృష్ణారావు సామాజిక వికాస కేంద్రం అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహరావు అన్నారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఆదివారం మండలి వెంకట కృష్ణారావు సామాజిక వికాస కేంద్రం, నేషనల్ ఫ్రూట్స్ హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వెంకటకృష్ణారావు 99వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరహరిశెట్టి పాల్గొని వెంకటకృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన సమయంలో వెంకట కృష్ణారావు చేసిన సేవా కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తించారన్నారు. పాదచారులకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ప్రముఖ న్యాయవాది కండెల వరప్రసాద్, వికాస కేంద్రం సభ్యులు పారా రాజు, గాలి గురవయ్య, కలుకూరి రాజు, కిరికిటి కొండ, టి.వెంకటేశ్వరరావు, పి.బాబు పాల్గొన్నారు.

## ముగ్గురు జూదరుల అరెస్టు

● రూ.5,890 స్వాధీనం

**హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 4:** వేలేరు అమ్మ నిలయం సమీపంలోని పామాయిల్ తోటలో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఏఎస్సై కనకరాజు సిబ్బందితో దాడిచేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,890లు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

### మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

స్థానిక తారక రామనగర్ కాలనీలో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్న గంటా విజయకల్యాణిపై దాడి చేసి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన అదే కాలనీకి చెందిన పులవర్తి వెంకటేశ్వరరావుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. శనివారం రాత్రి అకారణంగా బడ్డీకొట్టుపై దాడి చేసి అందులో ఉన్న సరుకులను వెంకటేశ్వరరావు ధ్వంసం చేసి మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### లయన్స్‌క్లబ్ ఆఫ్ కొండపల్లికి అవార్డు

**జి.కొండూరు, ఆగస్టు 4:** లయన్స్‌క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌కు చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. పాస్ట్ గవర్నర్ కె.ఎస్ శంకర్‌గుప్తా నుంచి క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథ రెడ్డి, కార్యదర్శి ఎ.సురేష్, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ బి.కృష్ణారెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బుల్లిరామయ్య చౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఐరన్‌యార్డులో నిర్మిస్తున్న గోడౌన్

## ఐరన్‌యార్డులో అనధికారిక గోడౌన్ నిర్మాణం

● కార్పొరేషన్ ఆదాయానికి రూ.లక్షల్లో గండి

● కొందరు అధికారుల పాత్రపై ఆరోపణలు

**భవానీపురం, ఆగస్టు 4:** 43 డివిజన్ పరిధి ఐరన్‌యార్డులో 256వ షాపు సమీపంలో అనధికారిక గోడౌన్ నిర్మాణం గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. గోడౌన్ నిర్మాణానికి యజమాని అధికారికంగా ఎటువంటి ప్లాన్ తీసుకోకుండా నిర్మాణం పూర్తి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్లాన్ లేకుండా హడావుడిగా షెడ్డు వేసేస్థాయి వరకు గోడౌన్ పూర్తి చేశారు. వీఎంసీకి ఫీజులు, ఇతరత్రా కింద రావాల్సిన రూ.లక్షల ఆదాయానికి గండిపడింది. ఈ వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారితో పాటు, డివిజన్లు చూసే ఓ అధికారి ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాన్ లేకుండా చేయడం వలన కార్పొరేషన్ ఆదాయానికి రూ.5లక్షల వరకు గండి పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై నూతన కమిషనర్ హెచ్ఎం ధ్యాన్‌చంద్ర దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

**నవ్య | చిత్రజ్యోతి**

## మెగా విరాళం

**కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు**





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

## క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబోతోంది, భారీ సెట్స్ విజువల్ ఎఫెక్ట్‌తో దర్శకుడు వశిష్ఠ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నార'ని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందు కొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

# విజేతలు వీరే...







దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వాఖ్యాతలుగా వ్యవహరించారు.











### తెలుగు సినిమా విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్దండి (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).

## క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

## స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మ.



## డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్క్రిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. సీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

## గొప్ప సినిమాగా నిలిచిపోతుంది



కొత్తగా...

"తంగలాన్ వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

## సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.

## సౌత్ ఫ్లోరిడా వర్సిటీలో తెలుగుగళం



**విజయవాడ-ఆంధ్రజ్యోతి:** 'ఈ ప్రపంచం గొప్ప వ్యాయామశాల. అందులోనే మనల్ని మనం బలోపేతం చేసుకోవాలి. ఎన్ని అవరోధాలు వచ్చినా అధిగమించగల శక్తిసామర్థ్యాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలి' అంటూ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడాలో ఓ తెలుగు యువగళం వివేకానందుడి స్ఫూర్తి మంత్రాన్ని వినిపించింది. ఈ విశ్వవిద్యాలయం స్టూడెంట్ గవర్నమెంట్ (ఎస్‌జీ) అధ్యక్షుడిగా ఉన్న నగరానికి చెందిన గొట్టిపాటి సూర్యకాంత్ ప్రసాద్ శనివారం సాయంత్రం విశ్వవిద్యాలయంలో జరిగిన 2024 కమెన్స్‌మెంట్ సెర్మనీలో మాట్లాడారు. అమెరికాలో పురాతన విశ్వవిద్యాలయాల్లో సౌత్ ఫ్లోరిడా వర్సిటీ ఒకటి. ఇందులో 100కుపైగా దేశాల నుంచి సుమారు 60వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. అటువంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ప్రాతినిధ్యం వహించే స్టూడెంట్ గవర్నమెంట్‌కు గొట్టిపాటి సూర్యకాంత్ ప్రసాద్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన నగరంలోని ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తనయుడు.



చెన్నుపాటి స్టేడియంలో క్రీడాకారులతో మాట్లాడుతున్న ధ్యానచంద్ర

## శరవేగంగా అన్న క్యాంటీన్ పనులు

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట, ఆగస్టు 4:** నగరంలోని అన్నక్యాంటీ పునర్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా కమిషనర్ ఆదివారం పటమట, కృష్ణలంకలోని అన్న క్యాంటీన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. అనంతరం పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ వారితో మాట్లాడారు. స్టేడియంలో ఏవైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ధ్యానచంద్ర కోరారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు వీఎంసీ ఉన్నతపాఠశాలను సందర్శించి అక్కడ గ్రీనరీ పెంచాలని, పారిశుధ్య నిర్వహణను పక్కాగా చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ధ్యానచంద్రతో పాటు జోనల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్‌రాయ్, ఈఈ సామ్రాజ్యం, అదనపు ఎంహెచ్‌వో డాక్టర్ బాబూశ్రీనివాస్ పాల్గొన్నారు.





జ్ఞాపకాలు పంచుకుంటున్న ఆంజనేయులు, గోపాలకృష్ణ శ్రీనివాసరావు, ఉమావరప్రసాద్, పాపారావు, అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

# నాటి జ్ఞాపకాలే మధురం

**హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 4:** గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతు కుటుంబాల నుంచి వచ్చి వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నా రైతుసేవలకే ప్రాధాన్యమిస్తూ దశాబ్దాలుగా టీడీపీతో పయనిస్తున్న ఆ మిత్రులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిససి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంలో మునిగిపోయారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్, కాకులపాడుకు చెందిన చలసాని ఆంజనేయులు, రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు, రంగన్నగూడెంకు చెందిన ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి, వేలేరుకు చెందిన వేములపల్లి శ్రీనివాసరావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వీరవల్లికి చెందిన గుండపనేని ఉమావరప్రసాద్, రాష్ట్ర వాణిజ్యవిభాగం నేత, మాజీ జడ్పీటీసీ, పెరికీడుకు చెందిన వేగిరెడ్డి పాపారావు తమ తమ రంగాల్లో సేవలందిస్తున్నారు. 1985 నుంచి రైతులుగా మొదలైన మైత్రి నేటి వరకూ కొనసాగుతూనే ఉంది.

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

**భారతీనగర్:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాలలో ఆదివారం జరిగింది. సభకు అల్యూమినీ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.విజయసారథి అధ్యక్షత వహించారు. 1956 నుంచి 2022 వరకు చదువుకున్న పలువురు విద్యార్థులు పాల్గొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కళాశాల అభివృద్ధికి సహాయంతో పాటు ఆగిపోయిన భవనాల నిర్మాణ పనులను తిరిగి పునఃప్రారంభించుటకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని తీర్మానించుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చారు.

అధ్యక్షుడు ఎంవీ బాబు, ఉపాధ్యక్షుడు కేవీ రమేష్, జనరల్ సెక్రటరీ ఎన్ గోపిచందు, బీ శ్రీనివాస రెడ్డి, భానుమూర్తి, మధు, నాగరాజు, కేవీ రమేష్, బీఎస్‌టీ రెడ్డి, నిమ్మగడ్డ సాయికృష్ణ, రాజరావు, సీహెచ్ మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రెండో ఇండియా స్కేట్ గేమ్స్‌కు యువ స్కేటర్ చైత్రదీపిక

పతకం ఖాయమంటున్న కోచ్, క్రీడాకారులు



**విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 4:** స్కేటింగ్‌లో వరుస విజయాలతో ఊపుమీదున్న నగరానికి చెందిన యువ స్కేటర్ పి.చైత్రదీపిక రెండో ఇండియా స్కేట్‌గేమ్స్‌లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఉమ్మడి కృష్ణా నుంచి చైత్రదీపిక, హృతిక్, తేజస్వి, సిరిని భాస్కర్‌రాయ్, తాన్విక్, దియాశ్రీ, హారిక ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పోటీలు ఈ నెల 7 నుంచి 11 వరకు కోయంబత్తూరులో జరగనున్నాయి. ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న చైత్రదీపిక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటి వరకు 39 పతకాలను కైవసం చేసుకుందని కోచ్ పి.సత్యనారాయణ, తల్లిదండ్రులు పి.సతీష్, లలితాదేవి తెలిపారు. 2023లో జాతీయస్థాయి స్కేటింగ్‌లో ఫెయిర్‌స్కేటింగ్‌లో స్వర్ణం, ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం, అదే ఏడాది చెన్నైలో జరిగిన 61వ జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఫెయిర్ (చైత్రదీపిక, కైవల్య) జోడీ బంగారు పతకం, కపుల్ డ్యాన్స్‌లో కాంస్యం సాధించినట్టు తెలిపారు. స్కేటింగ్‌లో సత్తా చాటుతున్న చైత్రదీపికను అప్పటి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య అభినందించారు.

## రక్తనాళాల వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

● ఎమ్మెల్యేలు గద్దె, బొండా

**లబ్బీపేట, ఆగస్టు 4:** రక్తనాళాల వ్యాధుల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని, వ్యాధుల భారీన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నేషనల్ వాస్క్యులర్ డే ను పురస్కరించుకుని వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రజా వైద్యశాల వాస్క్యులర్ సర్జన్లు డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీ వాక్‌థాన్ నిర్వహించారు.

ఐజీఎంసీ స్టేడియం నుంచి ఈ వాక్‌థాన్‌ను ఎమ్మెల్యేలు గద్దె రామ్మోన్, బొండా ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈవో లక్ష్మీ షా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక భయంకరమైన వ్యాధి నుంచి ప్రజలను కాపాడడానికి, వారిలో అవగాహన కల్పించి స్ఫూర్తిని నింపేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్లు కారణ్, శివకృష్ణ, రత్న శ్రీలు మాట్లాడుతూ ఒకసారి ఈ వ్యాధి వస్తే నివారించడం సాధ్యంకాదని ముందునుండి రాకుండా చూసుకోవాలన్నారు.




వాక్‌థాన్‌లో పాల్గొన్న గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు

## వృద్ధ దంపతులకు దీవెన సాయం

**విజయవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** వృద్ధాప్యంలో మంచంపై ఉంటూ కుటుంబం గడవడానికి ఇబ్బంది పడుతున్న దంపతులకు దీవెన ఫౌండేషన్ సాయం చేసింది. రాణిగారితోటకు చెందిన సూరిబాబు పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయన సతీమణి వృద్ధాప్యంలో ఉంది. ప్రస్తుతం ఇద్దరూ మంచంపై ఉన్నారు. విషయం తెలుసుకున్న దీవెన ఫౌండేషన్ సిటీ పోలీసు తరఫున కానిస్టేబుళ్లు గోపీ, రాజేష్, శరత్‌కుమార్, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మి, వసంత వారికి నెల రోజులకు సరిపడ సరుకులను అందజేశారు.



వృద్ధ దంపతులకు సాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు



గోల్డ్ మెడల్స్‌ను అందుకుంటున్న సంగీత

## లా విద్యార్థినికి రెండు బంగారు పతకాలు

**భవానీపురం, ఆగస్టు 4:** నగరంలోని గవర్నర్‌పేటకు చెందిన లా విద్యార్థిని కంభంపాటి సంగీత చక్రపాణి హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మకమైన ఐసీఎఫ్ఎఐ బిజినెస్ స్కూల్ (ఇనిస్టిట్యూట్ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్స్ ఆఫ్ ఇండియా) నుంచి రెండు బంగారు పతకాలను సాధించింది. శనివారం బిజినెస్ స్కూల్ స్నాతకోత్సవం సందర్భంగా బీబీఏ, ఎల్ఎల్‌బీ విద్యార్థిని అయిన సంగీత కమర్షియల్ లా సబ్జెక్టులో 4 క్లినికల్ పేపర్స్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు రెండు బంగారు పతకాలతో సత్కరించారు. ఆల్‌రౌండర్‌గా కూడా బెస్ట్ స్టూడెంట్ అవార్డుతో పాటు రూ.30వేలు నగదు బహుమతి ఆమె అందుకున్నారు. సాంకేతిక చట్టంపై మే 2024లో జరిగిన జాతీయ స్థాయి లీగల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎన్ఎల్‌టీఎస్ఈ)లో టాప్-10లో ఒకరిగా నిలిచింది. సంగీత తల్లి నగరంలో డెంటల్ డాక్టర్, తండ్రి నేత్ర వైద్య నిపుణుడు.




ట్రోఫీ, కాంస్య పతకాలతో ఏపీ త్రోబాల్ జట్టు

## సౌత్‌జోన్ త్రోబాల్‌లో రాష్ట్రానికి కాంస్యం

**విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 4:** కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరుగుతున్న సౌత్‌జోన్ 16వ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర పురుషుల జట్టు కాంస్యంతో సత్తా చాటింది. ఏడు రాష్ట్రాల జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఆరు మ్యాచ్‌లు ఆడిన ఏపీ మూడు మ్యాచ్‌లను గెలిచి, ఓ మ్యాచ్ టై, రెండింటిల్లో ఓటమి చవిచూసి మూడోస్థానంలో నిలిచి ట్రోఫీ, కాంస్య పతాకాన్ని వశం చేసుకున్నారు. టీమ్ వెంట త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈదా సులోచన, సెక్రటరీ ఎండీ గౌస్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెల్లి ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు సురేంద్ర

## రెల్లి, ఉపకులాలలకు 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

● రెల్లి ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు సురేంద్ర

**చిట్టినగర్, ఆగస్టు 4:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో భాగంగా రెల్లి, ఉపకులాలకు 3 శాతం జనరల్ రిజర్వేషన్ అమలు చేయాలని రెల్లి ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు బండి ఆది సురేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం టైలర్‌పేటలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1999 నుంచి 2004 వరకు ఉన్న ఎస్సీ వర్గీకరణలో రెల్లి, సంబంధిత 12 ఉపకులాలకు ఏ గ్రూపులో కేటాయించిన ఒక శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అదీ మహిళలకని, వారు లేనందున బీ గ్రూప్‌కు చెందేలా రో స్టర్ విధానంలో వర్గీకరణ చేశారన్నారు. దీంతో తాము నష్టపోయారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20లక్షల మంది రెల్లి కులస్థులున్నారన్నారు. రాష్ట్ర నేతలు మీసాల ఏడు కొండలు, నిమ్మకాయల రమణమూర్తి, వడ్డాది శ్రీనివాసరావు, ధనాల శ్రీనివాసరావు, ముత్యాల మారుతీ, పీ. శివ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

# శభాష్.. శ్రీజేష్

## షూటౌట్‌లో అడ్డుగోడలా గోల్ కీపర్ ● క్వార్టర్స్‌లో గ్రేట్ బ్రిటన్‌పై విజయం

హాకీ సెమీస్‌కు భారత్





పారిస్: ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు వరుసగా రెండోసారి సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆదివారం గ్రేట్ బ్రిటన్‌తో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్స్ షూటౌట్‌కు దారి తీయగా 4-2తో హర్మన్‌ప్రీత్ సేన విజయం సాధించింది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. మంగళవారం జరిగే సెమీఫైనల్లో అర్జెంటీనాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. కాగా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్లోనూ భారత జట్టు 3-1తో బ్రిటన్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. ఇప్పుడు మరోసారి అదే జట్టుపై గెలవడం విశేషం. కాగా ఈ మ్యాచ్‌లో ఆఖరి 40 నిమిషాల పాటు భారత జట్టు కేవలం 10 మందితోనే ఆడినా ప్రత్యర్థిని మరో గోల్ చేయనీ యకుండా అడ్డుకోగలిగింది. ఇందుకు జట్టు గోల్‌కీపర్ శ్రీజేష్ చూపిన అసాధారణ ఆటతీరే కారణం. మ్యాచ్‌లోనూ, షూటౌట్‌లోనూ అతడు బ్రిటన్‌కు అడ్డుగోడలా నిలిచి శభాష్ అనిపించుకున్నాడు. కెరీర్‌లో చివరి ఒలింపిక్స్ ఆడుతున్న అతను బ్రిటన్ నుంచి ఎదురైన 11 షాట్లను సమర్థవంతంగా అడ్డుకోకపోయుంటే ఈమ్యాచ్‌లో భారత్ ఓడేదేమో. రెండో క్వార్టర్‌లో డిఫెండర్ అమిత్ రోహి దాస్ హాకీ స్టిక్‌తో ప్రత్యర్థి ముఖంపై కొట్టాడనే కారణంతో రెడ్ కార్డుకు గురై మైదానం వీడాడు. అయినా కాసేపటికే హర్మన్ (22వ నిమిషం) గోల్ చేయడంతో జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ మరో ఐదు నిమిషాలకే బ్రిటన్ ఆటగాడు మోర్టాన్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత ఇరుజట్ల నుంచి గోల్ నమోదు కాలేదు. దీంతో షూటౌట్ తప్పలేదు. ఇందులో భారత్ నుంచి హర్మన్, సుఖ్‌జీత్, లలిత్, రాజ్ కుమార్ వరుసగా గోల్స్ చేయగా.. బ్రిటన్‌కు కీపర్ శ్రీజేష్ అడ్డుగా నిలవడంతో రెండు గోల్స్ మాత్రమే చేసి ఓడింది. ఇక, ఈ మ్యాచ్ లో శ్రీజేష్ ఆటతీరు నెట్టింట ప్రశంసలు అందుకుంటోంది. నీవే రియల్ హీరో అంటూ కొనియాడుతున్నారు.

పారిస్
ఒలింపిక్స్‌లో తొమ్మిదోరోజు హాకీ వీరులు మినహా బరిలోకి దిగిన మిగతా క్రీడాకారులంతా నిరాశపరిచారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఫైనల్ చేరతాడనుకున్న లక్ష్యసేన్ సెమీఫైనల్లో టాప్‌సీడ్ విక్టర్ అక్సెల్‌సెన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇక అతని ఆశలన్నీ సోమవారం జరిగే కాంస్య పతకపోరుపైనే. లవ్లీనా క్వార్టర్స్‌ను దాటకపోవడంతో బాక్సింగ్‌లో మన పరాజయం పరిపూర్ణమవగా.. షూటింగ్‌లో మరిన్ని పతకాలపై ఆశలు రేపిన మహేశ్వరి, విజయ్‌వీర్, అనీష్ తమ విభాగాల్లో ఫైనల్స్ చేరడంలో విఫలమయ్యారు.

## ఇక.. కాంస్యమే లక్ష్యం

### లి జి జియాతో కంచు పతక పోరు నేడు

సెమీస్‌లో అక్సెల్‌సెన్ చేతిలో సేన్ ఓటమి


లక్ష్యసేన్

సా. 6 గం. నుంచి


అక్సెల్‌సెన్

పారిస్: బ్యాడ్మింటన్‌లో చారిత్రక స్వర్ణం ఆశలు ఆవిరయ్యాయి. అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన ఏస్ షట్లర్ లక్ష్యసేన్ పసిడి పోరుకు చేరుకోలేక పోయాడు. ఆదివారం జరిగిన పురుషుల సెమీస్‌లో లక్ష్యసేన్ 20-22, 14-21తో డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెం.2 విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యాడు. దీంతో అతను కాంస్యం కోసం పోటీపడనున్నాడు. 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో గేమ్ పాయింట్ వద్ద తొందరపాటుతో తొలి గేమ్‌ను చేజార్చుకొన్న సేన్.. రెండో గేమ్‌లో 7-0తో ఆధిక్యంలో నిలిచినా దాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేక పోయాడు. మరోవైపు ఎంతో అనుభవం ఉన్న రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అక్సెల్‌సెన్.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఒక దశలో తన మార్క్ క్రాస్ కోర్ట్ షాట్లతో అక్సెల్‌సెన్‌ను నియంత్రించిన లక్ష్య.. ఆ తర్వాత ప్రత్యర్థి అటాకింగ్ గేమ్‌తో డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. మొదటి గేమ్ ఆరంభంలో లక్ష్య 2-5తో వెనుకబడ్డాడు. కానీ, క్రమంగా పుంజుకొని క్రాస్ కోర్ట్ షాట్లతో అక్సెల్‌సెన్‌కు షాకిస్తూ 8-7తో పైచేయి సాధించాడు. వడివడిగా పాయింట్లు సాధిస్తూ 20-17తో గేమ్ పాయింట్‌పై నిలిచాడు. అయితే, వేగంగా గేమ్‌ను పూర్తి చేసి ఆధిక్యం సాధించాలన్న ఒత్తిడి అనవసర తప్పిదాలకు దారితీసింది. 20-20తో స్కోరు సమం చేసిన విక్టర్.. అదే జోరులో తొలి గేమ్‌ను కూడా తన ఖాతాలో వేసుకొన్నాడు. ఇక, రెండో గేమ్‌లో సేన్ తప్పిదాలను సవరించుకుంటూ 7-0తో దూసుకెళ్లాడు. కానీ, డెన్మార్క్ షట్లర్ కౌంటర్‌ఎటాక్ చేయడంతో లక్ష్య ఆట గతితప్పింది. పవర్‌ఫుల్ స్మాష్‌తో 7-8తో నిలిచిన విక్టర్.. క్రమంగా పాయింట్లు సాధిస్తూ 10-7తో పైచేయి సాధించాడు. బ్రేక్ తర్వాత తిరిగి వచ్చిన లక్ష్య ప్లాన్ మార్చినా.. అప్రమత్తంగా వ్యవహరించిన అక్సెల్‌సెన్ 15-12తో ముందంజ వేశాడు. క్రమంగా మ్యాచ్ ప్రత్యర్థి చేతుల్లోకి వెళ్లడంతో సేన్ ఏమీ చేయలేకపోయాడు. మరో సెమీస్‌లో కున్లావత్ విటిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) 21-14, 21-15తో లీ జి జియా (మలేసియా)పై నెగ్గాడు.

సెమీస్‌లో ఓడినా.. మెగా ఈవెంట్‌లో పతకం సాధించే చాన్స్ లక్ష్యసేన్‌కు ఇంకా ఉంది. సోమవారం జరిగే కాంస్య పోరులో మలేసియా షట్లర్ లి జి జియాతో సేన్ తలపడనున్నాడు. ఇందులో నెగ్గితే ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారత పురుష షట్లర్‌గా లక్ష్య రికార్డులకెక్కుతాడు. మహిళల్లో సింధు రజత, కాంస్యాలు నెగ్గగా.. లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కంచు పతకం సాధించింది.

### క్వార్టర్స్‌లో ఓడిన లవ్లీనా

ఒలింపిక్స్‌లో మన బాక్సర్ల కథ ముగిసింది. ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగినా.. కనీసం ఒక్క పతకం కూడా సాధించలేక పోయారు. టోక్యో క్రీడల కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ సైతం చేతులెత్తేసింది. మహిళల 75 కిలోల క్వార్టర్స్ బౌట్‌లో లవ్లీనా 1-4తో టాప్ సీడ్ లిన్ క్వియాన్ (చైనా) చేతిలో చిత్తయింది. పోటీలకు ముందు నిఖత్ జరీన్, లవ్లీనా పతకం నెగ్గగలరనే అంచనాలు భారీగానే నెలకొన్నాయి. కానీ, వీటిని అందుకోవడంలో వీరిద్దరూ విఫలమయ్యారు.

### జొకో సాధించాడు


సెర్బియా దిగ్గజానికి సింగిల్స్ స్వర్ణం
ఫైనల్లో అల్కారజ్ చిత్తు

రెండు దశాబ్దాల ప్రొఫెషనల్ కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్‌లు..లెక్కలేనన్ని టూర్ టైటిళ్లు.. కానీ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఒలింపిక్ స్వర్ణ పతకం అందని ద్రాక్షగానే మిగిలింది. పైగా వయసు 37. వెంటాడుతున్న గాయం బెడద. జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్‌ల్లో ఒక్కటీ దక్కని బాధ. మరోవైపు స్పెయిన్ కుర్రాడు అల్కారజ్ రూపంలో పొంచివున్న ప్రమాదం. ఇన్ని ప్రతికూలతల నడుమ జొకో అనుకున్నది సాధించాడు. ఒలింపిక్స్ స్వర్ణంతో తన కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్నాడు. అలాగే అరుదైన గోల్డెన్ స్లామ్ (4 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతోపాటు ఒలింపిక్స్ సింగిల్స్ స్వర్ణం) కూడా అందుకున్నాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన సింగిల్స్ తుది పోరులో జొకో 7-6 (3), 7-6 (2)తో అల్కారజ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో నొవాక్ కాంస్యం సాధించాడు. తర్వాతి మూడు విశ్వక్రీడల్లో తీవ్రంగా ప్రయత్నించినా స్వర్ణం అందుకోలేకపోయాడు. ఎట్టకేలకు కెరీర్ చరమాంకంలో పసిడి పతకంతో తన కలను జొకో నెరవేర్చుకున్నాడు.

### షూటింగ్‌లో నిరాశ

25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో విజయ్‌వీర్ సిద్ధూ, అనీష్ భన్వాలా ఫైనల్‌కు చేరుకోవడంతో విఫలమయ్యారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో విజయ్‌వీర్ 9వ స్థానంలో, భన్వాలా 13వ స్థానంలో నిలిచి పతక పోరుకు అర్హత సాధించలేక పోయారు. మహిళల స్కీట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో మహేశ్వరి చౌహాన్, రైజా థిల్లాన్ 14వ, 23వ స్థానాల్లో నిలిచారు. టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్స్‌కు అర్హులు.

### ఫైనల్‌కు దూరమైన జస్విన్, పారుల్

లాంగ్‌జంప్‌లో జస్విన్ ఆల్డ్రిన్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-బిలో జస్విన్ 7.61 మీటర్లు మాత్రమే దూకి 13వ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా 26వ స్థానంతో పతక రౌండ్‌కు అర్హత సాధించలేకపోయాడు. మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో పారుల్ చౌదరి కూడా ఫైనల్ చేరుకోలేక పోయింది. రౌండ్-1 హీట్స్‌లో పారుల్ 9 నిమిషాల 23.39 సెకన్ల టైమింగ్‌తో 8వ స్థానంలో నిలిచింది. హీట్స్‌లో టాప్-5 అథ్లెట్లు మాత్రమే పతక రౌండ్‌కు క్వాలిఫై అవుతారు.

### 18వ స్థానంలో విష్ణు

సెయిలింగ్ పురుషుల డింగీలో విష్ణు శరవణన్ 18వ స్థానానికి ఎగబాకాడు. ఏడో రేస్‌లో ఏడో స్థానంతో మెరుగైన ప్రదర్శన చేసిన విష్ణు.. ఎనిమిదో రేస్‌లో మాత్రం 24వ స్థానంలో నిలిచాడు. దీంతో ఓవరాల్‌గా 18వ స్థానానికి చేరాడు. మహిళల డింగీలో నేత్ర కుమనన్ ఓవరాల్‌గా 25వ స్థానంలో ఉంది. రేస్-7లో 21వ స్థానంలో, రేస్-8లో 31వ స్థానం లో నిలిచింది.

### పతకాల పట్టిక



| దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| చైనా | 19 | 15 | 11 | 45 |
| అమెరికా | 18 | 26 | 25 | 69 |
| ఫ్రాన్స్ | 12 | 14 | 18 | 44 |
| ఆస్ట్రేలియా | 12 | 10 | 7 | 29 |
| బ్రిటన్ | 10 | 12 | 15 | 37 |
| కొరియా | 10 | 7 | 7 | 24 |
| జపాన్ | 8 | 5 | 10 | 23 |
| ఇటలీ | 7 | 9 | 5 | 21 |
| నెదర్లాండ్స్ | 6 | 5 | 4 | 15 |
| జర్మనీ | 5 | 5 | 2 | 12 |
| భారత్ | 0 | 0 | 3 | 3 |

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

## స్ప్రింట్ కింగ్.. లైల్స్




నొవాకే 100 మీ స్ప్రింట్ టైటిల్
కిషానెకు రజతం
ఫ్రెడ్‌కు కాంస్యం

పారిస్: పదుల సంఖ్యలో క్రీడా విభాగాలు..వందల సంఖ్యలో ఈవెంట్లు..వేలాది మంది అథ్లెట్లు..ఇంతమంది బరిలో ఉన్నా ఒలింపిక్స్‌లో అత్యంత మజా పంచే ఈవెంట్ ఒకటే ఒకటి. అదే పురుషుల 100 మీ. స్ప్రింట్ ఫైనల్. అందుకే ఏ ఒలింపిక్స్‌లోనైనా ఈ పోటీ జరిగితే కిక్కిరిసే స్టేడియంలోని వారితోపాటు టీవీల్లో వీక్షించే కోట్లాది మందికి..బరిలో నిలిచే అథ్లెట్లకంటే మించిన ఉత్సాహం, ఉద్వేగం, ఉత్కంఠ. అలా ఉంటుంది ఈ రేస్ తీరు. ఇక..ఆదివారం అర్ధరాత్రి జరిగిన పారిస్ విశ్వక్రీడల పురుషుల 100 మీ. ఫైనల్‌కూడా అత్యంత హోరాహోరీగా సాగింది. అయితే ఎనిమిది మంది తలపడిన ఈ రేస్‌లో హాట్ ఫేవరెట్, వరల్డ్ చాంపియన్, అమెరికా స్టార్ నొవా లైల్స్ (9.79సె.) పర్సనల్ బెస్ట్ టైమింగ్‌తో స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. జమైకా అథ్లెట్ కిషానె థాంప్సన్ కూడా 9.79 సె. సమయంతో గమ్యం చేరాడు. కానీ ఫొటోఫినిష్‌లో లైల్స్ విజేతగా ఆవిర్భవించాడు. దాంతో థాంప్సన్ రజత పతకంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. టోక్యో గేమ్స్‌లో రజత పతకం సాధించిన అమెరికాకే చెందిన ఫ్రెడ్ కెర్లీ (9.81సె.) కాంస్య కైవసం చేసుకున్నాడు.

## జులియన్.. '200' కూడా కొట్టేనా!


సెమీస్ చేరిన స్టార్ స్ప్రింటర్

సెయింట్ డెనిస్ (ఫ్రాన్స్): మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో చాంపియన్‌గా నిలిచిన జులియన్ ఆల్‌ఫ్రెడ్.. 200 మీటర్ల రేసులోనూ పతకం కొల్లగొట్టేందుకు సిద్ధమైంది. ఈ సెయింట్ లూసియా స్టార్ 200 మీటర్ల హీట్స్‌లో సత్తాచాటింది. ఆదివారం జరిగిన ఆరంభ రౌండ్‌లో హీట్-1 నుంచి పరిగెత్తిన జులియన్.. 22.41 సెకన్లలో గమ్యాన్ని చేరి తన హీట్‌లో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఆమె సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. సెమీఫైనల్స్ సోమవారం అర్ధరాత్రి, ఫైనల్స్ మంగళవారం జరగనున్నాయి. మొత్తం ఆరు హీట్స్ నుంచి తొలి మూడు స్థానాల చొప్పున నిలిచిన అథ్లెట్లు సెమీస్ చేరతారు. 23 ఏళ్ల జులియన్ శనివారం అర్ధరాత్రి జరిగిన 100 మీటర్ల రేసును 10.72 సెకన్లలో ముగించి కొత్త ఒలింపిక్ చాంపియన్‌గా అవతరించింది. ఆమె దేశాని (సెయింట్ లూసియా)కిదే తొలి ఒలింపిక్ స్వర్ణం. ఇక, ఫేవరెట్ అనుకున్న అమెరికా స్టార్ షకారి రిచర్డ్‌సన్ 10.87 సెకన్లతో రెండోస్థానంలో నిలిచి రజతానికి పరిమితమవగా.. అమెరికాకే చెందిన మెలిసా జెఫర్సన్ (10.92 సె) మూడోస్థానంతో కాంస్యం అందుకుంది.

**డిఫెండింగ్ చాంప్ షెరికా అవుట్**

వరల్డ్ చాంపియన్ షెరికా జాక్సన్ 200 మీటర్ల రేసు నుంచి వైదొలగింది. కారణమేంటన్నది వెల్లడించని ఆమె ఆదివారం జరిగిన హీట్స్ నుంచి అనూహ్యంగా తప్పుకొంది. 30 ఏళ్ల జాక్సన్ 100 మీటర్ల రేసులోనూ పోటీపడలేదు.

## పారిస్‌లో నేటి భారతం



**షూటింగ్: స్కీట్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్:** మహేశ్వరీ చౌహాన్, అనంత్‌జీత్ సింగ్ (మ. 12.30)
**టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ప్రీక్వార్టర్స్:** భారత్ X రొమేనియా (మ. 1.30)
**సెయిలింగ్: మహిళల డింగీ రేస్ 9, 10:** నేత్ర కుమనన్ (మ. 3.45); **పురుషుల డింగీ రేసు 9, 10:** విష్ణు శరవణన్ (సా. 6.10)
**అథ్లెటిక్స్: మహిళల 400 మీటర్ల రౌండ్ 1:** కిరణ్ పాహల్ (మ. 3.57); **పురుషుల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ రౌండ్ 1:** అవినాష్ సబ్లే (రా. 10.50)
**బ్యాడ్మింటన్: సింగిల్స్ కాంస్య పతక పోరు:** లక్ష్యసేన్ X జి జియా లీ (మలేసియా) (సా. 6.00)

### వివాదాస్పద బాక్సర్‌కు పతకం ఖరారు



పారిస్: శరీరంలో పురుష లక్షణాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అల్జీరియా, తైవాన్ బాక్సర్లు ఇమేని ఖెలిఫ్, లిన్ యు టింగ్ దూసుకెళుతున్నారు. ఇప్పటికే ఇమేని పతకం ఖాయం చేసుకోగా.. ఆదివారం జరిగిన మహిళల 57 కేజీల విభాగం క్వార్టర్స్‌లో లిన్ 5-0తో స్వెట్లానా కమెనోవా (బల్గేరియా)ను ఓడించి సెమీస్‌కు వెళ్లింది. దీంతో తను కూడా కెరీర్‌లో తొలి ఒలింపిక్ మెడల్ అందుకునేందుకు సిద్ధమైంది. సెమీస్‌లో ఓడినా ఆమెకు కాంస్యం దక్కుతుంది. టెస్టోస్టెరోన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉందనే కారణంతో గతేడాది ప్రపంచ మహిళా చాంపియన్‌షిప్ నుంచి ఇమేని, లిన్ యులపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే పారిస్ గేమ్స్‌లో ఆడుతుండడంపై వీరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వారెవా.. వాండర్సే

### ఆరు వికెట్లతో చెలరేగిన లంక స్పిన్నర్ ● రెండో వన్డేలో భారత్ ఓటమి


వాండర్సే

2
భారత్‌తో జరిగిన వన్డేల్లో 5 వికెట్లు తీసిన రెండో లెగ్ స్పిన్నర్‌గా వాండర్సే. గతంలో ముస్తాక్ అహ్మద్ (5/36 -1996లో) తీశాడు.

కొలంబో: ఎట్టకేలకు భారత జట్టుపై శ్రీలంక పైచేయి సాధించింది. టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురై.. తొలి వన్డేను టై చేసుకున్న ఆతిథ్య జట్టు రెండో మ్యాచ్‌లో మాత్రం ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్ అనిపించుకుంది. ముందుగా బ్యాటర్లు సమష్టిగా రాణించగా.. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే (6/28) గూగ్లీ బంతులకు భారత స్టార్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. కెప్టెన్ అసలంక (3/20) మిగతా ఆటగాళ్ల పనిపట్టడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. తద్వారా సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఆఖరి వన్డే బుధవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సిరాజ్ వికెట్ తీసినా.. ఆరంభంలో ఓపెనర్ ఫెర్నాండో (40), కుశాల్ (30)లతో పాటు చివర్లో కమిందు (40), వెల్లలగె (39) ఆటతో సవాల్ విసిరే స్కోరందుకుంది. సుందర్‌కు మూడు, కుల్దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 42.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు రోహిత్ (64), గిల్ (35) తొలి వికెట్‌కు 97 పరుగులు జోడించినా.. ఆ తర్వాత అక్షర్ (44) మినహా అంతా విఫలమయ్యారు. వాండర్సే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు:
శ్రీలంక: 50 ఓవర్లలో 240/9 (కమిందు మెండిస్ 40, ఫెర్నాండో 40, వెల్లలగె 39, కుశాల్ 30; సుందర్ 3/30, కుల్దీప్ 2/33); భారత్: 42.2 ఓవర్లలో 208 ఆలౌట్. (రోహిత్ 64, గిల్ 35, అక్షర్ 44; వాండర్సే 6/33, అసలంక 3/20).

### నీరజ్ గోల్డ్‌కొడితే.. బంపర్ ఆఫర్

న్యూఢిల్లీ: శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పనిచేసే ఆన్‌లైన్ వీసా అప్లికేషన్ ప్లాట్‌ఫామ్ సంస్థ అట్లిస్ సీఈవో మోహన్ నహతా బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఈనెల 8న జరిగే జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా స్వర్ణం సాధిస్తే అట్లిస్ వినియోగదారులకు ఫ్రీ వీసా అందజేస్తామని ప్రకటించారు. ఆ ఒక్కరోజే ఈ ఆఫర్ ద్వారా అన్ని దేశాల వీసాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకోసం మోహన్ నహతా ఖాతాలో వినియోగదారులు తమ ఈమెయిల్ ఐడీ తెలియజేయాలి.

### నెమోర్‌కు రికార్డు స్వర్ణం



అల్జీరియాకు చెందిన కేలియా నెమోర్ రికార్డు సృష్టించింది. 17 ఏళ్ల నెమోర్ జిమ్నాస్టిక్స్ మహిళల అన్‌ఈవెన్ బార్స్‌లో పసిడి సొంతం చేసుకుంది. తద్వారా జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచిన తొలి ఆఫ్రికన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో కళ్లు చెదిరే ప్రదర్శన చేసిన కేలియా..17.700 పాయింట్లతో టైటిల్ దక్కించుకుంది. అంతేకాదు..పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియాకు మొదటి పతకం అందించింది. చైనాకు చెందిన ప్రపంచ చాంపియన్ క్వియు రజతం, సునిసా లీ(అమెరికా) కాంస్యం నెగ్గారు.

### నా గెలుపును లాక్కున్నారు..

బాక్సర్ నిషాంత్ ఆవేదన

అత్యుత్తమంగా రాణించినా, భారత బాక్సర్ నిషాంత్ దేవ్‌కు ఒలింపిక్స్‌లో నిరాశ ఎదురైంది. శనివారం రాత్రి జరిగిన 71 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో మెక్సికో బాక్సర్ మార్కో వెర్డె చేతిలో 1-4తో నిషాంత్ ఓటమి పాలయ్యాడు. అయితే, ఈ బౌట్‌లో నిషాంత్ అత్యుత్తమ ప్రతిభ చూపినా.. జడ్జీలు సరైన స్కోరింగ్ ఇవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిషాంత్ తొలిరౌండ్లో పూర్తి ఆధిక్యం చూపాడు. మిగతా రెండు రౌండ్లలోనూ ఆధిపత్యం ప్రదర్శించినా, ప్రత్యర్థిని విజేతగా ప్రకటించడం వివాదాస్పదమవుతోంది.

# విలయ సీమలో వారధిగా..!

**రాత్రికిరాత్రి ముంచుకొచ్చిన విలయం... కేరళలోని వయనాడ్ ప్రాంతాన్ని మృత్యుభూమిగా మార్చేసింది. ఊళ్లకు ఊళ్లు నేలమట్టమై, వందలమంది ప్రాణాలు కోల్పోయిన పెను విపత్తు నేపథ్యంలో... అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నా... దృఢ సంకల్పంతో తన జట్టును నడిపించారు మేజర్ సీతా అశోక్ షెల్కే. కేవలం 31 గంటల్లో 190 అడుగుల వంతెన నిర్మించి సహాయక చర్యలు వేగవంతం చేశారు.**



కనికరంలేని కఠోర వాతావరణం, పెరుగుతున్న నీటిమట్టాలు, ఎటుచూసినా శిథిలాలు... అడుగుతీసి అడుగు వేసే అవకాశం లేని నేల... ఇలాంటి పరిస్థితుల్లోనూ మేజర్ సీతా అశోక్ షెల్కే ధైర్యం సడలిపోలేదు. తన 140 మంది సభ్యుల బృందాన్ని పరుగులు పెట్టించారు. రికార్డు స్థాయిలో 31 గంటల్లోనే... ఇరువంజిప్పుజా నది మీద చురాల్‌మల నుంచి ముండక్కై మధ్య 190 అడుగుల వంతెన నిర్మాణం పూర్తి చేయించారు. తద్వారా ముండక్కైలో సహాయక చర్యలు చేపట్టడానికి, బాధితుల కుటుంబాలకు నీరు, ఆహారాన్ని వాహనాల్లో తరలించడానికీ వీలు కలిగింది. దీనికి దోహదం చేసిన సీత సారథ్యంలోని... భారత సైన్యానికి చెందిన, 'మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్ (ఎంఇజి)'ను అభినందనలు ముంచెత్తుతున్నాయి. 'మద్రాస్ సప్పర్స్'గా ప్రసిద్ధమైన ఈ ఇంజనీరింగ్ యూనిట్ ప్రధాన విధులు... సైన్యం ప్రవేశించడానికి మార్గాలను సుగమం చేయడం, వంతెనలు నిర్మించడం, యుద్ధ క్షేత్రాల్లో మందుపాతరలను తొలగించడం. బెంగళూర్ కేంద్రంగా పని చేస్తున్న ఈ యూనిట్‌లో సీత ఏకైక మహిళ మాత్రమే కాదు, ఆ బృందానికి నాయకురాలు కూడా. "అడుగడుగునా ప్రమాదాలు, సాహసాలతో నిండిన ఈ వృత్తిలోకి ఎంతో ఇష్టపడే వచ్చాను" అంటారామె.

### ఐపీఎస్ కావాలనుకొని...

సీత స్వస్థలం మహారాష్ట్రలోని గాలిల్గావ్ గ్రామం. ఆమె తండ్రి అశోక్ భికాజీ న్యాయవాది. "ఐపీఎస్ కావాలనేది నా చిన్ననాటి కల. కానీ సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో అది నెరవేరలేదు. అహ్మద్‌నగర్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఈలోగా సైన్యంలో చేరాలనే కోరిక బలపడింది. ఆ ఆలోచనకు నా కుటుంబం కూడా మద్దతునిచ్చింది. సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బి) పరీక్షలో రెండు సార్లు ఫెయిలయ్యాను. మూడోసారి సాధించి, 2012లో ఆర్మీలో చేరాను" అని గుర్తు చేసుకున్నారు సీత. చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటిఏ)'లో శిక్షణ పొందాక... ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అంచెలంచెలుగా ఎదిగి... యూనిట్‌కు సారథ్యం వహించే స్థాయికి చేరుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులప్పుడు, ముఖ్యంగా 2018లో కేరళను వరదలు ముంచెత్తినప్పుడు సహాయక చర్యల్లో ఈ యూనిట్ చాలా చురుగ్గా పాల్గొంది. తాజాగా వయనాడ్‌లోని ముండక్కై, చురాల్‌మల ప్రాంతాల్లో సైన్యంతో కలిసి ఈ ఇంజనీర్ల బృందం సాహసోపేతంగా పని చేస్తోంది. "వాతావరణ పరిస్థితులవల్ల వంతెన నిర్మాణానికి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అవసరమైన భాగాలన్నీ టీనీ బెంగళూరు నుంచి తీసుకువచ్చాం. రాత్రీ పగలూ కష్టపడి పని చెయ్యడం వల్ల... త్వరగా దాన్ని పూర్తి చెయ్యగలిగాం. 24 టన్నుల బరువు తట్టుకొనే సామర్థ్యం ఈ వంతెనకు ఉంది. రెండో దశ సహాయ, పునరావాస కార్యక్రమాలను సైన్యం చేపట్టడానికి దీనివల్ల వీలు కలిగింది. వాహనాలు కూడా దాని మీద ప్రయాణించవచ్చు. శాశ్వతమైన వంతెన నిర్మించేవరకూ దీన్ని ఉపయోగించుకోవచ్చు" అన్నారు సీత.

### ఆ గుర్తింపును కోరుకోను...

ఈ వంతెన అందుబాటులోకి రావడంతో... ఎందరో ప్రజలను కాపాడడానికీ, మృతదేహాలను త్వరగా వెలికి తియ్యడానికీ వీలు కలుగుతోంది. "ఇప్పుడేకాదు, విపత్తులబారిన పడిన ప్రాంతాల్లో నిద్రాహారాలను పట్టించుకోకుండా ఆమె పని చేసిన సందర్భాలు అనేకం. ఆమె అంకితభావం, నైపుణ్యం, ప్రతికూలతల మధ్య తన బృందాన్ని నడిపించే సామర్థ్యం ఎన్నోసార్లు రుజువయ్యాయి" అంటూ సైనిక ఉన్నతాధికారులు ఆమెను ప్రశంసించారు. ఇక సోషల్ మీడియా సైతం ఆమెను ప్రశంసలతో ముంచెత్తుతోంది. తనపైనా, తన బృందంపైనా కురుస్తున్న అభినందనల వర్షంపై సీత స్పందిస్తూ "ఇది కేవలం సైన్యం సాధించిన విజయం మాత్రమే కాదు. స్థానిక, రాష్ట్ర అధికారులతో సహా ఎందరో మాకు అనేక దశల్లో సహకారం అందించారు. ఎంతో కష్టంలో ఉన్నప్పటికీ స్థానిక ప్రజలు కనబరిచిన ధైర్యానికీ, సహాయశీలతకు ధన్యవాదాలు" అన్నారు. తనను సాహసోపేతమైన మహిళగా అభివర్ణించడాన్ని ఆమె అంగీకరించరు. "నేను కేవలం మహిళగా గుర్తింపును కోరుకోను. నేను సైనికురాలిని. ఈ బృందంలో భాగంగా ఉన్నందుకు నేనెంతో గర్వపడుతున్నాను" అంటారు మేజర్ సీత.

## హాట్ హిట్స్



**ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...**

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
4. చలేయా (జవాన్)
5. ఓ మాహీ (డంకీ)
6. తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
7. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
8. తుమ్ సే (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
9. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
10. నైనా (క్రూ)

**ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)**








# ఆట ఒక్కటే కాదు మనోబలమూ కావాలి

**ఒలింపిక్స్ లాంటి మెగా పోటీల్లో గెలుపు... ఓటముల మధ్య తేడా సన్నని రేఖ మాత్రమే. అక్కడ ఎవరూ ఎక్కువ కాదు... ఎవరూ తక్కువా కాదు. నైపుణ్యంలో దాదాపు అందరూ సమానమే. కానీ బరిలో నిలిచి... అంచనాలను అందుకొనేది... ఒత్తిడిలో చిత్తవకుండా మానసికంగా దృఢంగా ఉన్నవారే. ఇది అథ్లెట్లకు ఒలింపిక్స్ నేర్పిన పాఠం. అందుకే భారత్ కూడా క్రీడాకారుల బృందంతో తొలిసారి ఇద్దరు మహిళా మానసిక నిపుణులను ప్యారిస్ ఫ్లయిట్ ఎక్కించింది.**

కోట్లమంది తమపై పెట్టుకున్న అంచనాలు, అతిపెద్ద వేదికపై అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే ఉత్సుకత, మరోవైపు పతకాల వేటలో విఫలమవుతామేమోనన్న భయం, ఆందోళన... ప్రపంచ దేశాలన్నీ పోటీపడే మెగా ఈవెంట్‌లో అథ్లెట్లు ఎదుర్కొంటున్న మానసిక స్థితి ఇది. వారు మానసికంగా అంతటి బరువు మోయలేక... తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. వీటన్నిటి నుంచి బయటపడి, ఆటపై ఏకాగ్రత కుదరడానికి మానసిక నిపుణులను ఆశ్రయిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు వ్యక్తిగత కోచ్‌లే క్రీడాకారులకు నైతిక స్థైర్యాన్ని ఇచ్చేవారు. కానీ కరోనా అనంతర పరిణామాలతో సైకాలజిస్టుల అవసరం తెలిసొచ్చింది. లక్ష్య సాధనలో నైపుణ్య శిక్షణ ఒక్కటే సరిపోదని, అత్యున్నత స్థాయిలో పోటీపడేటప్పుడు ఆందోళలను దూరం చేసేందుకు మానసికంగా శిక్షణ, ఆరోగ్యం కూడా అవసరమనే వాదన మొదలైంది. టోక్యో ఒలింపిక్స్ సందర్భంగా దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్‌లో తొలిసారి మెంటల్ హెల్త్ హెల్ప్‌లైన్‌ను అథ్లెట్లకు అందుబాటులోకి తెచ్చింది 'అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ' (ఐఓసీ). దీని కోసం ఒక యాప్‌నూ రూపొందించింది.

'భారత ఒలింపిక్ అసోసియేషన్' (ఐఓఏ) తన మెడికల్ టీమ్‌లో స్పోర్ట్స్ సైకాలజిస్ట్ దివ్యా జైన్, సైకియాట్రిస్ట్ డాక్టర్ సమీర్ పారిఖ్‌కు చోటు కల్పించింది. ఒక్క భారత్ మాత్రమే కాదు... ఈసారి తొంభైకి పైగా దేశాలు తమ అథ్లెట్ల బృందాలకు తోడుగా సైకాలజిస్టులను ప్యారిస్‌కు పంపించాయి.

'క్రీడాకారులకు మానసిక మద్దతు అవసరమనే సంప్రదాయ ఆలోచన... వారు బరిలోకి దిగడానికి, అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ఎంతో దోహదపడుతుంది. అందులో సందేహం లేదు. కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే అథ్లెట్లకు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని అర్థమవుతోంది. ఒలింపిక్స్ మెడికల్ టీమ్‌లో నాలాంటి మానసిక నిపుణులకు చోటు కల్పిచడం అతిపెద్ద ముందడుగు' అంటారు పారిఖ్. 'ఫోర్టిస్ నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' చైర్‌పర్సన్ అయిన పారిఖ్‌కు ఈ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది.

'అథ్లెట్లు దృఢచిత్తం కలవారనేది అందరి అభిప్రాయం. కానీ తమలోని భావోద్వేగాలను, మానసిక పోరాటాలను వ్యక్తం చేస్తే బలహీనమవుతామనే భావన వారిని ఆందోళనకు గురి చేస్తుంటుంది' అంటారు 'ఫోర్టిస్ నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' సైకలాజికల్ సర్వీసెస్ హెడ్ దివ్యా జైన్. పారిఖ్, దివ్యా ఒకే సంస్థ కోసం పని చేస్తున్నారు.

> **అవమానం కాదు**
>
> 'ఒకప్పుడు అథ్లెట్లు థెరపిస్టులను కలవడం అవమానంగా భావించేవారు. అయితే సమస్య ఉత్పన్నమైనప్పుడు దానికి పరిష్కార మార్గాల్ని అన్వేషించాలి. మానసిక నిపుణులను నియమించుకుని బైల్స్ సరైన నిర్ణయం తీసుకుంది. ఆమెలా అత్యున్నత స్థాయిలో పోటీపడే స్టార్ అథ్లెట్లు అందరికీ ఇది అవసరం. ఒలింపిక్స్ లాంటి ఈవెంట్లకు వారు మరింత ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమవడానికి ఇది ఒక వరం. వాళ్ల విజయాల్లో అదీ ఒక భాగం' అంటారు ఫ్రాన్స్‌కు చెందిన బైల్స్ కోచ్ సెసైల్ లాండీ.

### పరిస్థితులు మారాయి...

క్రీడల్లో ఒకప్పుడు నిషిద్ధ అంశంగా పరిగణించిన మానసిక ఆరోగ్యం ఇప్పుడు ప్రాధాన్య అంశంగా మారింది. మానసిక నిపుణులను సంప్రతించడానికి సందేహించే పరిస్థితి నుంచి వారిని వెంటబెట్టుకొని ఆటలకు వెళ్లే రోజులు వచ్చేశాయి. టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికన్ జిమ్నాస్టిక్స్ సూపర్‌స్టార్ సైమన్ బైల్స్ ఉదంతం సైకాలజిస్టుల ఆవశ్యకతను మరింత బలపరిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు గెలిచిన బైల్స్... టోక్యోలో తీవ్ర ఒత్తిడికి లోనై, పలు ఈవెంట్ల నుంచి తప్పుకుంది. హఠాత్తుగా పోటీల నుంచి వైదొలగడంతో సొంత దేశంలోనే ఆమెకు మద్దతు కరువైంది. అమెరికాకు రావల్సిన స్వర్ణ పతకాన్ని చేజార్చిందంటూ పలువురు ధ్వజమెత్తారు. ధైర్యం చెప్పేవారి కంటే విమర్శించినవారే అధికమయ్యారు. ఇవి బైల్స్‌ను మరింత కుంగదీశాయి. ఈ అనుభవం ఆమెకు ఎన్నో పాఠాలు నేర్పింది. జిమ్నాస్టిక్స్ సాధన ఒక్కటే సరిపోదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని భావించింది. అప్పటి నుంచి తన సన్నద్ధతలో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను కూడా భాగం చేసింది. 'ప్రతివారం థెరపిస్టును కలవడం నా కెరీర్‌లో భాగం అయింది' అంటున్న బైల్స్ ఇప్పుడు ప్యారిస్‌లో రెట్టించిన ఉత్సాహంతో ప్యారిస్‌లో మళ్లీ పతకాలు పట్టింది.

### స్టార్ అథ్లెట్లు ఎందరో...

ఈ సమస్య బైల్స్‌ది మాత్రమే కాదు. అంతకముందు రికార్డు స్థాయిలో 28 ఒలింపిక్ పతకాలు గెలుచుకున్న అమెరికన్ స్విమ్మింగ్ సూపర్‌స్టార్ మైకేల్ ఫెల్ప్స్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాడు. ఒలింపిక్స్ అనంతర ప్రచార కార్యక్రమాలతో తాను తీవ్ర మానసిక ఒత్తిడిలోకి వెళ్లిపోయేవాడినని ఓ సందర్భంలో వెల్లడించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్న మరో అమెరికన్ స్విమ్మర్ కేలబ్ డ్రెసెల్... 2022 స్విమ్మింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ నుంచి అర్థంతరంగా తప్పుకున్నాడు. అతడిదీ అదే సమస్య... మానసిక ఒత్తిడి. ఇప్పుడు మనోవికాస నిపుణుడితో కలిసి ప్యారిస్‌కు వెళ్లాడు. ఈ బృందంలో సభ్యురాలైన రేగా స్మిత్‌కూ థెరపిస్టు సాయం అవసరమైంది. 2019లో రెండు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టిన ఆమె... ఆ తరువాత జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో తీవ్ర ఒత్తిడికి లోనై సాధారణ ప్రదర్శనతో సరిపెట్టుకుంది. 'థెరపిస్టు సహాయం తీసుకోవాడానికి మొదట నేను ఎంతో సంకోచించాను. ఒక సందర్భంలో భయపడ్డాను కూడా. చివరకు నాకు నేను నచ్చజెప్పుకుని సైకాలజిస్టును కలిశాను. ఆ తరువాతే నాకు అర్థమైంది... నేను ఇంతకాలంగా ఏ కోల్పోయానో' అంటున్న స్మిత్... ప్యారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో అదరగొట్టింది.

'శారీరకంగా ఎంత దృఢంగా ఉన్నామో... మానసికంగా కూడా అంతే బలంగా ఉండడం అథ్లెట్లకు ముఖ్యం' అనేది ఫ్రీస్టయిల్ స్ప్రింటర్ జాక్ అలెక్స్ మాట.

---

# బిజినెస్

## ఈసారీ వడ్డీ రేట్లు యథాతథం!

### రేపటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ



ముంబై: ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్ష కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఈ నెల 6 నుంచి 8 వరకు సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలోనూ ఎంపీసీ కీలక రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఎంపీసీ రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తోంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే వరకు.. మన దేశంలోనూ ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గించే అవకాశం లేదనే అంచనాలు వినిపిస్తున్నాయి. దేశీయంగా వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నా, జీడీపీ వృద్ధి రేటు సంతృప్తికరంగా ఉంది. దీంతో రెపో రేటు తగ్గింపుపై తొందరపడాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ భావిస్తోంది. 'రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతం వద్ద ఉన్నా.. ఆర్‌బీఐ ఈసారి కూడా వడ్డీ రేట్ల పెంపు జోలికి పోకపోవచ్చు' అని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ తెలిపారు. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులు ఏమీ లేకపోతే ఈ ఏడాది డిసెంబరు భేటీలో 0.25 శాతం, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే భేటీలో మరో 0.25 శాతం రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

### డెరివేటివ్స్‌పై ఆంక్షలు బ్యాంకులకు మంచిదే..

**ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా**

రిటైల్ మదుపరులు డెరివేటివ్స్ ట్రేడింగ్ చేయడంపై ఆంక్షలు విధించడం బ్యాంకులకు మేలు చేస్తుందని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. దీనివల్ల ఈ తరహా మదుపరులు మళ్లీ బ్యాంక్ డిపాజిట్లపై ఆసక్తి చూపిస్తారన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో స్వల్పకాలిక, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుల్లో మార్పు చేయడం.. బ్యాంకుల డిపాజిట్లపై ఎలాంటి ప్రభావం చూపదన్నారు. ప్రస్తుతం బ్యాంకులు పరపతి వృద్ధి రేటుకు తగ్గట్టుగా.. డిపాజిట్ల వృద్ధి రేటు లేకపోవడంతో నిధుల కొరత ఎదుర్కొంటున్న విషయాన్ని ఖారా గుర్తు చేశారు. ప్రస్తుతం రిటైల్ మదుపరుల్లో ఎక్కువ మంది నష్ట భయం ఉన్నా, బ్యాంకు డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు ఇచ్చే స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

### వయనాడ్ బాధితులకు రామ్‌రాజ్ కాటన్ రూ.25 లక్షల విరాళం



చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విలయం కారణంగా తీవ్రంగా నష్టపోయిన కేరళలోని వయనాడ్ బాధితుల కోసం రామ్‌రాజ్ కాటన్ రూ.25 లక్షల విరాళం అందించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ రూ.25 లక్షల విలువైన చెక్‌ను ఆదివారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు అందజేశారు. అంతేకాకుండా మరో రూ.25 లక్షల విలువైన ధోవతులు, చొక్కాలను బాధితులకు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ ధోవతి, చొక్కాలను రామ్‌రాజ్ కాటన్ బ్రాండ్ అంబాసిడర్, నటుడు జయరామ్ బాధిత కుటుంబాలకు అందజేయనున్నారు. ఇదిలాఉండగా జయరామ్ మరో రూ.5లక్షల విరాళాన్ని అందించారు.

- జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ నికర లాభం 11 శాతం వృద్ధి చెంది రూ.319 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక సమీక్షా కాలంలో స్థూల ప్రీమియం కూడా 18 శాతం వృద్ధితో రూ.2,949 కోట్ల నుంచి రూ.3,476 కోట్లకు పెరిగింది.
- ఎథ్నిక్ వేర్ బ్రాండ్ సోచ్.. విజయవాడలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా ఇక్కడ మూడో స్టోర్‌ను ప్రారంభించింది. ఈ కొత్త స్టోర్‌తో దేశవ్యాప్తంగా 65కి పైగా నగరాల్లో కంపెనీ నిర్వహిస్తున్న ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ సంఖ్య 175కి చేరింది.

### ఈ ఏడాది సిమెంట్‌కు మరింత గిరాకీ

**7-8 శాతం పెరిగే చాన్స్: అల్ట్రాటెక్**

న్యూఢిల్లీ:ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ రంగానికి బాగానే కలిసిరానుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం సిమెంట్ గిరాకీ 7 నుంచి 8 శాతం వరకు పెరగనుందని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ తన తాజా వార్షిక నివేదకలో పేర్కొంది. దేశవ్యాప్తంగా జోరు మీద ఉన్న నిర్మాణ రంగం ఇందుకు తోడ్పడుతుందని అంచనా వేసింది. పెరుగుతున్న ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు కంపెనీలు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) అదనంగా మరో 3.5 కోట్ల టన్నుల నుంచి 4 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం జోడిస్తాయని అంచనా వేసింది. ఇందులో 60 నుంచి 65 శాతం ఉత్పత్తి సామర్థ్యం దేశ తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఏర్పాటవుతుందని తెలిపింది. డిమాండ్ జోరు మీద ఉండడంతో ఈ ఆర్థిక సంవత్సరం కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 72 శాతం వరకు వినియోగించుకుంటాయని అంచనా వేసింది.

### చైనా నుంచి ఎఫ్‌డీఐ మంచిదే

న్యూఢిల్లీ: చైనా నుంచి పెద్దఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించాలన్న వాదనకు మద్దతు పెరుగుతోంది. ఆ దేశం నుంచి ఎడాపెడా వస్తువులు దిగుమతి చేసుకోవడం కంటే ఎఫ్‌డీఐ ద్వారా ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహించడం మేలని ప్రముఖ ఆర్థికవేత్త, నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ వీర్‌మణి చెప్పారు. దీనివల్ల చైనా నుంచి మన దేశానికి వస్తువుల దిగుమతులు తగ్గడంతో పాటు, అమెరికా, ఈయూ దేశాలకు మన ఎగుమతులు పెంచుకోవచ్చన్నారు. ఆగ్నేయాసియా దేశాలు ఇదే విధానం అనుసరించి తమ ఎగుమతులు పెంచుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికా, ఈయూ దేశాలు అనుసరిస్తున్న చైనా+1 విధానం ఈ విషయంలో మన దేశానికి కలిసి వస్తుందన్నారు. చైనా కంపెనీలకూ ఇది మేలు చేస్తుందన్నారు. మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసి అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేసి ఆ దేశాల ఆంక్షలను చైనా కంపెనీలు తప్పించుకోవచ్చని వీర్‌మణి చెప్పారు.

### 25,025 పైన బుల్లిష్

(ఆగస్టు 5-9 తేదీల మధ్య వారానికి)

**అవుట్ లుక్**


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,078-24,686 పాయింట్ల మధ్యన కదలాడి 117 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,025 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,901, 24,857, 24,682, 24,493 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,000 బ్రేక్‌డౌన్ స్థాయి : 24,415
నిరోధ స్థాయిలు: 24,925, 25,025, 25,125 (24,820 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,515, 24,415, 24,315 (24,615 దిగువన బేరిష్)

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 5వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 440 | విజయవాడ | 450 |
| వరంగల్ | 442 | గోదావరి | 440 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 450 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80 | విజయవాడ | 92 |
| వరంగల్ | 80 | గుంటూరు | 92 |
| కరీంనగర్ | 80 | ఒంగోలు | 92 |
| మహబూబ్‌నగర్ | 80 | చిత్తూరు | 106 |
| కర్నూలు | 80 | నెల్లూరు | 106 |
| విశాఖపట్నం | 86 | అనంతపురం | 92 |
| గోదావరి | 92 | | |

## జర జాగ్రత్త..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు గురయ్యే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండటం, తయారీ రంగం, నిరుద్యోగుల డేటా ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లలో మళ్లీ ఆర్థిక మాంద్యం భయాలు మొదలయ్యాయి. గత శుక్రవారం యూఎస్, యూరప్, ఆసియా దేశాల సూచీలు భారీగా పతనమయ్యాయి. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉండటం సానుకూల అంశం. ఈ వారం నిఫ్టీకి 24,600 వద్ద మద్దతు, 24,850 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఆటుపోట్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది.

### స్టాక్ రికమండేషన్స్

**దీపక్ ఫెర్టిలైజర్స్:** గత నాలుగు నెలల నుంచి ఈ షేరు మంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. వాల్యూమ్ కూడా పెరుగుతోంది. మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించటంతో మదుపరుల చూపు ఈ షేరుపై పడింది. గత శుక్రవారం ఈ షేరు 2.89 శాతం లాభంతో రూ.961 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.950 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,040/1,090 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.922 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్:** జూన్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేరు టైట్ రేంజ్‌లో ట్రేడవుతోంది. పైగా చివరి నాలుగు సెషన్లలో అదరగొట్టింది. కీలక నిరోధ స్థాయిలో రౌండింగ్ బేస్ ఏర్పడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.24 శాతం లాభంతో రూ.1,659 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,650/1,630 శ్రేణిలో ఎంటరై రూ.1,780/1,820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్:** జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో తక్కువ వాల్యూమ్‌తో స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. అయితే చివరి రెండు సెషన్లలో షేరు లాభపడింది. గత శుక్రవారం ఈ షేరు 1.11 శాతం లాభంతో రూ.6,964 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.6,910 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.7,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,870 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**అదానీ విల్మర్:** కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం బాటమ్‌కు చేరినట్లే కనిపిస్తోంది. ఎఫ్ఎంసీజీ ఫుడ్ వ్యాపారాన్ని ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేస్తారన్న వార్తలతో మళ్లీ మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం 10 శాతం లాభంతో రూ.383 వద్ద ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.370/380 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425/440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.355 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**సుజ్లాన్ ఎనర్జీ:** కంపెనీలో టర్న్ అరౌండ్ పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ షేరు ఐదేళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతున్నాయి. పైగా జూన్ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 4.96 శాతం లాభంతో రూ.71.35 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.70 వద్ద ఎంటరై రూ.76/81 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.67 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## ప్రధాన మద్దతు 24,400 చేరువలో...

**టెక్ వ్యూ**


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 దాటినా గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోలేక బలమైన కరెక్షన్ సాధించింది. శుక్రవారం ఏర్పడిన ఈ బలమైన రియాక్షన్‌తో స్వల్పకాలిక ర్యాలీకి అవరోధం ఏర్పడినట్టు కనిపిస్తోంది. గతంలో రెండు టాప్‌లు ఏర్పడిన ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోవడం ద్వారా ఇక్కడ బలమైన స్వల్పకాలిక నిరోధం ఏర్పడింది. 9 వారాల ర్యాలీలో ఏదైనా వారంలో నిఫ్టీ నష్టాలతో ముగియడం ఇదే ప్రథమం. గత వారంతో పోల్చితే 120 పాయింట్ల నష్టంతో నిఫ్టీ వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. ఇక మిడ్‌క్యాప్ 100 సూచీ గత వారం 145 పాయింట్ల మైనర్ లాభంతో ముగిసినా గరిష్ఠ స్థాయి కన్నా 1500 పాయింట్ల మేరకు దిగజారింది.

స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 55 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో డౌన్ ట్రెండ్ కారణంగా ఈ వారంలో మన మార్కెట్లో మరింత రియాక్షన్ ఏర్పడడానికే అవకాశం ఉంది. అలాగే వరుస ర్యాలీ కారణంగా కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడడం తప్పనిసరి. మొదట మార్కెట్ నిలదొక్కుకోవడం అవసరం.

**బుల్లిష్ స్థాయిలు:** ఒకవేళ ఏదైనా కరెక్షన్ ఏర్పడి అక్కడ నుంచి రికవరీ సాధించినా మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 24,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24,850, 25,000.

**బేరిష్ స్థాయిలు:** మరింత బలహీనత ప్రదర్శించి ప్రధాన మద్దతు స్థాయి 24,550 కన్నా దిగజారితే మరింత బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24,400. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా రికవరీకి ఆస్కారం ఉంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ కూడా గత వారం 52,000 స్థాయిని దాటినా నిలదొక్కుకోలేక శుక్రవారం 51,350 వద్ద ముగిసింది. మరింత బలహీనత ప్రదర్శించినా ట్రెండ్‌లో సానుకూలత కోసం మద్దతు స్థాయి 50,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 50,400. రికవరీ బాట పడితే 51,500 వద్ద గట్టి నిరోధం ఉంది.

**పాటర్న్:** మార్కెట్ స్వల్పకాలిక 25 డిఎంఎ వద్ద పరీక్షకు సిద్ధపడుతోంది. ఈ కీలక స్థాయిలో పరీక్ష ఎదుర్కొనడం ఇది రెండో సారి. 24,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు కనిపిస్తోంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ సాధించి తీరాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్ర వారాల్లో తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం : 24,700, 24,780 | |
| మద్దతు : 24,600, 24,550 | |

## పార్టీ మారి చంపేశారు!

- మొన్నటి వరకు అంతా వైసీపీలోనే
- ఎన్నికల ముందు పార్టీ మారిన కొందరు
- ఎన్నికల్లో సహకరించలేదని వైసీపీ కార్యకర్త దారుణ హత్య
- ఇంట్లో నుంచి లాక్కొచ్చి బండరాళ్లతో మోది ఘాతుకం
- అడ్డుకున్న భార్యకు తీవ్రగాయాలు


సుబ్బరాయుడు (ఫైల్)

మహానంది, ఆగస్టు 4: ఎన్నికల ముందు వరకు అందరూ వైసీపీలోనే ఉన్నారు. ఆ తర్వాత కొందరు పార్టీ మారారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో సహకరించలేదన్న అక్కసుతో ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మృతుడి భార్య కూడా తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామపురంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన సుబ్బారాయుడు అలియాస్ పెద్దన్న (68) వైసీపీ కార్యకర్తగా రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. అతడిని కొందరు టీడీపీ నాయకులు దారుణంగా హతమార్చినట్లు మృతుడి భార్య బాల సుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీతారామాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడి, భరత్‌రెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కాల్లూరి శ్రీనివాసులతో పాటు మరో 38 మంది శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్రలు, రాడ్లతో తన భర్తపై దాడికి తెగబడ్డారని బాలసుబ్బమ్మ పేర్కొంది. ఇంట్లో నుంచి బయటకు లాక్కుని వచ్చి బండరాళ్లతో అతికిరాతకంగా చంపేశారని తెలిపింది. గతంలో తాము, తమపై దాడి చేసిన శ్రీనివాసరెడ్డి అంతా వైసీపీలో ఉండే వారమని, అయితే ఎన్నికలకు ముందు శ్రీనివాసరెడ్డి టీడీపీలో చేరారని, ఎన్నికల్లో వారికి సహకరించలేదన్న కక్షతోనే తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. గాయాలపాలైన బాల సుబ్బమ్మను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఆదివారం పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు ఆదివారం తెల్లవారుజామునే సీతారామపురం చేరుకుని హత్యకు గల కారణాలను సేకరించారు.

# రూ.60 కోట్ల పనులకు 650 కోట్ల బిల్లులు!

- పులివెందుల అథారిటీలో అక్రమాలెన్నో
- సీఎంగా జగన్ దోపిడీ 2 లక్షల కోట్లు..
- ఆయన అనుచర గణం 3 లక్షల కోట్లు
- ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి ధ్వజం


విలేకరులతో మాట్లాడతున్న ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి

విజయవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ)లో భారీ అవినీతి జరిగిందని బీజేపీ నేత, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. రూ.60 కోట్ల విలువ చేసే పనులకు రూ.650 కోట్ల బిల్లులు పెట్టారని తెలిపారు. కాంట్రాక్టర్లకు ఈ బిల్లులు చెల్లించలేదని, త్వరలోనే ఎమ్మెల్యే జగన్‌ను పులివెందుల ప్రజలు కుక్కను కొట్టినట్టు కొడతారని అన్నారు. ఆదివారమిక్కడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఏడీఏలో జరిగినట్లుగానే రాష్ట్రంలోని అన్ని విభాగాల్లోనూ లెక్కలేని అక్రమాలు జరిగాయన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రూ.2 లక్షల కోట్లు దోచుకుంటే.. ఆయన అనుచర గణం రూ.3 లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు ఢిల్లీలో పిచ్చికుక్కల మాదిరిగా కూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా అప్పులు చేశారని.. అందుకోసమే తమ కూటమి ప్రభుత్వం ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పులివెందుల ప్రజలు జగన్‌ను ఓడించి పిచ్చికొట్టుడు కొడతారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా వైసీపీ నేతలంతా జైళ్లకు వెళ్లడం ఖాయమన్నారు. వారిని పెట్టడానికి జైళ్లు సరిపోవని చెప్పారు. త్వరలోనే కోడికత్తి కేసు కొలిక్కి వస్తుందన్నారు. కేంద్రం, రాష్ట్రం భాగస్వామ్యంతో అమలు జరిగే 142 పథకాలను జగన్ పక్కదారి పట్టించి మాయం చేశారని దుయ్యబట్టారు. జగన్ ఒక పిచ్చి మాయలో ఉన్నాడని, త్వరలో ఆయన కేసులు, కాసులు అన్నీ బయటకు వస్తాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మాదిరిగానే వైసీపీ పరిస్థితి కూడా సున్నాకు దిగిపోతుందని జోస్యం చెప్పారు. త్వరలో కడప విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు.

# సంక్షేమం.. అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాసంక్షేమం కోసం అమలు చేయాలనుకున్న బహుముఖ వ్యూహాన్ని కలెక్టర్లు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో చర్చించి దాని అమలుకు కార్యాచరణను ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రిగా 1995 నాటి మోడల్‌ను అమలు చేస్తానని ఇప్పటికే చంద్రబాబు పలుమార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పరిపాలనలో గుణాత్మకమైన మార్పు తీసుకురావాలని ఆయన భావిస్తున్నారు. చంద్రబాబు అంటే కేవలం అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తారన్న విమర్శలకు దీటుగా బదులివ్వడానికి సన్నద్ధమవుతున్నారు. పేదలే లక్ష్యంగా సంక్షేమం అందించేలా ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రతీ పేద కుటుంబంలోని లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛను సొమ్ము అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇలా కుటుంబంలో వ్యక్తిని ఒక యూనిట్‌గా తీసుకొని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేలా సంక్షేమ కార్యాచరణను రూపొందించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పేదల సంక్షేమానికి వివిధ పథకాల ద్వారా రూ.వేల కోట్లు ఖర్చుపెట్టబోతున్నారు. ఈ ఖర్చు నిజంగా వారికి మేలు చేస్తుందా? లేదా? ఇంకా ప్రజలకు మేలు చేయడానికి ఏం చేస్తే బాగుంటుంది? పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడనున్నారు. మరోవైపు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సామాజిక సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని భావిస్తున్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు రక్షిత తాగునీరు, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం, కూలీలు, కార్మికులకు ఉపాధి కల్పన, రహదారుల నిర్మాణం, పాఠశాలలను సమర్థంగా నిర్వహించడం, భూ వివాదాల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ.. వంటి సామాజిక ప్రయోజనాలు లక్ష్యంగా గ్రామాలను ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు యోచిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని సమగ్రాభివృద్ధికి బాటలు వేయాలన్నది ఆయన వ్యూహం. దీని అమలుకు జిల్లా కలెక్టర్లే కీలకం. అటు ప్రజా సంక్షేమ పథకాలు, ఇటు అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది వారే. ఇప్పుడున్న కలెక్టర్లలో చాలామంది కొత్త వారు. అంతకు ముందు జేసీలుగా పనిచేసి పదోన్నతి పొందినవారు కూడా ఉన్నారు. కాబట్టి పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, పర్యవేక్షణలో తప్పులు జరగకుండా సత్ఫలితాలే లక్ష్యంగా పనిచేసేలా వారికి సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

### ప్రతి ఎకరాకూ నీరందిద్దాం: చంద్రబాబు

నదుల అనుసంధాన ప్రక్రియపై కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వనున్నారు. నదీ జలాలు సముద్రంలో కలవకుండా ప్రతి నీటిబొట్టూ సాగుకు సద్వినియోగం చేయాలని, 26 జిల్లాల్లోని 4కోట్ల ఎకరాల్లో ప్రతి ఎకరాకూ సాగునీరందేలా కార్యాచరణ చేపట్టాలని వారిని సీఎం ఆదేశించనున్నారు. సోమవారం జరగబోయే కలెక్టర్ల సమావేశానికి జల వనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. 5 భారీ రిజర్వాయర్లు, 35 చిన్నతరహా నదుల్లోని 38,422 మైనర్ ఇరిగేషన్ వనరుల ద్వారా సాగునీటిని అందించాలని సీఎం ఆదేశిస్తారు. నీటి విడుదలను కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలని సూచించనున్నారు.



### సీనియర్ల నుంచి కలెక్టర్లకు పాఠాలు

గత జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేంద్రంగానే పాలన సాగింది. అప్పట్లో సీఎం జగన్, ఆయన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిదే పెత్తనం. మంత్రులు, ముఖ్యకార్యదర్శులు, విభాగాధిపతులు, కలెక్టర్ల పాత్ర నామమాత్రం. సీఎం లేదా ఆయన ఆఫీసు, సజ్జల నుంచి వచ్చే ఆదేశాలే కీలకంగా పనిచేశారు. జగన్ బటన్ నొక్కి జనం ఖాతాలో డబ్బు వేస్తారు. అదే సంక్షేమం. రాష్ట్రానికి ఇక వేరే ఏదీ అక్కరలేదనట్లుగా గత ప్రభుత్వం వ్యవహరించింది. ఫలితంగా ప్రజలు విసిగిపోయారు. అణగారిన వర్గాలు, పేదలకు సంక్షేమం దక్కక అల్లాడిపోయారు. ఉపాధి కల్పన, అభివృద్ధి లేక జనం రాష్ట్రం వదిలి వెళ్లిపోయారు. వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లేలా కలెక్టర్లకు చంద్రబాబు పెద్ద ఎత్తున హోమ్‌వర్క్ ఇవ్వబోతున్నారు. ఇందులో పని చేసేవారికే ప్రాధాన్యం. ప్రభుత్వ ప్రాధాన్యాలను అర్థంచేసుకొని పనిచేయడంలో పోటీపడేలా వారికి లక్ష్యాలను విధించనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులుగా ఉన్నవారు 1995లో ఆయా జిల్లాలకు కలెక్టర్లుగా పనిచేసిన వారే. తమతో చంద్రబాబు ఎలా పని చేయించారో వారు ఇప్పటికీ చెబుతుంటారు. ఇప్పుడు వారంతా కలెక్టర్లతో మమేకం కాబోతున్నారు. సీనియర్ల నుంచి పాఠాలు నేర్చుకునే అవకాశం వారికి దక్కుతోంది.

### భజనకు దూరంగా..

ప్రభుత్వంలో ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, విభాగాధిపతులకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాలు స్పష్టంగా బోధపడ్డాయి. జగన్ ప్రభుత్వానికి, కూటమి సర్కారుకు ఉన్న తేడా ఇప్పటికే వారికి అర్థమైంది. ఇప్పుడు కలెక్టర్లు కూడా ఆ తేడాను గుర్తించాలి. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎలా పనిచేయాలో, ఫలితాలు ఎలా రాబట్టాలో, ప్రజలతో ఎలా మమేకం కావాలో ముఖ్యమంత్రి వారికి మార్గనిర్దేశం చేయనున్నారు. ప్రజాక్షేత్రంలో ఎవరు చక్కటి ఫలితాలు సాధించేవారే ప్రభుత్వం దృష్టిలో సమర్థులుగా నిలుస్తారు. పనిచేయకున్నా, ఫలితాలు చూపకున్నా సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్, వీడియోకాన్ఫరెన్స్, ఇతర మీటింగ్‌ల్లో చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని అదేపనిగా పొగుడుతూ పబ్బంగడుపుకునే వారిని పూర్తిగా దూరంపెట్టాలని సీఎం భావిస్తున్నారు. భజనపరులకు, సొంత డబ్బా కొట్టే వారికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకూడదని ఆయన ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. తన మంత్రివర్గానికి కూడా అదే హితబోధ చేశారు. కొందరు కలెక్టర్లు, విభాగాధిపతులు, కార్యదర్శులు తమ శాఖ పరిధిలో ఆశించిన ఫలితాలు చూపించలేని పరిస్థితి ఉన్నప్పుడు సమావేశాలు, వేదికలపై ముఖ్యమంత్రికి, మంత్రులకు భజన చేస్తుంటారు. పొగడ్తలతో వారిని ఆకాశానికి ఎత్తేస్తుంటారు. ఆ క్రమంలో అసలు అంశాన్ని దారి మళ్లిస్తారు. ఈ విధంగా పొగడ్తల్లో ముంచే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం ఇప్పటికే మంత్రులకు సూచించారు. క్షేత్రస్థాయిలో తీవ్రమైన సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని నిర్భయంగా ప్రస్తావించి, వాస్తవ నివేదికలు ఇచ్చే వారికి, సమస్యలకు పరిష్కారాలు కోరేవారికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. కలెక్టర్లు కూడా వాస్తవాలనే ప్రభుత్వం ముందు ఉంచేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

### స్వల్ప వ్యవధిలోనే పెద్ద పరిష్కారాలు

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబుకు రాష్ట్రంలో ఏ మూలన ఏ సమస్య ఉందో అవగాహన ఉంది. వాటికి పరిష్కారాలు ఏమిటో కూడా ఆయనకు తెలుసు. ఈ నేపథ్యంలో ఇకపై సమావేశాల్లో సుదీర్ఘ చర్చలకు అస్కారం ఇవ్వకపోవచ్చు. కలెక్టర్లు, విభాగాధిపతులు చెప్పే విషయాలు, సమర్పించే నివేదికలనే నమ్మి ముందడుగు వేసే పరిస్థితి ఉండకపోవచ్చని అధికార వర్గాలే చెబుతున్నాయి. ఇందుకు కారణం ఆయన ప్రతిపక్ష నేతగా ప్రజలతో మమేకమవడమే. ప్రభుత్వ శాఖలు, కలెక్టర్లు లేవనెత్తే సమస్యలపై వెనువెంటనే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. ఇకపై సుదీర్ఘ సమావేశాలు, రాత్రి మీటింగ్‌లు కూడా ఉండవని బాబు ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ప్రత్యేకించి శని, ఆదివారాల్లో మీటింగ్‌లు కూడా వద్దని స్పష్టం చేశారు కలెక్టర్ నుంచి విభాగాధిపతి, ప్రభుత్వ స్థాయిలో కార్యదర్శులకు కీలకమైన లక్ష్యాల సాధనకు టార్గెట్ ఇచ్చి నిర్దేశిత సమయంలో వాటిని సాధించేలా ప్రోత్సహించడం, అంతిమంగా సకాలంలో ఫలితాలు సాధించేలా మార్పు తీసుకొచ్చేలా వ్యూహరచన చేస్తున్నారు.

# గోబెల్స్ సిగ్గుపడేలా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రమోషన్లు ఇచ్చారని అడ్డగోలు ఆరోపణలు చేశారు. చంద్రబాబు రూ.6 లక్షల కోట్ల అవినీతి చేశారంటూ ఏకంగా ఒక పుస్తకం వేశారు. జగనే స్వయంగా ఆరోపణలు చేయడంతో పాటు గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదులు కూడా చేశారు. జనం నమ్మేవరకు ఒకే అబద్ధాన్ని వందచోట్ల, వందసార్లు, వంద మంది చేత వంద రకాలుగా చెప్పించారు. ఈ అబద్ధపు పునాదుల మీదే వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చింది. జగన్ చేసిన ఆరోపణల్లో ఒక్కదాన్ని కూడా నిరూపించలేకపోయారు. గత ఐదేళ్లు అడ్డగోలుగా పాలన చేశారు. జగన్ నిజస్వరూపం తెలియడంతో ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారు. దీంతో మళ్లీ అబద్ధాలతో చంద్రబాబు ప్రభుత్వంపై విషం చిమ్మాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఢిల్లీ వెళ్లి గోల చేశారు. వారి పేర్లు, ఎఫ్ఐఆర్‌లు ఇవ్వాలని ప్రభుత్వం అడిగితే అటువైపు నుంచి సమాధానం లేదు. జగన్ సైలెంట్ అయ్యారు. కానీ, సోషల్ మీడియాలో ప్రచారం ఆగడం లేదు. ఈ అబద్ధాల ప్రచారాన్ని ప్రభుత్వం సరిగ్గా ఎదుర్కోలేకపోతోందని, కఠినంగా వ్యవహరించలేపోతోందని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. ఈ వ్యవహారంలో జగన్ తీరుపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఈ గోబెల్స్ భూతం మరింత భయంకరంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి. జగన్‌కు నోటీసులు ఇస్తామని ప్రభుత్వం చెప్పినా, దానికనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదంటూ వాపోతున్నాయి. చంద్రబాబు అధికారం చేపట్టి రెండు నెలలు కూడా కాకముందే 36 రాజకీయ హత్యలు జరిగాయని, సూపర్ సిక్స్ అమలు చేయడం లేదని, ఇసుక ఉచితం కాదని, కమ్మ సామాజిక వర్గం వారికి పోస్టింగుల్లో ప్రాధాన్యమంటూ గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టారు. వీటిపై ప్రతి రోజు వైసీపీ నుంచి ఎవరో ఒకరు మాట్లాడుతున్నారు. సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి నష్టం తప్పదంటూ టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### అన్నీ అబద్ధాలే

గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు పింక్ డైమండ్ పోయిందన్న అబద్ధాన్ని జనాల్లోకి ఎక్కించడానికి అప్పటి టీటీడీ ప్రధానార్చకుడు రమణ దీక్షితులను వైసీపీ రంగంలోకి దించింది. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించిన రెండు కమిషన్లు 1952 నుంచి టీటీడీ రికార్డులు పరిశీలించి అసలు పింక్ డైమండ్ అనేదే లేదని నిర్ధారించాయి.

టీడీపీ ప్రభుత్వ హయాంలో 35 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐలకు డీఎస్పీలుగా ప్రమోషన్లు ఇచ్చారన్న అబద్ధాన్ని జగన్ విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలను నమ్మించగలిగారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం మాత్రం 'మనం ఇవ్వలేదు కదా ఎందుకులే స్పందించడం' అని సైలెంట్‌గా ఉండిపోయింది. ఫలితంగా 2019 ఎన్నికల్లో నష్టపోయింది. తర్వాత అసెంబ్లీలో జగన్ ప్రభుత్వమే స్వయంగా ఆ 35 మంది మొత్తం కమ్మ సామాజిక వర్గంవారు కాదని చెప్పారు. జగన్ చెప్పిన అబద్ధాలు మచ్చుకుకొన్ని...

- విశాఖ విమానాశ్రయంలో జగన్ తనపై చేయించుకున్న కోడికత్తి దాడిని టీడీపీకి ముడిపెట్టారు.
- సొంత బాబాయి హత్యకు గురైతే చంద్రబాబే చంపించారంటూ విపరీతమైన ప్రచారం చేశారు. ఈ కేసులో జగన్ సోదరుడు వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి నిందితులుగా ఉన్నారు.
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని 2019కి ముందు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక మరిచిపోయారు.
- ముస్లిం రిజర్వేషన్లపై రాష్ట్రంలో ఒకలా మాట్లాడి, పార్లమెంటులో అందుకు విరుద్ధంగా బిల్లుపెట్టిన బీజేపీకి మద్దతిచ్చారు.
- విశాఖలో పెట్టుబడుల సదస్సు పెట్టి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ ఖరీదైన అబద్ధం చెప్పారు. దీనివల్ల రూపాయి కూడా రాకపోగా, ఆ సదస్సు నిర్వహణకు పెట్టిన ఖర్చులు కూడా దండగేనని అంటున్నారు.
- మద్యపాన నిషేధమని చెప్పి ఆ వ్యాపారాన్ని తాకట్టు పెట్టి రూ.50,000 కోట్ల అప్పులు తెచ్చారు. పైగా మద్యం వినియోగం తగ్గిందంటూ అసెంబ్లీలో అసత్యపు ప్రకటన చేశారు.
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం కోసం అసెంబ్లీ వేదికగా 3 రాజధానుల ప్రకటన చేశారు.
- వారం రోజుల్లో సీపీఎస్ రద్దంటూ ఉద్యోగులను మోసం చేశారు.

### జగన్ నిజాలు చెప్పినా నమ్మరేమో

పదేళ్ల నుంచీ జగన్ అబద్ధాలు దగ్గరగా చూసిన వైసీపీ నేతలు ఈ ధోరణి తమ పార్టీకి నష్టం కలిగిస్తుందంటూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఈ అబద్ధాలే తమను నిండా ముంచాయని, ఇకపై జగన్ నిజాలు చెప్పినా ఎవ్వరూ నమ్మరేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి నోట్లో నుంచి ఒక విమర్శ వచ్చిందంటే అది 100 శాతం నిజమై ఉండాలని అంటున్నారు. ఈ అబద్ధాల వల్ల ప్రజలు తమ పార్టీని ద్వేషిస్తారని, ఇలాగే కొనసాగితే పార్టీ మనుగడకే ప్రమాదమని వైసీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 'ప్రైవేటు' నాలుగో తరగతి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి: అనుప్రియ

లఖ్‌నవూ, ఆగస్టు 4: ప్రైవేటు రంగంలో నాలుగో తరగతి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రమంత్రి అనుప్రియా పటేల్ మరోసారి డిమాండ్ చేశారు. 'ప్రైవేటు రంగంలో ఔట్‌సోర్సింగ్ ద్వారా జరిగే నియామకాల్లో రిజర్వేషన్లు పాటించట్లేదు. అణగారిన వర్గాల ప్రజలకు నాలుగో తరగతి ఉద్యోగాలు దక్కేవి. రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో వారు వాటికి దూరమవుతున్నారు. నాలుగో తరగతి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలని మా పార్టీ (అప్నాదళ్) తరఫున డిమాండ్ చేస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. కులగణన చేయాలనే డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులాల వారీగా లెక్కలు తేలినప్పుడే ఆయా వర్గాలకు ఉద్దేశించిన ప్రయోజనం చేకూరుతుందన్నారు. అయోధ్య అత్యాచార ఘటనపై మాట్లాడుతూ.. నేరస్థులకు మతం లేదని, మహిళలపై నేరాలకు పాల్పడిన వారెవరైనా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు.

## ఆయుష్‌లో..
# అవినీతి 'ప్రింటింగ్'

ఆయుష్ విభాగంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలు అన్నచందంగా మారింది. ఆయుష్ ఆసుపత్రులకు అవసరమైన ప్రింటింగ్ మెటీరియల్ విషయంలో ఎవరూ పెద్దగా జోక్యం చేసుకోరని భావించిన ఓ అధికారి.. దానినే తన అక్రమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. మెటీరియల్ ప్రింటింగ్ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా ఓ గ్రాఫిక్ షాపు యజమానికి ఇచ్చి రూ.కోట్ల సొమ్మును దొడ్డిదారిలో సొంతం చేసుకున్నారు. ఎలాంటి టెండర్లు లేకుండానే రూ.కోట్ల విలువైన మెటీరియల్ పింట్రింగ్ బాధ్యతను గ్రాఫిక్ షాపునకు అప్పగించడం, మెటీరియల్ అందినా అందకున్నా బిల్లులు చెల్లించడం వంటివి అవినీతికి పరాకాష్ఠగా మారాయి.

## ప్రింటింగ్ పేరుతో కోట్లు నొక్కేశారు

- అనర్హత కంపెనీకి ప్రింటింగ్ ఆర్డర్లు
- అక్కడ నుంచి అధికారి డ్రైవర్ కంపెనీకి
- మెటీరియల్ రాకుండానే బిల్లుల చెల్లింపు
- దాదాపు రూ.6 కోట్ల వరకు ఇచ్చేసిన వైనం
- ఇప్పటికీ ఆస్పత్రులకు రాని ఓపీ, ఐపీ షీట్స్
- ఆయుష్ అధికారి కనుసన్నల్లోనే స్కెచ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆయుష్ విభాగం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ప్రింటింగ్ మెటీరియల్ కొనుగోలును కూడా ఓ అధికారి విడిచిపెట్టలేదు. ఆయుష్ విభాగంలో ప్రతి ఏటా దాదాపు రూ.10 నుంచి రూ.15 కోట్ల విలువైన ప్రింటింగ్ మెటీరియల్ కొనుగోలు చేస్తారు. దీనిలో ఎక్కువ మొత్తంలో ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో రోగుల కోసం ఓపీ షీట్, కేస్‌షీట్, ఓపీ స్లిప్స్, హాజరు నమోదు చేసుకునే రిజిస్టర్స్ ఇతర అవసరాలకు ఉపయోగించుకునే ప్రింటింగ్ మెటీరియల్ ఉంటాయి. ఇవి కాకుండా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ నిమిత్తం ఉపయోగించే కర పత్రాలకు కూడా ప్రింటింగ్ ఆర్డర్ ఇస్తారు. ఆస్పత్రుల్లో ఉపయోగించే ప్రింటింగ్ మెటీరియల్, సిబ్బంది శిక్షణ నిమిత్తం ఉపయోగించే కరపత్రాల ప్రింటింగ్ మొత్తం నిబంధనలకు అనుగుణంగా చేయాలి. కానీ, అధికారులు నిబంధనలను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో అందిన కాడికి దోచుకున్నారు. అర్హత లేని కంపెనీని ఎంపిక చేసుకుని దాని ద్వారా ప్రింటింగ్ మెటీరియల్ ఆర్డర్ పెట్టారు. దీంతోపాటు ఆస్పత్రులకు, ఆర్డీడీ కార్యాలయాలకు మెటీరియల్ రాకుండానే బిల్లులు చెల్లించారు. పైగా అధికారులు ఇచ్చిన ఆర్డర్ మొత్తం సప్లయ్ చేయకపోయినా, 40 లేదా 50 శాతం మెటీరియల్ సప్లయ్ చేసినా పూర్తి మొత్తంలో బిల్లులు చెల్లించారు. గత రెండేళ్ల నుంచి ఆయుష్ అధికారులు ఇదేవిధంగా ప్రింటింగ్ మెటీరియల్ కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా ప్రింటింగ్ మెటీరియల్ పేరుతో కోట్ల రూపాయిల అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది ఆయుష్ విభాగం పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో ఓపీ షీట్, కేస్‌షీట్, ఓపీ స్లిప్స్, హాజరు నమోదు చేసుకునే రిజిస్టర్స్ కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. దాదాపు కోటి రూపాయిల మెటీరియల్‌కు ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. దీంతో ఆయుష్ ఉన్నతాధికారికి సరికొత్త ఆలోచన వచ్చింది. ఈ ఆర్డర్ బయటకు వెళ్లడం ఎందుకు.. మనమే ఆర్డర్ తీసుకుని, కొంత సరఫరా చేసి, మిగిలినంది నొక్కేద్దామని స్కెచ్ వేశారు. వెంటనే తన కార్యాలయంలో విధులు నిర్వహించే ఒక మహిళా డాక్టర్‌కి విషయం చెప్పి, ఆమె డ్రైవర్‌కు ప్రింటింగ్ బాధ్యతలు అప్పగించారు. సదరు డ్రైవర్.. తనకు తెలిసిన ఒక గ్రాఫిక్ షాపు యజమానిని సంప్రదించారు. విజయవాడలోని పటమటలో ఉన్న ఒక చిన్న గ్రాఫిక్ షాపు ద్వారా ప్రింటింగ్ చేయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గ్రాఫిక్స్ షాపు నేరుగా టెండర్లలో పాల్గొనే అవకాశం లేదు. దీనికి కనీసం జీఎస్టీ కూడా లేదు. ఈ నేపథ్యంలో సదరు షాపునకు నేరుగా ప్రింటింగ్ ఆర్డర్ ఇస్తే సమస్య వస్తుందని భావించి.. నేషనల్ హెల్త్ మిషన్‌తో ఒప్పందం చేసుకున్న కేంద్రీయ బండారుకు ఆర్డర్ ఇచ్చారు. కేంద్రీయ బండార్ ద్వారా ఆ గ్రాఫిక్స్ షాపు యజమానికి ఆర్డర్ వెళ్లింది. ఇక్కడ విచిత్రం ఏంటంటే ఇప్పటి వరకు గ్రాఫిక్స్ యజమానులు ఎవరూ ఆయుష్‌కు ప్రింటింగ్ మెటీరియల్ సరఫరా చేయలేదు. కానీ, అధికారులు మాత్రం రూ.కోటి బిల్లులు చెల్లించేశారు. ఇప్పటికిప్పుడు మెటీరియల్ ఎక్కడుందని వెతికితే కనీసం ఒక్క ఓపీ షీట్ కూడా ఆస్పత్రుల్లో కనిపించడం లేదు. దీంతో ఆస్పత్రులకు మెటీరియల్ రాకుండా బిల్లులు ఎలా చెల్లించారన్నది ప్రశ్న. ఆయుష్ అధికారికి చెందిన కంపెనీ కావడంతో ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఆర్డీడీలు మెటీరియల్ తీసుకున్న సర్టిఫికేషన్ కాపీలు లేకపోయినా, మెటీరియల్ రాకపోయినా బిల్లులు మాత్రం ముందే విడుదల చేశారు.

### ఆశా శిక్షణలోనూ ఇంతే..

కేంద్ర ప్రభుత్వం.. ఆయుర్వేద, యునానీ వంటి వైద్యంపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శిక్షణకు అవసరమైన కరపత్రాలు, ఇతర పత్రాలను ప్రింటింగ్ చేసుకునేందుకు దాదాపు రూ.5 కోట్ల వరకు నిధులు విడుదల చేసింది. ఈ నిధులను కూడా ఆయుష్ అధికారులు మింగేశారు. ఓపీ షీట్ ప్రింటింగ్‌లో జరిగినట్లుగానే ఆశా శిక్షణ కోసం అవసరమైన పత్రాలు ప్రింటింగ్‌లోనూ వ్యవహరించారు. రూ.5 కోట్ల విలువైన టెండర్‌ను కేంద్రీయ బండార్ పేరుతో గ్రాఫిక్స్ షాపునకు అప్పగించేశారు. ఇప్పటి వరకు ఆస్పత్రులకు, ఆర్డీడీ కార్యాలయాలకు మెటీరియల్ అందలేదు. కానీ, బిల్లులు మాత్రం చెల్లించారు. అసలు మెటీరియల్ వస్తుందో రాదో కూడా తెలియదు. ఇలా.. ఆయుష్ అధికారుల కనుసన్నల్లో ప్రింటింగ్ మెటీరియల్ స్కామ్ రెండేళ్లుగా జరుగుతోందని సమాచారం.

### అక్కడ మెక్కాడని ఇక్కడకు!

గతంలో ఈఎస్ఐలో భారీగా అవినీతికి పాల్పడిన ఒక అధికారిని గత ప్రభుత్వం ఆయుష్ విభాగానికి బదిలీ చేసింది. ఇక్కడ కూడా సదరు అధికారి తీరు ఏమాత్రం మారలేదు. ఈఎస్ఐలో చేసిన అక్రమాలు, అడ్డగోలు పనులే ఇప్పుడు ఆయుష్‌లో కూడా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం కేంద్రీయ బండార్‌కు, అక్కడ నుంచి గ్రాఫిక్స్ షాపునకు ప్రింటింగ్ మెటీరియల్ ఆర్డర్లు ఇవ్వడానికి లేదు. అసలు కేంద్రీయ బండార్‌ను బ్లాక్‌లిస్ట్ చేయమని ఏపీఎంఎస్ఐడీసీ ఎప్పుడో ఎన్‌హెచ్‌ఎంకి లేఖ రాసింది. కానీ, ఎన్‌హెచ్‌ఎం అధికారులు పట్టించుకోకుండా రూ.కోట్ల విలువైన టెండర్లు ఇచ్చారు. ఇప్పుడు అదే కంపెనీకి ఆయుష్ అధికారులు కూడా ఆర్డర్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఆయుష్ ప్రింటింగ్ మెటీరియల్ ఆర్డర్ ఇవ్వాలంటే ప్రత్యేకంగా టెండర్లు ఆహ్వానించారు. టెండర్ల ప్రకారం ఎల్-1 వచ్చిన కంపెనీకి ఆర్డర్లు ఇవ్వాలి. అంతేకానీ ఎన్‌హెచ్‌ఎంతో అగ్రిమెంట్ అయిన కంపెనీకి ఆర్డర్ ఇవ్వడానికి లేదు. అయితే, టెండర్లు పిలిస్తే అధికారులకు సొమ్ములు దక్కవనే కారణంగా ఇలా అడ్డగోలుగా ఆర్డర్లు ఇచ్చారనే వాదన ఉంది. మొత్తంగా ఆయుష్ విభాగంలో సదరు అధికారి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన ఆర్డర్లపై సమీక్ష చేస్తే, మరిన్ని వెలుగులోకి వస్తాయని సిబ్బంది అంటున్నారు.


కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఆరేళ్లధార డంపింగ్ యార్డులో లేటరైట్ నిల్వలు పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీవో సీతారామరాజు

## లేటరైట్ డంపింగ్ యార్డుల్లో అధికారుల ఆరా

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై కాకినాడ కలెక్టర్ స్పందన
- ఆరేళ్లధార నిల్వలను పరిశీలించిన పెద్దాపురం ఆర్డీవో
- నెల్లిపూడి వద్ద అసిస్టెంట్ జియాలజిస్టు పర్యటన
- అనుమతుల్లేకుండా తరలించవద్దని నిర్వాహకులకు నోటీసులు

ప్రత్తిపాడు/శంఖవరం, ఆగస్టు 4: అధికారంలో ఉన్నప్పుడు కాకినాడ జిల్లాలో లక్షన్నర టన్నుల లేటరైట్ ఖనిజాన్ని అక్రమంగా తవ్వి దాచిపెట్టుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చినా.. గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు ఎగుమతి చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. అనుమతుల్లేకుండా ఖనిజ నిల్వలను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. దీనిపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో లేటరైట్.. రైట్ శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు ప్రత్తిపాడు మండలం వంతాడ సమీపంలో ఆరేళ్ల ధార వద్ద ఉన్న లేటరైట్ డంపింగ్ యార్డు నిల్వలను పరిశీలించారు. వంతాడ గనుల నుంచి కొండ దిగువన ఉన్న డంపింగ్ యార్డుకు తరలించిన లేటరైట్ నిల్వలు, వీటిని ఎగుమతి చేసిన అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. ఆరేళ్లధార డంపింగ్ యార్డు నుంచి ఏలేశ్వరం యార్డుకు 16 లారీల వరకు లేటరైట్‌ను అక్కడకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇంకా వంతాడలో నిర్వహిస్తున్న లేటరైట్ తవ్వకాలు, లీజుల విస్తీర్ణం వంటి అంశాలపై కూడా సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలతో దీనిపై పూర్తి నివేదిక అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. చింతలూరు కొండపై జరుగుతున్న మైనింగ్‌లకు సంబంధించి ఇప్పటికే ఏడీ మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లీజుదారులు ఏ మేరకు తవ్వకాలు జరిపారో పరిశీలించి తవ్వకాలు ప్రదేశాల ఫొటో రికార్డులు సేకరించారు. ఆదివారం కూడా విజిలెన్స్ మైనింగ్ బృందాలు చింతలూరు మైనింగ్ తవ్వకాల లేటరైట్ మట్టి నిల్వలు కూడా ఏ మేరకు తరలించారో అనే దానిపై విచారణ జరిపారు. అటు శంఖవరం మండలం నెల్లిపూడి శివార్లలో ఉన్న లేటరైట్ నిల్వలను కూడా మైనింగ్ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఇక్కడ 94 వేల క్యూబిక్ మీటర్ల లేటరైట్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని భూగర్భ గనుల శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు సురేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి అనుమతులు వచ్చిన తర్వాతే తరలింపులు చేయాలని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.


నెల్లిపూడి శివార్లలో ఉన్న లేటరైట్ నిల్వలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

# జోగి రమేశ్‌పై హైకోర్టులో కేసు

- సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూమి కబ్జా
- ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్న కుటుంబ సభ్యులు
- కోర్టును ఆశ్రయించిన అగ్రి యాజమాన్యం



(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ సభ్యులు సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని కబ్జా చేశారు. అధికారుల సహకారంతో ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. జోగి కుటుంబ సభ్యులు చేసిన భూదందాపై అగ్రిగోల్డ్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. అగ్రిగోల్డ్ యాజమాన్యం తరపున అవ్వా వెంకటశేషు నారాయణరావు గత నెలలో పిటిషన్ దాఖలు చేశారు. నున్న సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన నాగేశ్వరరావు, విజయవాడ రూరల్ తహసీల్దార్ బాలాజీ నాయక్.. జోగి రమేశ్ కుటుంబ సభ్యులతో కుమ్మక్కై, సీఐడీ అటాచ్‌మెంట్‌లోని భూకబ్జాకు సహకరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తక్షణం భూములను సంరక్షించేలా తగు ఆదేశాలివ్వాలని కోరారు. విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం గ్రామం సర్వే నంబరు 87లో 2160 గజాల విస్తీర్ణంలో ఉన్న తమ భూములను గతంలో సీఐడీ అటాచ్ చేసిందని, వాటిని జోగి రమేశ్ కుటుంబ సభ్యులు కబ్జా చేసి విక్రయించారని తెలిపారు. రక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. పిటిషన్‌లో ప్రతివాదులుగా హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఐడీ అదనపు డీజీపీ, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్, నున్న సబ్ రిజిస్ట్రార్, కొత్తపేట సీఐతో పాటు భూమిని కబ్జా చేసిన జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావు, వారి నుంచి భూమిని కొన్న పడిగపాటి దుర్గాప్రసాద్, సోముల దుర్గాభవాని, సోముల వెంకటేశ్వరరావు, పడిగపాటి సుబ్బారెడ్డి, పడిగపాటి బాలమ్మను చేర్చారు.

### ఏం జరిగిందంటే..

అంబాపురం ఆర్ఎస్ నంబరు 87లో మొత్తం 18.33 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమి యజమానులుగా కళ్లెం సాంబిరెడ్డి, కాకర్లపూడి అన్నపూర్ణ, యలవర్తి దేవేంద్ర ప్రసాద్, కళ్లెం అశోక్‌రెడ్డి, కళ్లెం రంగారెడ్డి, కళ్లెం శివప్రసాదరెడ్డి, గోకరాజు ఉమాదేవి, ఆరుమళ్ల రామలింగారెడ్డి, గరికపాటి జయలక్ష్మి పేర్లు ఉన్నాయి. ఇందులో గరికపాటి జయలక్ష్మికి 2.81 ఎకరాలు ఉండగా, అందులో 65 సెంట్లు లేదా 3120 గజాలు అల్లూరి కృష్ణమూర్తికి విక్రయించారు. ఆయన అగ్రిగోల్డ్ యజమానులైన అవ్వా ఉదయభాస్కర్, వెంకట సుబ్రమణ్యం తదితరులకు 2293.05 గజాలు విక్రయించారు. ఇదే భూమిలో 2160 గజాలను జోగి కుటుంబ సభ్యులు దొంగ పత్రాలతో కబ్జా చేశారు. అగ్రిగోల్డ్ భూముల చెంతనే ఆర్ఎస్ నంబరు 88లో మొత్తం 7.47 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో కనుమూరి వెంకట రామరాజు, కనుమూరి వెంకట సుబ్బరాజు కుటుంబ సభ్యుల పేరున 4 ఎకరాలు ఉంది. ఈ భూమిని వారు బొమ్మ వెంకట చలమారెడ్డికి విక్రయించారు. చలమారెడ్డి అందులో ఎకరాన్ని 2001లో పోలవరపు మురళీమోహన్‌కు విక్రయించారు. మురళీమోహన్ తాను కొన్న ఎకరాలో 2003లో ప్లాట్లు వేసి విక్రయించేశారు. తిరిగి 2014లో మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ తరఫున అడుసుమిల్లి మోహనరామదాసుకు విక్రయించారు. మోహనరామదాసు నుంచి 2022లో జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్ కలిసి భూమిని కొన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ భూమిని కొన్న జోగి కుటుంబ సభ్యులు సర్వే నంబరు 88లో భూమి లేదని గుర్తించి దాన్ని స్వీయ సవరణ దస్తావేజుతో సర్వే నంబరు 87గా మార్పు చేసి అగ్రిగోల్డ్ భూముల కబ్జాకు ప్లాన్ వేశారు. అధికారులు సహకరించారు. ఆ భూమిని తిరిగి విజయవాడ భవానీపురంలో వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులు పడిగపాటి దుర్గాప్రసాద్, సోముల దుర్గాభవానీ, సోముల వెంకటేశ్వరరావు, పడిగపాటి సుబ్బారెడ్డి, పడిగపాటి బాలమ్మకు విక్రయించేసి జోగి కుటుంబ సభ్యులు చేతులు దులిపేసుకున్నారు.



దొంగలు ధ్వంసం చేసిన ఎస్‌బీఐ ఏటీఎం

# గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలో చోరీ

- అనంతపురంలో 29.81 లక్షలు అపహరణ
- కర్ణాటకలో ఇద్దరి పట్టివేత? పరారీలో మరొకరు

అనంతపురం క్రైం, ఆగస్టు 4: ముఖాలకు కర్చీఫ్‌లు కట్టుకొని ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగలు.. సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ర్పే చేసి, గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మెషిన్‌ను తెరిచి రూ.29.81 లక్షలు చోరీ చేశారు. అనంతపురం రామ్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం వేకువ ఝామున 2.40 గంటలకు ఈ ఘటన జరిగింది. వెంటనే ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అలారం మోగడంతో అక్కడి నుంచి అనంతపురం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సమాచారం అందింది. అప్రమత్తమైన డీఎస్పీ టీవీవీ ప్రతాప్, సీఐలు ప్రతాప్‌రెడ్డి, రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. అయితే పావుగంటలోనే దొంగలు పని ముగించుకుని కారులో పరారయ్యారు. ఆ వాహన లొకేషన్‌ను పోలీసులు టోల్‌గేట్ల ఫాస్టాగ్ ఆధారంగా పట్టేశారు. అనంతపురం ఎస్పీ కేవీ మురళీకృష్ణ కర్ణాటక పోలీసులతో మాట్లాడగా, అక్కడి ఓ పోలీసు వాహనాన్ని దొంగలు ఢీకొట్టారు. అనంతరం బాగల్‌కోట సమీపంలో ఇద్దరు దొంగలను పట్టుకున్నట్టు తెలిసింది. చోరీలో మొత్తం ముగ్గురు పాల్గొనగా, మూడో నిందితుడి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. దొంగలు హరియాణాలోని మేవాడ్ ప్రాంతానికి చెందినవారని తెలుస్తోంది. అనంతపురంలో ఏటీఎం చోరీకి దొంగలు మూడు, నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించినట్లు సమాచారం.



ఏటీఎంలో సీసీ కెమెరాకు నలుపు రంగు స్ర్పే చేస్తున్న దొంగ(సీసీ టీవీ ఫుటేజీ)

# కోర్బా రైల్లో మంటలు



కోర్బా రైలు నుంచి వ్యాపించిన పొగ



పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్ లోపలి భాగం

- విశాఖ రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం
- ఖాళీ రైలు కావడంతో తప్పిన ప్రాణనష్టం

విశాఖపట్నం, ఆగస్టు 4: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కోర్బా-విశాఖ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (18517) ఏసీ కోచ్‌ల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయం 6.25 గంటలకు నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు ఈ రైలు వచ్చింది. ప్రయాణికులు దిగి వెళ్లిపోయాక ఇంజన్‌ను కూడా తొలగించారు. మొత్తం హెచ్‌వోజీ పవర్‌కట్ చేసి, ర్యాక్‌ను కోచింగ్ కాంప్లెక్స్ తరలించేందుకు వీలుగా ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేశారు. దీంతో సిబ్బంది కోచ్‌ల ప్రవేశద్వారాలను కూడా మూసివేశారు. నిర్వహణ అనంతరం ఈ ర్యాక్‌ను తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు వినియోగించాల్సి ఉంది. అయితే ఉదయం 9.45 గంటల సమయంలో బీ-7 కోచ్ నుంచి మంటలు, పొగ వ్యాపించాయి. క్షణాల్లో మరో మూడు కోచ్‌లకు మంటలు వ్యాపించాయి. బీ-7 కోచ్ పూర్తిగా దగ్ధం కాగా, బీ-6, బీ-5, ఎం-1 ఏసీ కోచ్‌లు పాక్షికంగా కాలిపోయాయి. ముందుగా బీ-7 ఏసీ కోచ్ బాత్‌రూం నుంచి మంటలు వ్యాపించి, కోచ్‌లోని బెడ్ షీట్స్‌తో పాటు బెర్తులకు అంటుకున్నాయి. దాన్ని గుర్తించేలోపే బీ-7కు ఒక పక్క ఉన్న ఎం-1 కోచ్‌కు, మరో పక్క ఉన్న బీ-6 కోచ్‌కు మంటలు వ్యాపించడంతో స్టేషన్‌ను దట్టమైన పొగ కమ్మేసింది.

### బెంబేలెత్తిన ప్రయాణికులు

కోచ్‌ల నుంచి ఒక్కసారిగా మంటలు, పొగ రావడంతో స్టేషన్‌లో రైళ్ల కోసం నిరీక్షించిన ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. భయాందోళనలతో పరుగులు తీశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, రైల్వే సిబ్బంది తక్షణమే ఉన్నతాధికారులతో పాటు అగ్నిమాపక దళానికి సమాచారమిచ్చారు. వెంటనే స్టేషన్‌కు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. నాలుగో నంబరు ప్లాట్‌ఫామ్ మీదుగా ఫైర్ ఫైటింగ్ ఫోమ్స్, ఫైర్ హోస్ రీల్స్ తీసుకువచ్చేందుకు వీలు లేకపోవడంతో ముందుగా కోచ్‌ల వద్దకు చేరుకుని, స్టేషన్‌లోని పైప్ లైన్స్ ద్వారా వచ్చే నీటితో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికి ఫైర్ ఫైటింగ్ ఫోమ్స్, ఫైర్ హోస్ రీల్స్ వంటి పరికరాలు అందుబాటులోకి రావడంతో కోచ్ కిటికీ అద్దాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించి, మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఖాళీగా ఉన్న రైల్లో ప్రమాదం సంభవించడంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.

### బాత్‌రూమ్‌లోనే ప్రమాదం

ముందుగా బీ-7 కోచ్ బాత్‌రూమ్‌లోనే మంటలు ప్రారంభమయ్యాయని అగ్నిమాపక దళం ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. అవి పక్క కోచ్‌లకు వ్యాపించాయని తెలిపింది. అయితే రైల్వే అధికారులు చెబుతున్నట్టుగా బీ-7, బీ-6, ఎం-1 కోచ్‌లకే కాకుండా బీ-5 కోచ్‌కు కూడా మంటలు వ్యాపించాయని, వాటిని అదుపుచేశామని ఫైర్ సిబ్బంది తెలిపారు. కోచ్‌లో అగ్నిమాపక పరికరం కనిపించలేదని చెప్పారు. మంటలను పూర్తిగా అదుపుచేసిన తర్వాత పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌తోపాటు పాక్షికంగా దగ్ధమైన బీ-6, బీ-5, ఎం-1 కోచ్‌లను యార్డుకు, మిగిలిన కోచ్‌లను నిర్వహణ పనులకు తరలించారు.

### అసలేం జరిగింది.. విచారణకు ఆదేశం

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ సరఫరా లేకుండా మూడు గంటలకుపైగా ప్లాట్‌ఫామ్‌పై నిలిచిన కోచ్‌లలో ప్రమాదం సంభవించడంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశాలు లేవని కొందరు చెబుతుండగా.. ఏసీ కోచ్‌లకు వినియోగించే బ్యాటరీల ద్వారా షార్ట్ సర్క్యూట్ అయి ఉంటుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రమాద స్థలాన్ని రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ ప్రమాదంపై విచారణ చేపట్టారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ఇటువంటి ప్రమాదం జరగడంతో కోచ్‌లను తయారుచేసిన ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్), తూర్పుకోస్తా రైల్వే హెడ్ క్వార్టర్స్‌తోపాటు లఖ్‌నవూలోని ఆర్‌డీఎస్‌వోకు చెందిన నిపుణుల బృందాలతో విచారణ చేపట్టారు.

## వక్ఫ్ బోర్డుల అపరిమిత అధికారానికి చెక్!

- పార్లమెంటు ప్రస్తుత సమావేశాల్లోనే సవరణ బిల్లు
- 40 సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: వక్ఫ్ చట్టంలో పలు సవరణలకు కేంద్రం సమాయత్తమైంది. ప్రధానంగా.. కనిపించిన ప్రతి భూమీ, ఆస్తీ తమదేనంటూ నియంత్రణలోకి తీసుకుంటున్న వక్ఫ్ బోర్డుల అపరిమిత అధికారాన్ని కట్టడి చేయనుంది. మరింత పారదర్శకత కోసం సదరు భూములు/ఆస్తుల విషయంలో కూలంకష తనిఖీలను తప్పనిసరి చేయనుంది. అలాగే వక్ఫ్ బోర్డుల్లో మహిళలకూ తప్పనిసరి చోటు కల్పిస్తూ వక్ఫ్ చట్టంలోని 9,14 సెక్షన్లను సవరించాలని ప్రతిపాదించింది. దాదాపు 40 సవరణలతో కూడిన సవరణ బిల్లును మోదీ కేబినెట్ ఇటీవల ఆమోదించింది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే దీనిని ప్రవేశపెట్టనుంది. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగానికి అరికట్టేందుకు వాటిపై పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని కేంద్రం తన బిల్లులో పేర్కొంది. వక్ఫ్ బోర్డులకు ప్రస్తుతం విస్తృత అధికారాలు ఉన్నాయి. ఏదైనా భూమి/ఆస్తిని తమది ప్రకటించడం ద్వారా పలు వివాదాలకు, అధికార దుర్వినియోగానికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు 2022 సెప్టెంబరులో తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగం తాలూకా తిరుచెందురై గ్రామం మొత్తంపై తనకే హక్కు ఉందని తమిళనాడు వక్ఫ్ బోర్డు ప్రకటించింది. కావేరీ తీరాన ఉన్న సుప్రసిద్ధ చంద్రశేఖరస్వామి ఆలయం, దాని భూములు కూడా తనవేనని పేర్కొంది. ఈ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు వెళ్లినప్పుడు.. వక్ఫ్ బోర్డు నుంచి ఎన్‌వోసీ తీసుకురావాలని తిరుచిరాపల్లి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. దీనిపై గ్రామస్తులు మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్దఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. దరిమిలా ఓ రెవెన్యూ అధికారి ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం క్రయవిక్రయాలను ఎప్పటిలాగే కొనసాగించాలని నిర్ణయించారు. ఇలాంటి వివాదాలను అరికట్టేందుకు కేంద్రం చట్ట సవరణలకు ఉపక్రమించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పైగా వక్ఫ్ బోర్డుల్లో తమకు చోటివ్వడం లేదని, చట్టంలో మార్పులు తీసుకురావాలని ముస్లిం మేధావులు, మహిళలు, షియాలు, బొహ్రా ముస్లింలు చాలాకాలంగా కోరుతున్నారు. హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. జమ్మూకశ్మీరులో కూడా ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు చేపట్టాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సాగరం.. ముందుకొస్తోంది!

- 2100 నాటికి పెరగనున్న సముద్ర మట్టాలు
- ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు పెరిగే అవకాశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



వాతావరణ మార్పులు.. కర్బన ఉద్గారాల వలన పెరుగుతున్న సాధారణ ఉష్ణోగ్రతలు.. వెరసి సముద్ర మట్టాలు ప్రమాదకర స్థాయిలో పెరగనున్నాయి. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరానికీ ముప్పు ముంచుకొస్తోంది. 2100 సంవత్సరం నాటికి సాధారణ ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలు పెరుగుతాయి. దీనివల్ల సముద్ర మట్టం 0.6 మీటర్లు పెరగనుంది. రాష్ట్రంలోని తీరప్రాంతంలో ఉన్న 282 గ్రామాల్లోని సుమారు 13 లక్షల మందికి ముప్పు పొంచి ఉంది. గోదావరి, కృష్ణా, పులికాట్ సరస్సు ప్రాంతాల్లో సముద్రం, నదీ జలాలు కలిసే ప్రాంతాల్లోకి సముద్రం మరింత చొచ్చుకు వస్తుంది. వాతావరణ మార్పులతో దక్షిణ ఏపీలో వర్షాలు కురిసే రోజులు పెరగనుండగా.. రాయలసీమలో ఉష్ణోగ్రతలు పెరిగి కరువు ఛాయలు నెలకొంటాయి. చెన్నైకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం) రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన నివేదికలో పేర్కొన్న ఈ విషయాలు ఆందోళన రేపుతున్నాయి.

### తీరానికి పొంచి ఉన్న ముప్పు..

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై అధ్యయనం చేసేందుకు 2022 నవంబరులో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఇది అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోంది. అందులోభాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో వాతావరణ మార్పులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ రివైజ్డ్ స్టేట్ యాక్షన్ ప్లాన్ తయారీ బాధ్యతను చెన్నైకు చెందిన ఎన్‌సీఎస్‌సీఎంకు అప్పగించింది. ఈ సంస్థ రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు, గత ఉష్ణోగ్రతల వివరాలు, ఛాయాచిత్రాలు, గత కొన్నేళ్లలో తీరంలో చోటుచేసుకున్న మార్పులు, క్షేత్రస్థాయి సర్వేలు, మ్యాపులను పరిశీలించింది. ఆధునిక రిమోట్ సెన్సింగ్ ద్వారానూ అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం మేరకు స్టేట్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఎస్‌ఏపీసీసీ) పేరుతో రాష్ట్రానికి నివేదిక అందించింది. గత నెల 26న వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో కూడిన స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో ఈ తుది నివేదికపై కూలంకుషంగా చర్చించారు. 2100 సంవత్సరం నాటికి రాష్ట్రంలో సాధారణ సగటు పగటి ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు పెరుగుతాయని ఈ నివేదిక తేల్చింది. దీనివల్ల రాష్ట్రంలో తీరప్రాంత సముద్రమట్టం 0.6 మీటర్లు పెరుగుతుందని హెచ్చరించింది. ఫలితంగా రాష్ట్రంలో 43 శాతం తీరప్రాంతం వెరీ హైరిస్క్ జోన్, 35 శాతం తీరం హైరిస్క్ జోన్‌లోకి వెళ్లబోతోందని తెలిపింది. దీనివల్ల 282 తీరప్రాంత గ్రామాల్లో 12.9 లక్షల మందికి ముప్పు ఉందని తేల్చింది. దక్షిణ ఏపీలో అధిక వర్షాలు ఉంటాయని, ఉత్తర ఏపీలో వానలు తగ్గుతాయని వివరించింది. తీరంలో తరచూ తీవ్ర తుపాన్లు వస్తాయని, తద్వారా పంట నష్టాలు అధికంగా ఉంటాయని వివరించింది. అకాల వర్షాలు, భూమి కోత అధికంగా ఉంటుందని తెలిపింది. తీరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కొద్దిపాటి ఉష్ణోగ్రతలు, దూరంగా ఉన్న రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని విశ్లేషించింది. దీనివల్ల కరువు ఛాయలు పెరిగి, తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని తేల్చింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతాయని తెలిపింది. వాతావరణ పరిస్థితులు కొంతమేరకు దెబ్బతింటాయని వివరించింది. వాతావరణ మార్పులవల్ల ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు ముప్పు పొంచి ఉందని తెలిపింది.

### గోదావరి, కృష్ణా, పులికాట్‌లకూ ముప్పే..

ఉష్ణోగ్రతలు, సముద్ర మట్టం పెరగడం వల్ల సంగమ ప్రాంతాల్లో ముప్పు అధికంగా ఉంటుందని ఈ అధ్యయనం తేల్చింది. గోదావరి, కృష్ణా, పులికాట్ సరస్సు ప్రాంతాల్లో ఈ ముప్పు తీవ్రంగా ఉంటుందని పేర్కొంది. నదీ, సముద్రం జలాలు కలిసే ప్రాంతాల్లో చప్పనీటి ప్రవాహంలోకి సముద్రపు ఉప్పు నీరు మరింత ముందుకు వస్తుందని తెలిపింది. తద్వారా కోత అధికంగా ఉంటుందని తేల్చింది. కృష్ణానది సముద్రంలో కలిసేచోట ముప్పు ఇంకా ఎక్కువని తేల్చింది. షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ అధ్యయనం కింద దేశంలో సముద్రపు కోత అధికంగా ఉన్న 5 తూర్పు తీర రాష్ట్రాల్లో ఏపీ నాలుగో ప్రభావిత రాష్ట్రంగా ఉందని వివరించింది. వాతావరణ మార్పుల వల్ల అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం, చిత్తూరు, కడప, నంద్యాల, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో కరువు ఛాయలు పెరుగుతాయని వివరించింది. దీన్ని అరికట్టడానికి భూగర్భ జలాలు 3 నుంచి 8 మీటర్లలోపు ఉండేలా చూడాలని నివేదిక వివరించింది. వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఎకో సిస్టమ్‌ను కాపాడడం ద్వారా నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చని సూచించింది. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ విధానం పెంచడం వల్ల వందలాది మండలాలను కాపాడవచ్చని తెలిపింది.

### నష్ట నివారణకు ఏం చేయాలంటే!

- మడ అడవుల పునరుద్ధరణ చేపట్టాలి. ఇందుకోసం మత్స్యకారుల సాయం తీసుకోవాలి. తీరంలో కోత పెరిగిన ప్రాంతాల్లో ఆయిల్ పాం, సరుగుడు చెట్ల పెంపకం చేపట్టాలి. సముద్ర తీరంలో అలల తీవ్రత అధికంగా ఉన్నచోట కిలోమీటరు వరకు వీటిని పెంచాలి.
- విద్యుత్ అధిక వినియోగం వల్ల 2005 నుంచి 2018 వరకు కాలుష్య ఉద్గారం 68 నుంచి 79 శాతానికి పెరిగింది. వాతావరణ మార్పులను అదుపులోకి తెచ్చేందుకు సోలార్, గ్రీన్‌హైడ్రోజన్‌ను ప్రోత్సహించాలి.
- విద్యుత్ వాహనాల వాడకాన్ని పెంచాలి. రహదారులపై 51 వేల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.
- నాన్ ఫారెస్ట్ ఏరియాలో 11.06 లక్షల హెక్టార్లలో చెట్లు నాటాలి. 15.97 లక్షల హెక్టార్లలో తోటలు పెంచాలి.
- కరువు ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో తక్కువ తడి అవసరమయ్యే పంటలు, తృణ ధాన్యాల సాగును ప్రోత్సహించాలి.

## ఎల్‌నినో బలహీనపడ్డాక కుంభవృష్టే!

- 2003 తరహాలో ఈ నైరుతిలోనూ భారీ వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడిన తర్వాత వచ్చే నైరుతి సీజన్‌లో దేశంలో కుంభవృష్టి వర్షాలు కురుస్తాయన్న అంచనాలు నిజమయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో దక్షిణాన కేరళ నుంచి ఉత్తరాదిన హిమాచల్‌ప్రదేశ్, తూర్పున అసోం నుంచి పశ్చిమాన గుజరాత్ వరకు అనేక రాష్ట్రాల్లో కుంభవృష్టి వర్షాలతో వరదలు పోటెత్తాయి. అయితే ప్రస్తుత సీజన్‌ను 2003 నైరుతి రుతుపవనాల సీజన్‌తో పలువురు వాతావరణ నిపుణులు పోల్చుతున్నారు. 2002లో సంభవించిన ఎల్‌నినో ప్రభావంతో ఆ ఏడాది దేశంలో అత్యంత దారుణమైన దుర్భిక్షం నెలకొంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన కరువు సంవత్సరంగా 2002 నమోదైంది. 2003లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితుల అనంతరం లానినా సంభవించింది. దీంతో 2003 నైరుతి సీజన్‌లో పుష్కలమైన వర్షాలు కురిశాయి. అసోం, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లో వరదలు సంభవించి వందల మంది మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇదిలాఉండగా 2023లో కూడా ఎల్‌నినో ప్రభావంతో దేశంలో నైరుతి సీజన్‌లో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అనేక రాష్ట్రాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొని, రిజర్వాయర్ల నీటి మట్టాలు పడిపోయాయి. ఆ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదై సుమారు 4నెలల సుదీర్ఘ వేసవి కొనసాగింది. 2024 ఏప్రిల్ నుంచి ఎల్‌నినో బలహీనపడి మే నెలాఖరుకు తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నైరుతి సీజన్‌లో కుంభవృష్టి వర్షాలు కురిశాయి. 2003 కంటే ఈ ఏడాది నైరుతి (ఆగస్టు, సెప్టెంబరు)లో మరింత ఎక్కువగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు విశ్లేషించారు.

### కోస్తాలో ఎండ తీవ్రత

రాష్ట్రంలో ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు లేకపోవడంతో నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. దీంతో ఆదివారం అక్కడక్కడా తప్ప అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా మారి ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరు, బాపట్లలో 38.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతతో పాటు పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.





నిండుకుండలా సాగర్ జలాశయం

576 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం(ఇన్‌సెట్)

# నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

- 576 అడుగులు దాటిన జలాశయ నీటి మట్టం
- ఉదయం 8 గంటలకు గేట్లు తెరిచేందుకు ఏర్పాట్లు
- తీరంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

అమరావతి/నరసరావుపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న కృష్ణమ్మ నాగార్జునసాగర్ జలాశయానికి వడివడిగా చేరుతోంది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సాగర్ డ్యాం నిండుకుండలా మారింది. జలాశయంలో నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరువ కావడంతో సోమవారం క్రస్ట్‌గేట్లను తెరవనున్నారు. ఇందుకోసం జల వనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రాజెక్టు 6 క్రస్ట్ గేట్లను ఎత్తి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు నల్లగొండ జిల్లా (తెలంగాణ)కు చెందిన సీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరిగితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. సాగర్ జలాశయానికి 4,27,711 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు 576.10 అడుగులకు చేరింది. నీటినిల్వ గరిష్ఠ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 271.90 టీఎంసీల నీరు చేరింది. డ్యాం నుంచి 37,873 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదే స్థాయిలో ప్రవాహం రానున్న వారం రోజులు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, పులిచింతలలో 45.77 టీఎంసీలకు గాను కేవలం 5.57 టీఎంసీల జలాలు మాత్రమే నిల్వ ఉన్నాయి ప్రకాశం బ్యారేజీలో 3.07 టీఎంసీలకు 2.89 టీఎంసీల మేర నిల్వ ఉంది.

### స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం



పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి

పోలవరం, ఆగస్టు 4: ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు వద్ద మూడు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి నీటిమట్టం ఆదివారం స్వల్పంగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగుల జలాలతో నీటిమట్టం పెరిగింది. భద్రాచలం వద్ద 36.70 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,98,968 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.180 మీటర్లు, దిగువన 22.37 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## మోసం గురూ...

- యాపిల్ ఫోన్ బుక్‌చేస్తే యాపిల్స్ వచ్చాయి!
- జనాన్ని దోచేస్తున్న నకిలీ యాప్‌లు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 4: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పాతూరుకు చెందిన ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ చూస్తుండగా రూ.48వేల విలువ చేసే యాపిల్ ఫోన్.. స్పెషల్ ఆఫర్‌లో రూ.12వేలకే వస్తుందని యాడ్‌లో కనిపించింది. ఇది ఆ యువకుడిని బాగా ఆకర్షించింది. సెల్‌ఫోన్ ధర గురించి గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అందులోనూ అదే ధర కనిపించడంతో మళ్లీ వేరే ఆన్‌లైన్ యాప్‌లలో ఆ సెల్ ధర వెతికాడు. కానీ అక్కడ పెద్దగా ఆఫర్ లేకపోవడంతో ముందుగా సేవ్ చేసుకున్న ఫేస్‌బుక్ యాప్‌లోనే ఆర్డర్ పెట్టేందుకు నిర్ణయించుకున్నాడు. క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్ కూడా ఉండటంతో మరింత ధైర్యంగా సెల్‌ఫోన్ బుక్ చేసుకున్నాడు. అనుకున్నట్టుగానే సెల్‌ఫోన్ బాక్స్ కొరియర్ ద్వారా వచ్చింది. పోస్ట్‌మెన్‌కు రూ.12వేలు చెల్లించగా అతడు వెళ్లిపోయాడు. తీరా బాక్స్ ఓపెన్ చేసి చూడగా, రెండు నిజమైన యాపిల్స్ ఉండడంతో కంగుతిన్నాడు. వెంటనే డెలివరీ ఏజెంట్ వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. తాను చెల్లించిన సొమ్ము వెనక్కి ఇవ్వాలని కోరాడు. అయితే.. వస్తువు ఇవ్వడం వరకే తన బాధ్యత అని, దాన్ని రిటర్న్ చేయాలంటే ఏ యాప్‌లో ఆర్డర్ పెట్టారో ఆ యాప్‌లోనే రిటర్న్ ఆప్షన్ ద్వారా తిరస్కరించాలని సూచించాడు. అయితే ఆ యాప్‌లో ఆ ఆప్షన్ లేదు. ఆర్డర్ బుక్‌చేసినప్పుడు వచ్చిన ఫోన్ నంబరు పనిచేయడంలేదు. దీంతో తాను నకిలీ యాప్‌తో మోసపోయానని గ్రహించినా, ఏం చేయాలో తెలీక మిన్నకుండిపోయాడు. ఇదే మాదిరిగానే తాడేపల్లిగూడెంలోని ఎలక్ట్రానిక్ వస్తువు కోసం ఆర్డర్ పెడితే ఆట వస్తువు రావడంతో మరో వినియోగదారుడు అవాక్కయ్యాడు. ఇలా తరచూ ఏదో ఒక చోట నకిలీ యాప్‌లతో కొనుగోలు మోసాలు వెలుగుచూస్తున్నాయి.



సెల్‌ఫోన్‌కు బదులు కొరియర్‌లో వచ్చిన యాపిల్స్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.